www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 257
శుక్రవారం 09-03-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

ఓట్లే లక్ష్యం

అంకెల గమ్మత్తు


అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెడుతున్న యనమల


బడ్జెట్ పత్రాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



రూ.1,91,063.61 కోట్లు

భారీ ఎన్నికల బడ్జెట్

- గత ఏడాది కంటే రూ.34,064.61 కోట్లు ఎక్కువ
- రెవెన్యూ వ్యయం రూ.1,50,270.99 కోట్లు
- రూ.5,235 కోట్ల రెవెన్యూ మిగులు అంచనా
- ఆర్థిక లోటు సుమారు రూ.24,205.21 కోట్లు
- శాసనసభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు

3లో

కష్టాలున్నాయంటూనే ఆర్థికమంత్రి యనమల మెగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలలో ఓట్లు పొందడమే లక్ష్యంగా బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. అందులో అంకెల గ'మ్మత్తు' జొప్పించారు. లోటు భారీగా ఉందంటూనే రెవిన్యూలో మిగులు చూపడానికి జిమ్మిక్కు చేశారు. గత ఏడాది బడ్జెట్టే బడాయి అనుకుంటే ఈసారి మరింత భేషజం ప్రదర్శించారు. ప్రతిపక్షాలు లేకుండా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఇది బడాయి బడ్జెట్

గ్రామీణాభివృద్ధి, సంక్షేమం పేరిట భారీ కేటాయింపులు చూపించారు. నిధుల ఎక్కడి నుంచి తెస్తారో వివరించలేదు. ఇది కేవలం ఎన్నికల పద్దులే.

– కె. రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

అత్యాశల బడ్జెట్

గ్రాంట్ ఇన్ ఎయిడ్ భారీగా చూపారు. ఇది ముమ్మాటికి ప్రజలను మభ్యపరచడానికే. సంక్షేమం పేరుతో భారీ కోతలు పెట్టారు. వెనుకబడిన జిల్లాల ప్రస్తావనే లేదు.

– పి. మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

ఏపీ బడ్జెట్ 2018 -19

వివరాలు లోపలి పేజీల్లో

వ్యవ'సాయం' అంతంతే..

రూ.19070.36 కోట్లు కేటాయింపు ప్రతిపాదన



- రుణ మాఫీ పథకానికి రూ.4,100 కోట్లు
- 'ఉపాధి' అనుసంధానానికి రూ.4,730 కోట్లు
- 2022 నాటికి 5 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల కరవు నివారణకు రూ.100 కోట్లు

విశాలాంధ్ర -అమరావతి :

రాష్ట్ర బడ్జెట్ రైతన్నకు నిరాశే మిగిల్చింది. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2017-18లో రూ.18,214 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే 2018-19 సంవత్సరానికి మాత్రం రూ.19070.36 కోట్లతో మమ అనిపించేశారు. ప్రభుత్వం రైతు రుణ మాఫీ విషయంలో అదే దారి అనుసరించింది. రుణ మాఫీ పథకానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.3,600 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో కేవలం రూ.4,100 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. పశుసంవర్ధక శాఖకు గతంలో రూ.960 కోట్లుగా ఉండగా, ఈసారి రూ.1223.40 కోట్లుగా ఉంది. ఇక వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానానికి గతంలో రూ.6,040 కోట్లు కేటాయించగా ఇపుడు రూ.4,730 కోట్లను మాత్రమే కేటాయింపు ప్రతిపాద న చేశారు. ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాలకు తక్కువ కేటాయింపులతో చేతులు దులుపేసుకుంది. ఇదిలాఉండగా వడ్డీ లేని రుణాలకు పైసా కూడా పెంచకుండా గతంలో వలే రూ.172 కోట్లుగా బడ్జెట్‌లో కేటాయింపు ప్రతిపాదనలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల బడ్జెట్ 2018-19 సంవత్సరానికి మొత్తం రూ.19070.36 కోట్లను ప్రతిపాదించారు. గురువారం శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాసనమండలిలో ప్రత్తిపాటి పుల్లారావు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయంగా

- మిగతా 2 లో



మోడీ ప్రభుత్వాన్ని

గద్దె దించుదాం

విగ్రహాల కూల్చివేత దారుణం

మోడీ స్పందించకపోవడంపై సురవరం ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :

మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి, హిందుత్వ ఫాసిస్టు ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను కట్టడి చేయడానికి ఉద్యమాలు సాగించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. విగ్రహాలను కూల్చివేయడం మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించి తీరుతామని స్పష్టంచేశారు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో విశాల ఐక్యవేదికను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి మహాసభలు ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న క్రమంలో హైదరాబాద్ నగర సమితి ఆధ్వర్యంలో సామూహిక

- మిగతా 2 లో

వీళ్లిక్కడ.. వాళ్లక్కడ..!

- కేంద్రంలో టీడీపీ మంత్రులు అశోక్, సుజనాల రాజీనామా
- రాష్ట్ర మంత్రి పదవులకు గుడ్‌బై చెప్పిన కామినేని, మాణిక్యాలరావు
- తొలుత ఇరుపార్టీల్లో మంతనాలు, వాడీవేడీ మాటలు






ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న సుజనా, అశోకగజపతి రాజు, తదితరులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీల సాధన వ్యవహారం తెలుగుదేశం, బీజేపీ మంత్రుల రాజీనామాలకు దారి తీసింది. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కామినేని శ్రీనివాసరావు, పైడికొండల మాణిక్యాలరావులు ఇక్కడ రాజీనామాలు చేయగా, కేంద్రంలో మోడీ సర్కారులో మంత్రులుగా ఉన్న సుజనాచౌదరి, అశోక్ గజపతిరాజులు అక్కడ రాజీనామాలు చేశారు. చాలా కాలంగా రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ, నిధుల కేటాయింపుపై కేంద్రంతో మంతనాలు జరుపుతూ వచ్చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు వామపక్షాలు, ఇతర విపక్షాలు ఢిల్లీలో ప్రత్యేక తరగతి హోదా ఆందోళన చేపట్టడంతో బాబు ఒక్కసారిగా హోదా మాట అందుకున్నారు. బుధవారం రాష్ట్ర బడ్జెట్‌పై గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాల్సిందేనని, రెండు రోజులే డెడ్‌లైన్ అంటూ స్పష్టం చేశారు. అయితే కొన్ని గంటలకే కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హోదా అనేదే లేదంటూ తేల్చేయడంతో అధికార టీడీపీ, బీజేపీలలో ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. అప్పటికప్పుడు చంద్రబాబు అందుబాటులోని మంత్రులతో మంతనాలు సాగించి కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగాలని నిర్ణయించారు. ఆ మేరకు సుజనా చౌదరి, అశోక్ గజపతిరాజులను రాజీనామాలు చేయాలని కోరారు. ఆ ప్రకటనకే సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వంలోని బీజేపీ మంత్రులు కామినేని, మాణిక్యాలరావులు గురువారం ఉదయమే సీఎం కార్యాలయానికి వెళ్లి చంద్రబాబుకు రాజీనామాలు సమర్పించారు. ఇటు సుజనాచౌదరి,

- మిగతా 2 లో

ఇదీ లోకం!



హస్తినలో మూడో రోజూ హోరు

- నేతల అర్ధనగ్న ప్రదర్శన
- రామకృష్ణ, చలసాని, ముప్పాళ్ల తదితరుల అరెస్టు
- ఏపీ భవన్ నుంచి ర్యాలీ
- పార్లమెంటుకు కూత వేటు దూరంలో ఉద్రిక్తత
- ముట్టడికి ఎర్రదళం యత్నం
- హోదా వచ్చే వరకు ఆందోళన : రామకృష్ణ

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో

ప్రత్యేక హోదా కోసం సీపీఐ రాష్ట్ర నేతలు, కార్యకర్తలు మూడో రోజు కూడా హస్తినలో ఆందోళన నిర్వహించారు. గురువారం న్యూఢిల్లీలో ఏపీభవన్ నుంచి సీపీఐ కార్యకర్తలు, నేతలు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ పార్లమెంటు ముట్టడికి ర్యాలీగా బయలుదేరారు. అయితే పార్లమెంటుకు కూత వేటు దూరంలోనే పోలీసు రంగంలోకి దిగి సీపీఐ కార్యకర్తలను అడ్డుకున్నారు. సుమారు 200 మంది సీఆర్‌పీఎఫ్, పారామిలిటరీ దళాలు సీపీఐ ర్యాలీని అడ్డుకున్నాయి. ర్యాలీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ , సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రత్యేక హోదా ఉద్యమ సాధన సమితి నేత చలసాని శ్రీనివాసరావులు, ఏఐఎస్ఎఫ్ , మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు. సీపీఐ కార్యకర్తల నినాదాలతో హస్తిన దద్దరిల్లింది. ప్రధాని మోడీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యకర్తలు బ్యారికేడ్లను దాటేందుకు ప్రయత్నించారు. మహిళా సంఘం కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని, పోలీస్ బ్యారికేడ్లను తోసి,పోలీసులను నెట్టుకుంటూ పార్లమెంటువైపు దూసుకువెళ్ళేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మహిళా కార్యకర్తలను అరెస్టు చేసి బస్‌లో ఎక్కించి మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినా మహిళా నాయకులు తమ పట్టుదల

- మిగతా 2 లో



ఢిల్లీ వీధుల్లో ప్రత్యేకహోదా ర్యాలీలో నినాదాలు చేస్తున్న ముప్పాళ్ల, రామకృష్ణ, చలసాని తదితరులు

రాహుల్‌కు సీనియర్ల పోటు

9లో

హెల్మెట్ పెట్టుకోలేదని వెంబడించిన పోలీసు నిండు గర్భిణి మృతి

9లో

సీపీఎం ఆఫీసుకు మానిక్ సర్కార్ మకాం

9లో

టెర్రరిజంపై పోరుకు అల్జీరియా పిలుపు

అల్జీర్స్ : ఈ ప్రాంతం అత్యంత సంక్లిష్ట పరిస్థితులలో ఉన్నందున టెర్రరిజం నిర్మూలనకు అరబ్ దేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలని అల్జీరియా అధ్యక్షుడు అబ్దల్ అజీజ్‌బౌటీఫ్లికా పిలుపునిచ్చారు. సవాళ్లు మనకు తెలిసినవే. భద్రతా అంశాలలో పరస్పర సహకారాన్ని పటిష్టం చేసుకోవాలని అబ్దల్ అజీజ్ తన సందేశాన్ని అరబ్ దేశాల హోంశాఖ మంత్రుల మండలి 35వ సమావేశంలో చదివి వినిపించారు. అధ్యక్షుడి సందేశాన్ని హోంశాఖ మంత్రి నవురుద్దీన్‌బెడోయి చదివి వినిపించారు. టెర్రరిస్టులు, తీవ్రవాద గ్రూపుల దాడుల మూలంగా అరబ్ దేశాలలో అస్థిరత్వం నెలకొన్నదని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. ఈ సంక్షోభంనుంచి బయటపడేందుకు ఉన్నతస్థాయిలో పరిశీలన పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు. టెర్రరిజం నిర్మూలనకు ముందుగా సాంస్కృతిక అంశాల ప్రస్తావన, సామాజిక వాతావరణం, సోషల్ మీడియా, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలలో అపసవ్యాలను తొలగించాలని అన్నారు. అరబ్ మంత్రుల మండలి సమావేశం గురువారం, శుక్రవారం జరుగుతుంది.

అమెరికాలేని టీటీపీపై త్వరలో సంతకాలు



శాంటియాగొ : పసిఫిక్ ప్రాంతానికి చెందిన 11 దేశాల వాణిజ్య ఒప్పందంపై (టిటిపి) త్వరలో సంతకాలు జరుగుతాయని ఆయా దేశాలు పేర్కొన్నాయి. టిటిపి ఒప్పందంనుంచి అమెరికా గత ఏడాది వైదొలగింది. అధ్యక్షుడు ట్రంప్ తన ఎన్నికల ప్రచారంనాటి నుంచే టిటిపి నుంచి వైదొలగుతామని ప్రకటించారు. ఇదిలావుండగా శాంటియాగోలో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ వాణిజ్య ఒప్పందంపైన గురువారం సంతకాలు జరిగాయి. అమెరికా రోజురోజుకు స్వీయరక్షణ వాదాన్ని ముందుకుతెస్తూ ఒప్పందంనుంచి వైదొలగిన విషయం తెలిసిందే. తాజాగా ప్రకటించిన వాణిజ్య యుద్ధంనుంచి ఉపసంహరించుకోవలసిందిగా ఐరోపా, ఐఎంఎఫ్‌లు తాజాగా ట్రంప్‌ను కోరాయి. ఆ తరువాతనే ఆసియా-పసిఫిక్ వాణిజ్య ఒప్పందంపైన సంతకాలు జరిగాయి. అమెరికా లేకపోయినప్పటికీ ఈ ఒప్పందంవల్ల 500 మిలియన్ ప్రజలు ప్రయోజనం పొందగలరని భావిస్తున్నారు. ఒప్పందం నుంచి ట్రంప్ వైదొలగడంతో టిపిపిలో మిగిలిన 11 దేశాలు వాణిజ్య ఒప్పందాన్ని ఈ జనవరిలో పునఃసమీక్షించాయి. ఈ 11 దేశాల బృందానికి జపాన్, కెనడా నాయకత్వం వహిస్తున్నాయి.

ప్రపంచానికి మేలుచేసే చైనా వృద్ధి



బీజింగ్ : చైనా తిరుగులేని పురోభివృద్ధిని సాధించడంవల్ల అది ప్రపంచానికి మేలు జరుగుతుంది. జిన్‌పింగ్ నాయకత్వంలో ప్రపంచస్థాయికి ఎదగాలని చైనా కోరుకుంటున్నది. చైనా ఎదుగుదలను సహించలేక ఆదేశానికి వ్యతిరేకంగా పలువురు వ్యాఖ్యానిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే ప్రపంచ దేశాలు చైనా వృద్ధిపైన ఆందోళన చెందవలసిన అవసరంలేదని ఆదేశ విదేశాంగమంత్రి వాంగ్‌యి అన్నారు. శాంతి దళాలను సమకూర్చడంలోను, ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో సంఘర్షణల పరిష్కారానికి జరిగే చర్చలలో భద్రతామండలి సభ్యురాలిగా చైనా పాల్గొంటున్నది. ఈ ప్రాంతంలోను, ప్రపంచ వ్యాప్తంగా సమస్యల పరిష్కారంలో చైనా మరింత క్రియాశీలపాత్ర నిర్వహిస్తుందని వాంగ్ తెలిపారు. చైనా పార్లమెంటు సమావేశాల సందర్భంగా వాంగ్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మైన్మార్ సమస్యపైన శాంతిచర్చలు, ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రతినిధి బృందాల మధ్య చర్చలకు చైనా కృషి చేసింది. స్వతంత్ర దేశాలలో జోక్యం చేసుకోరాదన్న నిబద్ధతకు చైనా కట్టుబడివుంది. చైనా వృద్ధిని చూసి పశ్చిమదేశాలు మితిమీరి స్పందిస్తున్నాయి. ప్రపంచ పెత్తనాన్ని కోరుకుంటున్న అమెరికా స్థానంలో చైనా వచ్చి చేరుతుందని ఆదేశానికి చెందిన కొంతమంది ప్రచారం సాగిస్తున్నారు. వ్యూహాత్మకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రత్యర్థులవలెకాక చైనా, అమెరికాలు అనేక రంగాలలో పోటీపడి పనిచేయవచ్చు. ట్రంప్ ప్రకటించిన వాణిజ్యయుద్ధం బహుశా అమెరికాకే నష్టం కలిగించవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో వాణిజ్యయుద్ధం తప్పుడు ఆలోచన అవుతుంది. తమ అధ్యక్షుడు జిన్‌పింగ్ సానుకూలమైన విదేశాంగ విధానాన్ని అనుసరిస్తున్నారు. 2012 నుంచి జిన్‌పింగ్ చైనా దౌత్య విధానాన్ని రూకల్పనచేసి అమలుచేస్తున్నారు. ప్రపంచమంతటా ఆయన దౌత్య విధాన నైపుణ్యాన్ని మెచ్చుకుంటున్నారు. ఆయన 57 దేశాలలో పదవి చేపట్టిన నాటినుంచి పర్యటించారు. 110 మంది విదేశీ అధినేతలతో చర్చలు జరిపారు. చైనా, రష్యాలు భాగస్వామ్యం కలిగిన షాంఘై సహకార సంస్థ అంతర్జాతీయ దౌత్య విధానంలో ప్రముఖపాత్ర నిర్వహిస్తుందని వాంగ్ అన్నారు.

పీఓకేలో నిరసన ప్రదర్శన

ముజఫరాబాద్ (పీఓకే) : ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతం(పీఓకే)లో అజాద్‌కాశ్మీర్ మండలిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. ఈ మండలికి పాకిస్తాన్ ప్రధానమంత్రి అధ్యక్షత వహిస్తారు. 1974లో ఈ ప్రాంతాన్ని కాశ్మీర్ ఆక్రమించింది. అప్పుడు ఏర్పాటైన చట్టానికి తాత్కాలికంగా సవరణలు చేయాలని ప్రాతినిధ్య ప్రభుత్వానికి పూర్తి అధికారాన్ని కల్పించాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. పాకిస్తాన్, పీఓకే మధ్య కాశ్మీర్ మండలి స్పష్టమైన విభజన అని యుకెపిఎన్‌పి నాయకుడు ఇష్టియాక్ అహమ్మద్ వ్యాఖ్యానించారు. అజాద్ కాశ్మీర్ మండలిని రద్దు చేయవలసిన అవసరం ఎంతైనావుందని ఆయన అన్నారు. వీటి అజమాయిషీని పాకిస్తాన్ ప్రధానమంత్రే చూస్తారు. ఈ మండలిని రద్దు చేసినట్లయితే పాలనా వ్యవహారాలు పీఓకే ప్రభుత్వం చేతికి వస్తాయి. ఫలితంగా స్థానిక ప్రజలు ప్రయోజనం పొందుతారు.

టర్కీలో పెరుగుతున్న దోపిడీపై పోరు

కమ్యూనిస్టు పార్టీ మహిళా విభాగం పిలుపు



అంకారా : దోపిడీకి, ప్రతీపవాదానికి, లైంగిక వేధింపులకు స్వస్తిపలకాలని టర్కీ కమ్యూనిస్టు పార్టీ మహిళా విభాగం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ ప్రకటనలో, పెట్టుబడిదారి దేశాలలో దోపిడీ, అణచివేత పెరిగాయి. మహిళలను అతి తక్కువ వేతనాలు చెల్లించడమేగాక వివక్షతో కూడిన పరిస్థితులలో పనిచేయించుకుంటున్నారు. పనిచేసే మహిళల్లో సగంమంది పేర్లను రిజిష్టర్లలో కనీసం నమోదు చేయడంలేదు. మొత్తం మహిళల్లో మూడింట ఒక వంతు మహిళలకు కూడా ఉపాధి లేదు. మహిళల్లో నిరుద్యోగిత అపారంగా ఉంది. పురుషులకు గంటకు 2.6 లీరాలు చెల్లిస్తుండగా మహిళలకు 1 లీరా మాత్రమే చెల్లిస్తున్నారు. ముగ్గురిలో ఒక మహిళపై హింసకు, లైంగికదాడికి పాల్పడుతున్నారు. ఇలా ప్రతి 4 గంటలకు ఒక సంఘటన జరుగుతున్నది. మహిళలపట్ల వివక్ష, న్యూనతగా చూడటం, ప్రవర్తన సక్రమంగాలేదని ఆరోపిస్తూ హత్యలు చేయడం లాంటివి పెరిగాయి. బాధితుల వివాహాలను చట్టాల ముసుగులో బయటకి రానివ్వడంలేదు. పిల్లలను సైతం లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారు. పెట్టుబడిదారీ సమాజంలో మహిళలను ఎక్కువగా గృహాలకే పరిమితం చేస్తున్నారు. ఎంతమంది పిల్లలకు జన్మనివ్వాలనే అంశాన్ని కూడా నిర్ణయించుకునే హక్కు మహిళలకు లేకుండా చేస్తున్నారు. ఈ సమస్యలన్నిటిపైన మహిళలు పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనాఉంది. మహిళల శ్రమను, వ్యక్తులను, వారి జీవితాలను దోపిడీ చేయకుండా నిలువరించాలి.

సూకీ మానవ హక్కుల అవార్డు రద్దు



వాషింగ్టన్ : మైన్మార్‌నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అంగ్‌సాన్‌సూకీకి అమెరికాకు చెందిన హోలోకస్ట్ మ్యూజియం ఇచ్చిన మానవ హక్కుల అవార్డును రద్దుచేసింది. మైన్మార్‌లోని రొహింగ్యా మైనార్టీలపై దేశ సైన్యం సాధించిన హింసాకాండను నిలువరించడంలో సూకీ విఫలమైనందునే తాము ఈ అవార్డును రద్దు చేసినట్టుగా ఆ మ్యూజియం పేర్కొంది. 2012లో సూకీకి ఎలీవిసెల్ అవార్డును బహూకరించారు. ఆ అవార్డును రద్దు చేస్తున్నట్టుగా బుధవారం ప్రకటించారు. మైన్మార్‌లో రొహింగ్యాల సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని సూకీపైన అంతర్జాతీయంగా అనేక దేశాలు తీవ్రంగా ధ్వజమెత్తాయి. ఐక్యరాజ్యసమితి సైతం సూకీ ప్రభుత్వాన్ని విమర్శించింది. అయితే మ్యూజియం పొరపాటు సమాచారం ఆధారంగానే సూకీకి ఇచ్చిన అవార్డును రద్దు చేశారని ఆమె ప్రతినిధి స్పందించారు. మ్యూజియం నిర్ణయం నిరుత్సాహపరిచిందని ఆ ప్రతినిధి చెప్పారు. సైనిక నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ సూకీ సుదీర్ఘకాలం గృహనిర్బంధంలో ఉన్నారు. సైన్యంపై ఆమె జరిపిన పోరాటానికే 1991లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. 2015లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సూకీకి చెందిన పార్టీ అఖండ విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. చట్టంలోవున్న క్లాజును అనుసరించి సూకీ అధ్యక్ష పదవిని చేపట్టలేకపోయారు. అయినప్పటికీ ప్రభుత్వంలో ఆమె అత్యంత కీలకమైన వ్యక్తి. మైన్మార్ రఖిన్ రాష్ట్రంలోని రొహింగ్యా ముస్లింలపై సైన్యం జరిపిన దాడులవల్ల ప్రజలు భీతిల్లి 10 లక్షలమందికిపైగా పొరుగునేవున్న బంగ్లాదేశ్ చేరుకున్నారు. ఎట్టకేలకు బంగ్లాదేశ్, మైన్మార్ మధ్య చర్చలు జరిగిన తరువాత రొహింగ్యాలను తిరిగి తమ దేశానికి తీసుకువెళ్లేందుకు సూకీ అంగీకరించారు. అయితే తిరిగి తమ ప్రాంతాలకు వెళితే తమకు భద్రత ఉండదని బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న అత్యధిక రొహింగ్యాలు భావిస్తున్నారు.

కాండీలో మళ్లీ హింస



కొలంబొ : ఎమర్జన్సీ విధించినప్పటికీ శ్రీలంకలోని పాండీనగరంలో మరోసారి హింస చెలరేగింది. ఈ ప్రాంతంలో ముస్లింలపై తీవ్రంగా దాడులు జరుపుతున్నందున వాటిని అదుపు చేసేందుకు ప్రభుత్వం ఎమర్జన్సీ ప్రకటించింది. అయినప్పటికీ తాజాగా ముస్లింల షాపులను తగులబెట్టారు. కాండీకి సమీపంలోని పలు ప్రాంతాలలో ముస్లిం భవనాలను ధ్వంసం చేశారు. పరిస్థితిని సమీక్షించేందుకు అధ్యక్షుడు మైత్రిపాల్ శిరసేన ఉన్నతాధికారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కాండీ ప్రాంతంలో ప్రభుత్వ బాధ్యులు పర్యటించి అక్కడి పరిస్థితిని అంచనా వేయాలని మతనాయకులను, చట్టాన్ని అమలుచేసే అధికారులను కలుసుకుని చర్చించాలని అధ్యక్షుడు శిరిసేన ఆదేశించారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న దాడులను నిలువరించేందుకు ఆ ప్రాంతానికి సైన్యాన్ని రప్పించారు. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నించిన వీలుకాలేదు. హింస, గృహదహనాలు యధేచ్ఛగా సాగాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 6వ తేదీన అధ్యక్షుడు సిరిసేన ఎమర్జన్సీ విధించారు. కాండీకి సమీపంలోని అపూరన ప్రధాన జంక్షన్‌లో 25 షాపులకు బుధవారం నిపప్పుపెట్టి దహనం చేశారు. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అల్లుకుంది. కొన్ని పదుల షాపులు వరుసగా అగ్నికి ఆహుతిఅవుతున్నటికీ ప్రభుత్వాధికారులు మౌనంగా ఉండిపోయారని విమర్శలొచ్చాయి.

వ్యవ'సాయం' అంతంతే..

(మొదటిపేజీ తరువాయి)

రూ.18602.98 కోట్లు, పెట్టుబడి రూ.467.38 కోట్లు వ్యయాన్ని ప్రతిపాదిస్తూ మంత్రులు ఉభయ సభల్లో ప్రసంగించారు.

ప్రతిపాదనలు ఇలా..

2018-19లో మొత్తం వ్యవసాయ బడ్జెట్ రూ.7607.49 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.7372.49 కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.235 కోట్లను ప్రతిపాదించిందని మంత్రులు చెప్పారు. సకాలంలో నాణ్యమైన విత్తనాలు రాయితీపై రైతులకు అందించటానికి రూ.220 కోట్లను, మెగాసీడ్ పార్క్‌కు రూ.100 కోట్లను కేటాయించారు. రాష్ట్రాన్ని ఆర్గానిక్ హబ్‌గా మార్చేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని, 2022 నాటికి 5 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం జరిగేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. సూక్ష్మ పోషక లోపాల సవరణ ద్వారా వివిధ పంటల్లో సాధించిన అధిక ఉత్పాదకత దృష్ట్యా 2018-19 సంవత్సరానికి ఈ పథకం కోసం రూ.59.87 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. పంటలలో సుస్థిర దిగుబడిని సాధించేందుకు వివిధ భూసార, నీటి సంరక్షణ పద్ధతులను అమలు చేసేందుకు రూ.5.20 కోట్లను ప్రతిపాదించినట్లు మంత్రులు వివరించారు. పెరుగుతున్న వ్యవసాయ యంత్రాల అవసరాన్ని తీర్చేందుకు వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ.258.16 కోట్లను కేటాయించారు. క్షేత్రస్థాయి శిక్షణ, నైపుణ్య సామర్థ్య అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దీని కోసం రూ.81.77 కోట్లను పొందుపరిచామని, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పొలం పిలుస్తోంది, చంద్రన్న రైతు క్షేత్రాల ద్వారా రైతులను చైతన్య పరిచేందుకు రూ.12.58 కోట్లను ప్రతిపాదించారు. వ్యవసాయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి రూ.34.84 కోట్లను కేటాయించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను నిల్వ చేస్తూ పంట సమయంలో అవసరమైన ఎరువులను కొరత లేకుండా సరఫరా చేసేందుకు రూ.40 కోట్లను కేటాయించారు. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ద్వారా రైతులు పండించే వివిధ పంటలు వరి, అపరాలు, మొక్కజొన్న, వేరుశెనగను మద్దతు ధరపై కొనుగోలు చేస్తున్నామని, వాణిజ్య పంటలైన మిర్చి, పసుపును రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంటున్నామని, ఇందు కోసం రూ.500 కోట్లను ప్రతిపాదించామని మంత్రులు పేర్కొన్నారు. మండల, జిల్లాస్థాయిలలో కార్యాలయ భవనాల ఏర్పాటుకు రూ.5 కోట్లను ప్రతిపాదించామని, లక్ష రూపాయల వరకు తీసుకున్న పంట రుణ సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే రైతులకు వడ్డీలేని పంట రుణ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వివరించారు. దీని కోసం రూ.172 కోట్లను ప్రతిపాదించామని, రూ.లక్ష నుండి 3 లక్షల వరకు పంట రుణాలు పొంది, సకాలంలో తిరిగి చెల్లించిన రైతులకు పావలా వడ్డీ వర్తిస్తుందని, దీని కోసం రూ.5.44 కోట్లను ప్రతిపాదిస్తున్నామన్నారు. పంటల బీమా పథకాన్ని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా అమలుకు రూ.485 కోట్లను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానానికి అనుగుణంగా రైతులను ఆదుకొనేందుకు రుణ ఉపశమనం 4వ విడతగా రూ.4,100 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలలో కరవు నివారణ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 2018-19లో రూ.395 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.355 కోట్లు మరియు పెట్టుబడి వ్యయం రూ.40 కోట్లను ప్రతిపాదించారు. ఉద్యాన శాఖకు రెవెన్యూ వ్యయం రూ.1,517.88 కోట్లు, ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ.175.12 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.175.108 కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.0.0125 కోట్లను, పశు సంవర్థక శాఖకు మొత్తం బడ్జెట్ రూ.1223.40 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.1121.04 కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.102.37 కోట్లను ప్రతిపాదించారు. శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి మొత్తం బడ్జెట్ రూ.130 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.100 కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.30 కోట్లను ప్రతిపాదించినట్లు మంత్రులు సోమిరెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావులు చెప్పారు. మత్స్య శాఖకు మొత్తం బడ్జెట్ రూ.386 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.366 కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.20 కోట్లను, వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు రెవెన్యూ వ్యయం రూ.11.83 కోట్లను, సహకార రంగానికి మొత్తం రెవెన్యూ వ్యయం క్రింద రూ.208.11కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖకు మొత్తం రెవెన్యూ వ్యయం క్రింద రూ.2,500 కోట్లను 2018-19లో ప్రతిపాదించగా, వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ క్రింద వ్యవసాయ అనుబంధ రంగాలకు 2018-19లో రెవెన్యూ వ్యయం రూ.4,730 కోట్లను ప్రతిపాదించినట్లు మంత్రులు వివరించారు.

మూడో రోజూ హోరు

(మొదటిపేజీ తరువాయి)

విడవకుండా బస్‌లో కూడా నినాదాలు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై కేంద్ర నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే వరకు తమ ఆందోళనలు విరమించబోమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు ఢిల్లీలో ఆందోళనలు చేస్తుంటే ఏపీ ముఖ్యమంత్రి అమరావతిలో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలను వాయిదా వేసి వెంటనే ఢిల్లీకి వచ్చి చంద్రబాబు ధర్నా చేయాలని సూచించారు.

వైసీపీ నేత జగన్ మోహన్ రెడ్డి , జనసేన నేత పవన్ కళ్యాణ్‌లు కూడా దేశరాజధాని ఆందోళన చేయాలని వారు డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు అరెస్టులు చేస్తున్నారని, అయితే ఈ అరెస్టలకు బయపడబోమని కేంద్రాన్ని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు ప్రత్యేక హోదా అని దీని కోసం పోరాడే కార్యకర్తలపై ప్రభుత్వంఅరెస్టలు చేయటం ఎంత మాత్రం సరికాదన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని కేంద్రం పార్లమెంటులో పేర్కొని ఇప్పుడు ఇవ్వకపోవటం దారుణమైన మోసమన్నారు.

ఏపీ రాజకీయ పార్టీలన్నీ ఒకే వేదికపై వచ్చి ఆందోళన చేస్తే కేంద్రం తప్పక దిగి వస్తుందన్నారు. ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని మోసం చేస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు మాత్రం ఊరుకోరని కేంద్రాన్ని హెచ్చరించారు.



ముప్పాళ్ళ, తదితరులను బలవంతంగా ఈడ్చుకెళుతున్న ఢిల్లీ పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

జర్నలిస్టులను మోసగించిన ప్రభుత్వం

ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర బడ్జెట్టులో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా మోసగించిందని ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, ఐవి సుబ్బారావులు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. మూడు పడకల గదుల నిర్మాణానికి బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని సమాచారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు ఇచ్చిన హామీని విస్మరించారని ఎద్దేవా చేశారు. విధి విధానాల రూపకల్పన పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించిందని, నమ్మించి మోసంగించిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏపీయూడబ్ల్యూజే దశల వారీ ఉద్యమాన్ని తీవ్రతరం చేయనుందని పేర్కొన్నారు.

గద్దె దించుదాం

(మొదటిపేజీ తరువాయి)

విరాళాల కార్యక్రమాన్ని సురవరం సుధాకరరెడ్డి ప్రారంభించారు. సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, హైదరాబాద్ నగర సమితి కార్యదర్శి, ఆహ్వానసంఘ ప్రధాన కార్యదర్శి ఈటీ నరసింహ పాల్గొన్నారు. సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ విగ్రహాల కూల్చివేత బీజేపీ అసహనం, మూర్ఖత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. విప్లవయోధుడు లెనిన్ విగ్రహం కూల్చివేతపై దేశవ్యాప్తంగా ప్రతిధ్వని వినిపించిందని పేర్కొన్నారు. లెనిన్, పెరియర్ రామస్వామి, రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను కూల్చివేయడం దుర్మార్గమని, ఎవరి విగ్రహాలనైనా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. విదేశాలకు చెందిన వారి విగ్రహాలు భారతదేశంలో అవసరం లేదని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా గర్హించారు. అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో జాతిపిత మహాత్మాగాంధీ, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వంటి మహనీయుల విగ్రహాలు ఉన్నాయని పేర్కొన్నారు. విగ్రహాల కూల్చివేతపై ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. కోల్‌కతాలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ విగ్రహం కూల్చివేత తర్వాత మోడీ స్పందించడం దారుణమన్నారు. హిందుత్వ శక్తులు అసహనంతో మేధావులపై, ప్రజాస్వామికవాదులపై, లౌకికవాదులపై, కళాకారులపై దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా వ్యవహరిస్తోందని, వామపక్ష, లౌకికశక్తులు ఐక్యంగా పోరాటాలు సాగిస్తారని స్పష్టంచేశారు. ప్రజలు పార్టీకోసం స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తున్నారని చెప్పారు.

సీపీఐపై ప్రజల్లో అభిమానం ఉందన్నారు. అజీజ్ పాషా మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, మైనారిటీ, బలహీన వర్గాలపై దాడులు పెచ్చుపెరిగిపోతున్నాయని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ వంటి శక్తుల ఆగడాలను నిలువరించేందుకు బలమైన పోరాటాలు సాగించాలన్నారు. ఈటీ నరసింహ మాట్లాడారు. సీపీఐ నాయకులు బి.వెంకటేష్, ఎం.నర్సింహ, జి.చంద్రమోహన్‌గౌడ్, గెల్వయ్య, రాకేష్‌సింగ్, ఆర్.మల్లేష్, హరినాథ్‌గౌడ్, నెర్లకంటి శ్రీకాంత్, బాలకృష్ణ, చైతన్యయాదవ్, ఉమర్‌ఖాన్, బి.కృష్ణమూర్తి, ఎం.అనిల్‌కుమార్, పల్లె నర్సింహ, కన్నం లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య పాల్గొన్నారు.

వీళ్లిక్కడ.. వాళ్లక్కడ..!

(మొదటిపేజీ తరువాయి)


అశోక్ గజపతిలు గురువారం సాయంత్రం వరకు ప్రధాని కోసం వేచి చూసి ఆయన రాజస్థాన్ నుంచి తిరిగి రాగానే కలిసి తమ రాజీనామాలు సమర్పించారు.


తెలుగువారంతా ఆవేదనతో ఉన్నారు : కామినేని, మాణిక్యాలరావు


ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ప్రతి తెలుగువారూ ఆవేదనతో ఉన్నారని కామినేని శ్రీనివాస్ తన రాజీనామా లేఖలో తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో మంచి ప్రభుత్వాలు ఉన్నప్పటికీ ఈ విధమైన పరిణామాలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. పార్టీ ఆదేశాల మేరకు రాజీనామా చేయాల్సి వచ్చిందని మరో నేత పి.మాణిక్యాలరావు పేర్కొన్నారు. హోదా విషయంలో ఒక్క బీజేపీని ద్రోహిగా నిలబెట్టే పరిస్థితులు రావడం దురదృష్టకరమని వారిద్దరూ పేర్కొన్నారు. రాష్ట్రానికి తమ పార్టీ శత్రువు కాదని.. మిత్రుడేనని వారు పునరుద్ఘాటించారు. శాసనసభలోని సీఎం కార్యాలయంలో గురువారం చంద్రబాబును కలసి తమ రాజీనామాలను సమర్పించారు. అనంతరం వారు సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ బీజేపీ-టీడీపీ వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్మడం వల్లే అధికారంలోకి వచ్చామన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం తప్పకుండా సహకరిస్తుందన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి వల్లే తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. తాను అందరితో స్నేహభావంతో ఉన్నానని చెబుతూ తాను మంత్రిగా పని చేసిన కాలంలో ఎలాంటి అవినీతికి పాల్పడలే దన్నారు. ఈ విషయమై శుక్రవారం కాణిపాకం వినాయకుడి వద్ద ప్రమాణం కూడా చేస్తున్నట్లు ప్రకటించారు. మరో నేత మాణిక్యాలరావు మాట్లాడుతూ తాను దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గోదావరి, కృష్ణా పుష్కరాలతోపాటు ఆయా దేవాలయాల్లో ఉత్సవాలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే తాను కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్‌లో యాప్స్‌ను ఎలా వాడాలో నేర్చుకున్నట్లు చెప్పారు. త్వరలోనే ఏపీ ప్రజలు బీజేపీ, ప్రధాని మోడీని అర్థం చేసుకోగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


ఆందోళనకు సిద్ధంకండి : ఏఐటీయూసీ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సివిల్ సప్లయిస్ హమాలీల కూలి రేట్ల పెంపుదలకై ఆందోళనకు సిద్ధంకావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 13 జిల్లాల్లో సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మండల స్టాక్ పాయింట్లలో బియ్యం, పంచదార, కందిపప్పు, పామాయిల్, గోధుమ, తదితర నిత్యవసర సరుకులను లోడింగ్ అన్‌లోడింగ్ పనులు నిర్వహిస్తున్న హమాలీ కార్మికులకు ధరలకు అనుగుణంగా కూలి రేట్ల పెంపుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. గొల్లపూడిలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయం జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో బుధవారం సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్నాంజనేయులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సబ్సిడీ ద్వారా ఇస్తున్న రేషన్ బియ్యం ఇతర వస్తువులను ఎగుమతి, దిగుమతి చేయడంలో హమాలీ కార్మికులు కష్టపడి పనులు నిర్వహిస్తున్నారని, వీరికి పనికి తగ్గ కూలి రేట్లు పెంచాలని పలు దఫాలు కోరినా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని అన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడితే తప్ప చంద్రబాబు ప్రభుత్వం దిగిరాదన్న అభిప్రాయాన్ని ఓబులేసు వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ వివిధ రంగాలలో హమాలీ కార్మికులు ఎగుమతులు,దిగుమతులు చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని, మరో వైపు ఎక్సైజ్ లాంటి శాఖల్లో లాభాలు గడించడానికి కూడా హమాలీల కృషి ఎంతో ఉందన్నారు. ఆర్టీసీలో రోజుకు కొన్ని లక్షలాది మంది ప్రయాణికులకు హమాలీలు సేవలు చేస్తున్నారని ఇలాంటి హమాలీలకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట సుబ్బయ్య యూనియన్ నిర్వహించిన కార్యకలాపాల నివేధికను ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ జనవరి 25వ తేదీన సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ అధికారులతోనూ, ఎఐటియుసి మరియు ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులతో జరిగిన జాయింట్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి సక్రమంగా స్పందించకుండా కుదింపునకు తావిస్తూ అభిప్రాయాలను చెప్పడం సరైనది కాదన్నారు. ఈ సందర్భంగా ఉగాదిని పురస్కరించుకొని సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ 2018 క్యాలెండర్‌ను నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొరారి రమణ, రావుల అంజిబాబు, టి వీరబాబు, మనథరావు, చిక్కాల గోవింద్, ఎం నరశింహులు, అయ్యప్ప, సూరిబాబు, పి పెంచలయ్య, రాంబాబు, యాకోబు, దాసు తదితరులు పాల్గొన్నారు.












రవాణా, ఆర్ అండ్‌బీకి నామమాత్రపు పెరుగుదల



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రవాణా, రహదారులు-భవనాలశాఖకు బడ్జెట్‌లో రూ. 4,703 కోట్లను కేటాయించారు. గత ఏడాది రూ. 4,042 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది 16 శాతం వృద్ధిని చూపుతూ నామమాత్రంగానే బడ్జెట్ కేటాయింపులు చేసింది. ముఖ్యంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలను ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసే క్రమంలో మరింత అభివృద్ధిచేసేందుకు రహదారి నెట్‌వర్క్‌ను నవీకరిస్తున్నట్లు మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. వివిధ కార్యకలాపాల ద్వారా నిరంతరం రహదారుల నాణ్యతను మెరుగుపరుస్తామన్నారు. ఇప్పటి వరకూ రహదారులతో అనుసంధానం కాని గ్రామాలను ఈ ఏడాది లక్ష్యంగా ప్రభుత్వం ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలకు బస్సులను నడిపేందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ)కి రూ. 200 కోట్లను గ్రాంట్‌గా మంజూరు చేసింది. ఈమొత్తంతో బస్సులను కొనుగోలు చేసి గ్రామీణ ప్రాంతాలకు తెలుగు-వెలుగు (పల్లె- వెలుగు) పేరుతో బస్సులను నడపనుంది. అలాగే వివిధ వర్గాలకు ఆర్టీసీ నుంచి కల్పిస్తున్న రాయితీలను భర్తీ చేసే క్రమంలో రూ. 290 కోట్లను కేటాయించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలెప్‌మెంట్ కార్పోరేషన్ (ఏపీఆర్‌డీసీ)కి రూ. 240 కోట్లు కేటాయించింది. ఇంకా రైల్వేశాఖతో కలిసి 50:50 శాతం భాగస్వామ్యంతో నిర్మించే నూతన రైలు మార్గాల కోసం రూ. 100 కోట్లు, జిల్లాతోపాటు ఇతర రహదారుల నిర్మాణానికి రూ. 486.69 కోట్లు, మేజర్ జిల్లా రహదారుల కోసం రూ. 341 కోట్లు, ఏపీఆర్‌డీసీ ఆధ్వర్యంలో నిర్మించే రాష్ట్ర హైవేలకు రూ. 250 కోట్లు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి రూ. 200 కోట్లు కేటాయించింది.

అంకెల గ'మ్మత్తు'



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : నాలుగేళ్లుగా కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందకపోవటం, రూ.16 వేల కోట్ల రెవెన్యూ లోటును భర్తీ చేయకపోవటం, జీఎస్‌టీ ప్రభావం, రాష్ట్రంలో కరవు పరిస్థితులు, పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కొరత ఉన్నాయంటూనే, మరో ఏడాదిలో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశ పెట్టింది. కేంద్ర సహకారం లేకపోయినప్పటికీ, అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రభుత్వం తన బడ్జెట్‌లో అంకెల గారడి చేసింది. ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు 2018-19 వార్షిక బడ్జెట్ రూ.1,91,063.61 కోట్లతో శాసనసభలో గురువారం ప్రవేశపెట్టారు. అలాగే శాసనమండలిలో మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత ఏడాదితో పోల్చితే తాజా బడ్జెట్ రూ.34,064.61 కోట్లు (21.69 శాతం) ఎక్కువ. ప్రతిపక్షాలు లేకుండా శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం ఇదే తొలిసారి.

బడ్జెట్‌లో కేంద్రం నుంచి ఏ మేర నిధులు వస్తాయో కూడా తెలియని పరిస్థితులలో టీడీపీ ప్రభుత్వం భారీ ఎన్నికల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నందున వచ్చే ఏడాది ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతో ఈ ఏడాదే ప్రభుత్వం అన్ని శాఖలకు కేటాయింపులను పెంచి ప్రతిపాదించింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి యనమల మాట్లాడుతూ, కేంద్రం సహకారం కొరవడినప్పటికీ రాష్ట్రాన్ని 2022 నాటికి దేశంలో ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాధ్యమైన ఆదాయ వనరులు మదింపు చేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి విభజన చట్టం ప్రకారం రావలసిన అన్ని బకాయిలు అందుతాయనే ఆకాంక్షతో ఈ బడ్జెట్ రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.1,50,270.99 కోట్లు, మూలధన వ్యయం రూ.28,678.49 కోట్లు ఉండొచ్చని అంచనా వేసినట్లు చెప్పారు. 2017-18 బడ్జెట్ అంచనాల కంటే 2018-19 బడ్జెట్ అంచనాలు 21.69 శాతం పెరుగుదలను చూపిస్తున్నాయని తెలిపారు.

గత ఏడాది కంటే రెవెన్యూ వ్యయం సుమారు 19.35 శాతం ఉండగా, మూలధన వ్యయం 30.60 శాతం అధికంగా ఉందన్నారు. రెవెన్యూ మిగులు రూ.5,235.24 కోట్ల మేర ఉంటుందని అంచనా వేసినట్లు, ఆర్థిక లోటు సుమారు రూ.24,205.21 కోట్లు ఉంటుందని, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆర్థిక లోటు 2.78 శాతం, రెవెన్యూ మిగులు 0.60 శాతం ఉండే అవకాశం ఉందన్నారు. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం రూ.1,27,272.02 కోట్లు, మూలధన వ్యయం రూ.22,875.28 కోట్లు, రెవెన్యూ లోటు దాదాపు రూ.4,018 కోట్లు, ఆర్థిక లోటు రూ.27,603.27 కోట్లు ఉంటుందన్నారు. రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ పరిష్కరించిన ఆర్థిక ఖాతాల ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు రూ.17,193.72 కోట్లు, ఆర్థిక లోటు రూ.30,908.82 కోట్లు లోటు కనిపిస్తుందని చెప్పారు.

విద్య, సంక్షేమానికే పెద్ద పీట

ఈసారి బడ్జెట్‌లో విద్య, సంక్షేమ రంగాలకే ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మానవ వనరుల అభివృద్ధి శాఖకు అత్యధికంగా రూ.21,612 కోట్లను కేటాయించగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.21,140 కోట్లను, జలవనరుల శాఖకు రూ.16,978 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. జల వనరుల శాఖ కేటాయింపుల్లో పోలవరం ప్రాజెక్టుకే ప్రభుత్వం ఏకంగా రూ.9 వేల కోట్లను కేటాయించటం విశేషం. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో గ్రామీణాభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామిక రంగానికి రూ.3,075 కోట్లు, ఇంధన శాఖకు రూ.5,052.54 కోట్లు, రవాణా శాఖకు రూ.4,653.19 కోట్లను, యువజన సంక్షేమం, క్రీడలకు రూ.1,635.44 కోట్లను, పట్టణాభివృద్ధికి రూ.5,207 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అత్యంత ప్రధానమైన వైద్య ఆరోగ్య శాఖకు రూ.7,020 కోట్లను కేటాయించారు.

గ్రామీణాభివృద్ధికి విదిలింపే

రూ.14,705 కోట్లే కేటాయింపు

ఉపాధి నిధులలో భారీ కోత

పంచాయతీరాజ్‌కు రూ.8,733.85 కోట్లు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2016-17	18,574.47
2017-18	21,140.76
2018-19	23,439.00

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అభివృద్ధి సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని చెబుతున్న ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధిని మాత్రం విస్మరించింది. ఆ శాఖకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవటం గమనార్హం. మహాత్మాగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్) నిధుల విడుదలపై కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో కేంద్ర నిధులలో భారీగా కోత పడింది. ఈ నేపథ్యంలో ఈశాఖకు స్వల్పంగానే నిధులు విదిల్చారు. పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధికి రూ.23,439 కోట్లను కేటాయించినట్లు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. వాస్తవానికి రెండు శాఖలకు వేర్వేరుగా కేటాయిం పులను పరిశీలిస్తే ఈ శాఖకు ఏమేర అన్యాయం జరిగిందో అర్థమవుతుంది. గ్రామీణాభివృద్ధిలో సాంఘిక భద్రత, సంక్షేమానికి రూ.8,786.01 కోట్లు కేటాయించగా, అందులో డ్వాక్రా మహిళ లకు వడ్డీలేని రుణాలకు రూ.వెయ్యి కోట్లు, పింఛన్లకు రూ.4,200 కోట్లగా పేర్కొంది. ఇప్పటికే కేంద్రం నుంచి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద తగినంతగా నిధులు విడుదల కావటంలేదు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం నుంచి టీడీపీ వైదొలగ టంతో నిధుల రావటంపై అనుమానాలు వ్యక్త మవున్నాయి. ఇతర శాఖల సమన్వయంతో చేపట్టే పనులకు కేంద్రం నుంచి ఉపాధి నిధులు రూ.750 కోట్లు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. ఉపాధి హామీ పథకం కింద రూ.3,879 కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. 2017-18 బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకం కింద రూ.6,561.53 కోట్లు వస్తాయని అంచనా వేయగా, కేంద్రం నుంచి రూ.3,061 కోట్లే వచ్చాయి. ఈ ఏడాది ఉపాధి నిధుల విడుదలపై మరిన్ని అనుమానాలు వ్యక్తంకావటంతో రూ.3,879 కోట్లే వస్తాయని ప్రభుత్వం భావించిం ది. గ్రామీణాభివృద్ధిలో భాగంగా వాల్టా, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఒక్కపైసా కూడా కేటాయించలేదు. బడ్జెట్‌లో మహిళా సాధికారతకు ప్రభుత్వం చెక్ పెట్టింది. మహిళా సాధికారత సంస్థకు బడ్జెట్‌లో కేవలం రూ.లక్ష మాత్రమే కేటాయించటం గమనార్హం. ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న డ్వాక్రా గ్రూపులకు చెల్లించే కమీషన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించ లేదు. ఇక పంచాయతీరాజ్‌శాఖకు మాత్రం స్వల్పం గా నిధులను ప్రభుత్వం పెంచింది. 2017-18లో రూ.6,610.09 కోట్లను కేటాయించగా, ప్రభుత్వం రూ.7,156.83 కోట్లను ఖర్చు చేసింది. దీంతో ఈసారి బడ్జెట్‌లో రూ.8,733.85 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో పంచాయతీ ల పటిష్టానికి గతంలో రజూూ.564 కోట్లు ఉంటే, ఈసారి రూ.529 కోట్లనే ఇచ్చారు. అన్ని పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వమే చెబుతోంది. కాని బడ్జెట్‌లో అందుకు ఒక్కపైసా కూడా కేటాయించక పోవటం గమనార్హం. గతంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌కు రూ.30 కోట్లు కేటాయించారు. ఇక స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి పంచాయతీలకు ఇచ్చే నిధులు రూ.175 కోట్లు గతంలో ఉండగా, తాజా బడ్జెట్‌లోనూ అంతే కేటాయించారు. గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి గతంలో రూ.1,686 కోట్లు ఉండగా, ఈసారి రూ.1,747 కోట్లనే కేటాయిం చటం శోచనీయం. గ్రామాలలో తాగునీటి సరఫరా, ఎన్‌టీఆర్ సుజల స్రవంతి వంటి వాటికి అత్తెసరుగానే నిధులు కేటాయించారు.



వైద్య రంగంపై నిర్లక్ష్యం..!

- బడ్జెట్టులో 21శాతమే కేటాయింపు
- రూ.8,463 కోట్ల నిధులతో సరి..!
- శ్రీకాకుళంలో మొక్కుబడిగా 14 డయాలసిస్ సెంటర్లు
- జిల్లాకో 'ఎయిమ్స్' నిధుల ప్రస్తావనే లేదు..
- 'కాంట్రాక్టు వైద్యసిబ్బంది'కి అన్యాయం
- ఎన్టీఆర్ మెడిక్ సర్వీసెస్‌కు రూ.వెయ్యి కోట్లు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్టులో వైద్యారోగ్య రంగానికి అరకొరే నిధుల్ని కేటాయించింది. 2018-19 బడ్జెట్టులో వైద్య రంగానికి రూ. 8,463కోట్లు అనగా 21శాతం నిధుల్ని మొక్కుబడిగా వెచ్చించింది. 2017-18 బడ్జెట్టులో ఈ రంగానికి రూ.7,020 నిధులు సమకూర్చారు. కొత్త బడ్జెట్టులో ఆశించినంతగా నిధుల్ని కేటాయించలేదు. ఎన్టీఆర్ మెడిక్ సర్వీసెస్‌కు రూ.వెయ్యి కోట్ల నిధులతో సరిపెట్టారురాష్ట్ర వ్యాప్తంగా వైద్యరంగం అధ్వాన్నంగా ఉంది. ప్రభుత్వాస్పత్రులలో మౌలిక సౌకర్యాల కల్పనకు బడ్జెట్టులో తగిన స్థానం ఇవ్వలేదు. ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధి లేనందున..ఇటీవల కేంద్రం ప్రకటించిన జాబితాలో రాష్ట్రానికి ఒక్క వైద్యసీటూ దక్కలేదు. మొత్తం వైద్యం, వైద్యవిద్య రంగాలపై బడ్జెట్టులో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యాన్ని చూపిందనే విమర్శలున్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ప్రబలిన శ్రీకాకుళం జిల్లాలో 14 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిధుల్ని కేటాయించింది. ఈ ప్రాంతంలో రూ. 15కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటరును ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన విషయం విదితమే. దీని నిర్మాణంపై బడ్జెట్టులో ప్రస్తావనే లేదు. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఒక్క శ్రీకాకుళం జిల్లాతోపాటు ప్రకాశం, చిత్తూరు, కృష్ణాజిల్లాల్లో నెలకొన్నాయి. కృష్ణాజిల్లాలోని ఏ.కొండూరులోనూ కిడ్నీ సంబంధిత కేసులు నమోదయ్యాయి. ఈ మూడు ప్రాంతాల్లోనూ డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశగా బడ్జెట్టులో నిధుల్ని కేటాయించకపోవడం గమనార్హం.

ట్రామా కేర్ యూనిట్లపై నిర్లక్ష్యం : బడ్జెట్టులో ట్రామా కేర్ యూనిట్లకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం పూర్తిగా వివక్షత చూపింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించేందుకుగాను జాతీయ రహదారుల వెంట..కేంద్ర ప్రభుత్వ సహకారంతో ట్రామా కేర్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ట్రామా కేర్ యూనిట్లకు కేంద్రం ప్రతిపాదించిన సమయంలో ప్రభుత్వం సొంత భవనాల్ని నిర్మించకుండా..హడావుడీగా వున్న భవనాల్లోనే ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల నిర్వహణ, పనిచేస్తున్న సిబ్బందికి వేతనాల కేటాయింపులను బడ్జెట్టులో పొందుపర్చలేదు.

కాంట్రాక్టు వైద్య సిబ్బంది పెండింగ్ వేతనాలపై కేటాయింపులేవి..?

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలలు, 108 వాహనాలలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది పెండింగ్ వేతనాల మంజూరునకు బడ్జెట్టులో నిధుల్ని కేటాయించలేదు. దీంతో ఈ బడ్జెట్టు అంకెలగారడీగా నిలుస్తోందనే విమర్శలున్నాయి.

జిల్లాకో ఎయిమ్స్ ఏదీ..? : టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా జిల్లాకో ఎయిమ్స్ ఆస్పత్రిని నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ఈ బడ్జెట్టులో ఒక్క ఎయిమ్స్ ఆస్పత్రికీ చోటు లభించలేదు. ప్రభుత్వం ఇస్తున్న హామీలకూ, అమలు చేస్తున్న విధానాలకూ పొంతన లేకుండా పోయింది. మొక్కుబడి కేటాయింపులతో ప్రజల్ని మభ్యపెట్టే తరహాగా వైద్య, విద్యా రంగానికి నిధుల్ని కేటాయించారనే విమర్శలున్నాయి.

పోలీసుశాఖకు బడ్జెట్ పెంపు స్వల్పమే

- రూ.6,226 కోట్ల కేటాయింపు
- టెక్నాలజీకి సరిపోని నిధులు
- హోంగార్డులు, పోలీసు సంక్షేమానికి కత్తెర



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రం లో పోలీసుశాఖను ఆధునికీకరిస్తామి, సాంకేతికను అంది పుచ్చుకుంటాం, అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ స్థాయిలో పోలీసుశాఖకు బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. అంకెల రూపంలో నిధుల కేటాయింపు పెరిగినప్పటికీ, పోలీసు వ్యవస్థ ఆధునికీకరణకు అది ఏమాత్రం సరిపోని పరిస్థితి. అసెంబ్లీలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశెట్టిన బడ్జెట్‌లో హోంశాఖకు ప్రభుత్వం రూ.6,226 కోట్లను మాత్రమే కేటాయించింది. గత ఏడాదితో పోల్చితే రూ.వెయ్యి కోట్లు అధికంగా చూపించారు. టెక్నాలజీ పరంగా పలు విభాగాలకు అత్తెసరుగానే నిధులు కేటాయించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు అనంతపురం, కడప జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన నిర్భయ మహిళా పోలీసు వాలంటీర్స్ కోసం ఈసారి రూ.28.71 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. రాష్ట్రంలో పోలీసు అకాడమీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుతోపాటు హోంగార్డుల వేతనాల పెంపు అంశం మాత్రం లేకపోవటం గమనార్హం. పోలీసు సంక్షేమానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. సంక్షేమానికి కేవలం రూ.9,69 కోట్లనే కేటాయిం చారు. నేరాల నివారణలో ఎంతో కీలకమైన క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్)కు కేవలం రూ.20.70 కోట్లనే కేటాయించటం గమనార్హం. హోంశాఖ బడ్జెట్‌లో అత్యంత కీలకమైన రోడ్డు భద్రతకు కనీసం నిధులను కూడా కేటాయించలేదు. ఈ శాఖకు కేటాయించిన మొత్తం నిధులలో రూ.3,396 కోట్లను జిల్లా పోలీసు ఫోర్సులకే చూపించారు. మొత్తం రూ.6,226 కోట్లలో రూ.4,406 కోట్లను పోలీస్ డైరెక్టర్ జనరల్‌కే చూపించటం గమనార్హం. విభజన అనంతరం విజయవాడ కేంద్రంగా రాజధాని ఏర్పాటైంది. కొత్త రాష్ట్రంలో పోలీసులు పండుగలు, వీవీఐపీల పర్యటనల సందర్భంగా బందోబస్తు విధులు నిర్వర్తించినందుకు ప్రత్యేక అలవెన్స్ ఇచ్చేందుకు అదనంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. పోలీసు కమ్యూనికేషన్స్‌కు నెరజూూ.59.16 కోట్లను కేటాయించగా, ఫోరెన్సిక్ సైన్స్ లేబోరేటరీకి కేవలం రూ.10 కోట్లనే కేటాయిం చటం గమనార్హం. ఇక సెంటర్ ఫర్ సెక్యూరిటీ స్టడీస్‌కు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. రాష్ట్రంలో సుమారు 970 కిలో మీటర్ల మేర తీర ప్రాంతం ఉంటే, భద్రతకు అంతగా ప్రాధాన్యం కల్పించలేదు. మెరైన్ పోలీసుకు గత బడ్జెట్‌లో రూ.13.99 కోట్లను కేటాయించగా, ప్రభుత్వం రూ.36.39 కోట్లను ఖర్చు పెట్టింది. అయితే ఈ ఏడాది మెరైన్‌కు కేవలస్త్రం రజూూ.38.65 కోట్లను కేటాయించారు. ఇక జైళ్లశాఖకు రూ.169.10 కోట్లను, అగ్నిమాపకశాఖకు రూ.215.28 కోట్లను, నిఘా వ్యవస్థకు రూ.263.54 కోట్లను కేటాయించారు. ఆక్టోపస్, గ్రేహౌండ్స్‌కు రూ.200 కోట్లను మాత్రమే కేటాయించారు. విశాఖ పోలీస్ కమిషనరేట్‌కు రూ.226 కోట్లను కేటాయిం చటం విశేషం. ఇక న్యాయశాఖకు ప్రత్యేకంగా రూ.886 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది న్యాయశాఖకు రూ.828.44 కోట్లను కేటాయించగా, రూ.783.87 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. దీంతో ఈసారి కేటాయింపులను స్వల్పంగానే పెంచటం గమనార్హం.

హోంశాఖ బడ్జెట్

సంవత్సరం	కేటాయింపు (రూ.కోట్లలో)
2016-17	4,726.51
2017-18	5,221.31
2018-19	6,226.54

ఇలాగైతే రాజధాని నిర్మాణం ఎలా...?

కేంద్ర సహకారంపై సందేహాలు - బడ్జెట్‌లో 7741 కోట్లు

విశాలాంధ్ర-అమరావతి : నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం జరిగేనా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రగిలిన బడ్జెట్ చిచ్చుతో బీజేపీ, టీడీపీల మధ్య మిత్ర బంధం తెగిపోయింది. కేంద్రంలో ఉన్న ఇద్దరు టీడీపీ మంత్రులు, రాష్ట్రంలో ఉన్న ఇద్దరు బీజేపీ మంత్రులు తమ రాజీనామాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో కేంద్ర బీజేపీ పెద్దలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సంబంధాలు తెగిపోయ నట్లేనని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. నవ్యాంధ్ర రాజధాని అమరావతిని ప్రపంచం గుర్తించేలా నిర్మించాలని చంద్రబాబు సంకల్పించారు. ఆ దిశగా నిర్మాణాలు ప్రారంభించారు. రాజధాని నిర్మాణానికి 45వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా. రాజధానిలో ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టులు నిర్మించాలని నార్మన్ ఫోస్టర్ ప్రతినిధులతో డిజైన్లు రూపొందించారు. సెక్రటేరియట్, రాజ్‌భవన్, ముఖ్యమంత్రి నివాసం, అధికారుల నివాసాలు, విశాలమైన రోడ్లు, కృష్ణానది మీదుగా రాజధానిని కలిపే ఐకానిక్ బ్రిడ్జిలు, అవుటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లు, అంతర్జాతీయస్థాయి బస్ స్టేషన్, సుందరమైన పార్కులు, అంబేద్కర్ స్మృతివనం, శాఖమూరు పార్కు, నీరు కొండపై 108 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, దేశంలో అతి ఎత్తైన అంబేద్కర్ విగ్రహం, వీటితో పాటు టూరిజం స్పాట్‌గా కృష్ణానది ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల నిర్మాణం, భూగర్భ విద్యుత్ లైన్లు, ఎటు చూసిన పచ్చదనం కనపడేలా మొదటి గ్రీన్‌ఫీల్డ్ సిటీగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఏపీ విభజన బిల్లులో రాజధాని నిర్మాణానికి కేంద్రం ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం రాజధానిలో తొలిదశ నిర్మాణాలకు 11,500 కోట్ల డీపీఆర్‌ను పంపింది. అయితే కేంద్రం 2500 కోట్లు రాజధాని నిర్మాణానికి ఇచ్చామని చెప్తోంది. వాస్తవానికి రాజధానికి ఇచ్చింది మాత్రం 1500 కోట్లు మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో 5207 కోట్లు కేటాయించింది. గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీసీఆర్‌డిఏ అభివృద్ధితో సహా 7741 కోట్లు ప్రతిపాదించారు. దీంతో రాజధాని నిర్మాణం సాధ్యమా, కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చంద్రబాబు ఆశించిన మేర రాజధాని నిర్మాణం సాగుతుందా అన్నదానిపై అధికార పార్టీ నేతల్లోనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. కేంద్రం నుంచి సహాయం అందుతుందన్న ఆశలేదు. రాజధాని నిర్మాణానికి వేలకోట్లు నిధులు అవసరం. అలాగే సమయం కూడా సరిపోదు. ఈ పరిస్థితుల్లో రాజధాని నిర్మాణం పూర్తి చేయటం చంద్రబాబు ప్రభు త్వానికి గడ్డు సమస్యగా మారుతుందన్న భావం అందరిలో నెలకొంది. ఈ సమస్య ను చంద్రబాబు ఏ విధంగా అధిగమిస్తారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సంపాదకీయం

ఎన్నికల హామీల గాలిమూట!

బడ్జెట్ అంటే భారీ కేటాయింపులు, ఆచరణకు వచ్చేసరికి కోతలు, ప్రాధమ్యాల్లో మార్పులు ఆనవాయితీగా మారి పోయింది. కేటాయింపులకూ, ఖర్చుకూ పొంతనే ఉండడంలేదు. వాస్తవ పరిస్థితి ప్రతిబింబించని పద్దే బడ్జెట్ అనే అర్థం స్థిరపడుతోంది. ఆర్థిక మంత్రి యనమల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిశితంగా పరిశీలిస్తే ఇది మరింతగా రూఢీ అవుతోంది. ఏటేటా బడ్జెట్ సైజును పెంచుకుంటూపోవడమే గొప్ప అభివృద్ధిగా పాలకులు భావిస్తు న్నారు. నిరుటి కన్నా 21.70శాతం పెంచి లక్షా 91వేల 63కోట్ల అంచనాలతో గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అద్భుతాలు చేయగలిగే ఆర్థికస్థితి లేనప్పుడు, ఉన్నదానిలో ప్రాధాన్యాలను సవ్యంగా నిర్ణయించుకోవడం సరైన పద్ధతి. దాన్ని విడిచిపెట్టి అవాస్తవాలు, అసత్యాలు, అంకెల బురిడీతో భారీ బడ్జెట్లు తీర్చిదిద్దడం వల్ల రాష్ట్రానికి మేలు కన్నా కీడే ఎక్కువ జరిగే అవకాశం ఉంది. పథకాల గురించి తప్ప పన్నుల గురించి ప్రత్యక్షంగా ఎక్కడా ప్రస్తావిం చకుండా బడ్జెట్లను రూపొందించడమంటే ప్రజల్ని వంచించడమే. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు అందడం లేదని చెబుతున్నారు, మరోవైపు జీఎస్టీ ప్రతికూల ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, లక్షిత పన్నుల మొత్తాన్ని రాబట్టలేని నేపథ్యంలో అన్ని రంగాలకు భారీగా కేటాయింపులు పెంచడమంటే దీన్ని పక్కా ఎన్నికల బడ్జెట్‌గానే అభివర్ణించకతప్పదు. గ్రామీణ, వ్యవసాయ, సాగునీటి, అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తున్నా.. వనరుల సమీకరణ ఎలా అనే ప్రశ్నకు సమాధానం లేదు. ఈ బడ్జెట్‌లో కూడా గతంలో మాదిరిగానే గొప్పలు చెప్పడం తప్ప వాస్తవాలకు స్థానం ఇవ్వలేకుండా పోయింది. ఎప్పటి మాదిరిగానే ఏపీ 2022వ సంవత్సరం కల్లా దేశంలో టాప్ 3వ స్థానంలో ఉంటుందనీ, 2029లో దేశంలోనే ఉన్నత స్థానానికి చేరుతుందనీ, 2050కి ప్రపంచంలోనే ఉన్నతంగా ఉంటుందంటూ ఊహల ఊసులతో నింపారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉందని చెబుతూనే.. స్థూల ఉత్పత్తి బ్రహ్మాండంగా ఉందని పేర్కొనడంలో వైరుధ్యం కనిపిస్తోంది. ఆదాయం బ్రహ్మాండంగా ఉంటే రెవెన్యూ లోటు ఎందుకు తీరడంలేదనే ప్రశ్న తలెత్తుతోంది. 2015-16లో రూ.7,300కోట్లు, 2016-17లో రూ, 2,200కోట్లు, 2017-18లో రూ4018కోట్లు రెవెన్యూ కొనసాగుతోంది. నిరుటితో పోల్చితే వ్యవసాయ, సాగునీటి రంగాలకు వరసగా 35.91శాతం అదనంతో రూ.12,352 కోట్లు, 32.95శాతం అదనంతో 16,978కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో రైతుల రుణమాఫీకి రూ.4,100కోట్లు కేటాయించారు. చంద్రబాబు సీఎం అయ్యేనాటికి రైతుల రుణాలు రూ.87,612కోట్లు. ఈ బడ్జెట్ కేటాయింపులతో కలుపుకొని ఇప్పటి వరకూ రుణమాఫీకి ఇచ్చింది 18,300కోట్లే. ఇది రుణాలపై వడ్డీలో మూడోవంతు మొత్తం కూడా కాదు. కాబట్టి రుణమాఫీని ఎప్పటికి పూర్తిచేస్తారు? రుణమాఫీ అందని 35వేలకు పైగా రైతులకు ఎలా న్యాయం చేస్తారు? డ్వాక్రా రుణమాఫీ అనేది చంద్రబాబు ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన పెద్ద హామీ. దీనికి నిరుటిబడ్జెట్‌లో ఒక్కపైసా విదల్చని బాబు ఈసారి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వెయ్యికోట్లు కేటాయించారు. అంతేకాదు, ఎంత నిర్లజ్జగా అబద్ధాలు వల్లిస్తున్నారో వృద్ధిరేటు ప్రకటన స్పష్టం చేస్తున్నది. వ్యవసాయ రంగంలో 25.6శాతం వృద్ధిరేటు సాధించి నట్లు వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెడుతూ మంత్రి సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి పేర్కొన్నారు. రబీలో 42శాతం వర్షపాతం తక్కువగా నమోదైనందున దిగుబడి తగ్గిందని మంత్రే చెబుతున్నారు. వాస్తవానికి అనేక మండలాలు కరవు కాటుకు గురయ్యాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనం ఇతర రాష్ట్రాలకు పనుల కోసం వలసపోతున్నారు. అయినా ఈ అభివృద్ధి ఎలా సాధ్యమైంది? స్వతంత్ర భారతంలో వ్యవసాయరంగాన్ని అన్ని విధాలా ఆదుకొన్న కోఆపరేటివ్ సెక్టారు గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. వ్యవసాయ ఉత్పత్తులు, రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాల క్రయవిక్రయాలను కోఆపరేటివ్ సెక్టార్ ద్వారా నిర్వహిస్తే అన్నదాతకు అందుబాటులో ఉండి ఎంతో మేలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రత్యేక మార్కెట్ వ్యవస్థకు బదులు ఈ సెక్టారు బలోపేతం చేస్తే ఉపయోగం ఉంటుందన్న తెలివిడి పాలకులకు కొరవడడం విషాదమే! అత్యంత ప్రాధాన్యత కలిగిన సాగునీటి రంగానికి కేటాయించిన మొత్తం ఏ మూలకూ రాదు. దీనిలో పోలవరానికే రూ.9వేల కోట్లు పోతున్నది. మిగిలిన ప్రాజెక్టులు ఎప్పటికి పూర్తవుతాయి. మహేంద్ర తనయ, వంశధార, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకం, గోదావరి డెల్టా(ఏలేరుతో కలిపి) ఆధునీకరణ, చింతలపూడి ఎత్తిపోతల పథకం, కృష్ణా డెల్టా ఆధునీకరణ, వెలుగొండ ప్రాజెక్టు, సంగం ఆనకట్ట, సోమశిల ప్రాజెక్టు, సోమశిల స్వర్ణముఖి లింక్ కాల్వ, జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ వాటి అనుబంధ పనులు పూర్తి కావాలంటే మిగిలిన ఏడువేల కోట్లతో సాధ్యమవుతుందా? అంతేకాదు, ప్రతి ప్రాజెక్టు ఆలస్యమవుతునే ఉంది. దీంతో అంచనాలు పెరుగుతున్నాయి. ఫలితంగా వ్యయం పెరుగుతున్నది. ఈ బడ్జెట్‌లో మానవాభివృద్ధికి ఎనలేని ప్రాధాన్యమిస్తూ వెనుకబడిన వర్గాల పురోభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యాలకు పెద్దపీట వేయడం విశేషం. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం ఎన్నదగిన స్థాయిలో ఉందంటున్న ప్రభుత్వం, రైతన్నల కుటుంబ ఆదాయం ప్రాతిపదికన దేశంలో ఆంధ్రప్రదేశ్ 21వ స్థానంలో నిలుస్తున్న వాస్తవం మరచిపోరాదు. రెండంకెల వృద్ధిబాటలో దూసుకుపోతున్న దని మురిసిపోతున్న రాష్ట్ర ఆర్థిక రథానికి పారిశ్రామిక, సేవారంగాల్లో ఆశించిన ప్రగతిని నమోదుచేయ లేక పోతున్న వైనాన్ని గుర్తించక తప్పదు. ఈ క్రమంలో పరిశ్రమలకు నిరుటితో పోలిస్తే ఇబ్బడిముబ్బడిగా 47శాతం మేర కేటాయింపులు పెంచారు. ఐటీ రంగంలో లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తామనీ, ఏపీని ఐటీ హబ్‌గా మారుస్తామని చెబుతూ దానికి నామమాత్రంగా రూ.1007కోట్లు కేటాయించారు. నిరుటితో పోల్చితే ఇది మూడురెట్లు ఎక్కువ. అయితే అమరావతి వెలుపల విశాఖ, అనంతపురం సహా పలు ప్రాంతాల్లో ఐటీని అభివృద్ధి చేయాల్సిన క్రమంలో ఈ కేటాయింపులు నిరుత్సాహాన్ని, అసంతృప్తిని కలిగిస్తున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో గణనీయ ఉపాధికి ఊతమిచ్చే విధానాలతోనే సుస్థిరాభివృద్ధి సాకారమయ్యేది.

తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న నిరుద్యోగభృతికి ఈసారి రూ. వెయ్యి కోట్లు కేటాయించారు. ఇది మంచి పరిణామమే. అయితే దీనికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలు లేకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఎవరికి ఇస్తారు? ఎంత ఇస్తారు? దీన్ని ఎలా నిర్ణయిస్తారు? ఎన్నికల ఏడాది కాబట్టి వచ్చిచొక్కాల శ్రేణులకు దీన్ని హారతికర్పూరంలా సమర్పిస్తారా? అనే సంశయాలకు తావిస్తున్నారు. వెనుకబడిన, అల్పసంఖ్యాక వర్గాలకు ఊతంగా ఉండడానికి బదులు కులాల పేరిట నిధులు కేటాయించి ఎన్నికల ఎత్తుగడకు బడ్జెట్‌ను పావుగా వాడుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి కన్నా ఓట్లగాలంగానే ఈ కేటాయింపులు జరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ బడ్జెట్‌లో కొన్ని కొత్త పథకాలున్నా.. వాటి ఫలితాలు ఎలా ఉంటాయనేది వాటి అమలుపై ఆధారపడి ఉంటుంది. ఈ బడ్జెట్‌లో అసమతుల్యతను సరిచేసే ప్రయత్నం ఎక్కడా కనిపించలేదు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు భరోసా కల్పించేందుకు తగిన శ్రద్ధ చూపలేదని స్పష్టమవుతోంది. టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఎన్నో ఆశలు రేపి పర్మినెంట్ చేస్తామంటూ హామీలు ఇచ్చారు. చిట్టచివరి పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ ఆ హామీ అమలుకు నోచుకోలేదు.

భారీ బడ్జెట్ అని పొంగిపోయేవారిని దానిలోని పెద్దపెద్ద కంతలు వెక్కిరిస్తున్నాయి. మొదటిది రూ.24 వేల కోట్ల ద్రవ్యలోటు. విభిన్న రంగాల్లో ముమ్మరిస్తున్న అవసరాలకు దీటుగా సొంత వనరులను సమీకరించు కోవడంపై శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని ఈ లోటు గుర్తుచేస్తోంది. రెండోది బడ్జెట్‌లో చూపించిన భారీ రాబడిని సాధించడానికి పన్నులపై విపరీతంగా ఆధారపడడం. ప్రతి రూపాయిలో పదిశాతానికిపైగా వడ్డీ చెల్లింపులకే పోతున్న తీరు- ద్రవ్య బాధ్యత బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితులకు లోబడి నడుచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నది. కాబట్టి లోటు పూడ్చుకోవాలన్నా, పెంచిన పన్నుల ఆదాయాన్ని రాబట్టుకోవాలన్నా ప్రజలపై విపరీతంగా భారాలు వేయుక తప్పదు. అందువల్ల ఈ బడ్జెట్ రానున్న కాలంలో ప్రజలపై విపరీతమైన భారాలు వేయడానికి ప్రభుత్వాన్ని సిద్ధం చేసే పత్రం మినహా మరోటి కాదు. వాస్తవాదాయానికి అనుగుణంగా వచ్చే ఏడాదినాటి ఆదాయ లక్ష్యాలను నిర్ణయించుకోవడమన్నది అవసరమూ, ఆనవాయితీ కావచ్చును కానీ, ఖరారు చేసిన లక్ష్యాలు వాస్తవాలకు సుదూరంగా ఉన్నప్పుడు ప్రయోజనం సిద్ధించదు. బడ్జెట్‌లో వాస్తవికతకూ, ఆశకూ మధ్య లంకె కుదురదు.

అదానీ మెడలో 'కళింగ' సాగరమాల!

సందర్భం



నల్లి ధర్మారావు

పారిశ్రామిక ప్రయోజ నాల కోసం, దేశంలో అన్ని ఓడ రేవులను (పోర్టులు) అను సంధానం చేయాలనే ఆలోచన మోదీ ప్రభుత్వానికి ఉంది. దీనికి 'సాగరమాల' అనే అందమైన పేరు పెట్టింది. ఈ మాలను పంచు కోవడానికి ప్రధాని మోడీకి, బీజేపీకి సన్నిహితులైన పారిశ్రామికవేత్తలు వ్యూహాలను అమలు చేస్తున్నారు. మత్స్యకారుల సంప్రదాయ జీవన ప్రయోజ నాలను బలిచేసే ఈ వ్యూహాల్లో భాగంగానే, 'కళింగ సాగరమాల', అదానీ కంఠాన్ని అలంకరించ బోతోంది. 2018- ప్రపంచ కుబేరుల జాబితాలో రూ.91 వేల కోట్లతో, 98వ స్థానం సంపాదించిన (హురున్ నివేదిక) గౌతమ్ అదానీ, ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడనే ప్రచారం ఉంది. గత, జాతీయ ఎన్నికల ప్రచారంలో కొన్ని నెలలపాటు, మోడీకి ప్రత్యేక విమానాన్ని సమకూర్చారనే సమాచారం ఉంది. అదే సమయంలో ఆస్ట్రేలియా బొగ్గు క్షేత్రాలను అదానీ, కాంట్రాక్టుకు తీసుకుంటే, ఆరువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాన్ని మోడీ ఇప్పించారనే విమర్శ ఉంది. వెయ్యి కోట్ల రూపాయల పన్నులను అదానీ ఎగ్గొట్టినా, కేంద్రం ఎంతో ఉదారతను ప్రదర్శించడం విశ్లేషకుల్లో అనుమానాలను పెంచింది. కేవలం ఒక్క ఏడాదిలోనే, అదానీ సంపద రెండింత లయిందని (109 శాతం) హురున్ నివేదిక వెల్లడించింది. ఆహార వస్తువులు, జౌళి వస్త్రాల నుంచి ముడి వజ్రాల వరకూ ఎగుమతి చేసే అదానీ వ్యాపార లావాదేవీలపై ఎన్నో ఆరోపణలున్నాయి. సంపాదనకు 'ఎగుమతి' రంగం ఎంతో అనువైనది కావడం వల్ల, నౌకాశ్రయాలను (పోర్టును) లీజుకు తీసుకునే వ్యాపారంపై అదానీ గ్రూపు దృష్టి పెట్టింది. గుజరాత్ తరువాత, అతి పెద్ద పొడవైన సముద్ర తీరం గల ఆంధ్ర ప్రదేశ్‌లో పాగా వేయడానికి, గత మూడేళ్ల నుంచే ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రత్యేకంగా, తూర్పు కనుమలు, దండకారుణ్య ప్రాంతాల్లోని ఖనిజ సంపద తరలించడానికి వీలుగా, కళింగ (ఒడిసా - ఉత్తరాంధ్ర) సాగర తీరంపై ఆధిపత్యం సాధిం చాలని భావిస్తోంది. ఆ భావనలో భాగమే, భావనపాడు (శ్రీకాకుళం జిల్లా) పోర్టు లీజును కైవశం చేసుకోవడం.

గంగవరంలో భంగపాటు; ధమ్రాలో వేసులుబాటు!

తూర్పు తీరం మధ్య భాగంలో సొంతంగా ఒక పోర్టును నిర్మించడం, నిర్వహణలో ఉన్న పోర్టును కొనుగోలు చేయడం లేదా లీజుకు తీసుకోవడమనే మూడు ప్రతిపాదనలను అదానీ గ్రూప్ సిద్ధం చేసుకుంది. పోర్టుల నిర్వహణ, సరకు రవాణా రంగంలో దేశంలోనే అగ్రగామి సంస్థగా ఎదగాలన్నది వారి ధ్యేయం. తమిళనాడు, గుజరాత్, కేరళలో పోర్టులను సంపాదిం చిన ఈ గ్రూప్, దేశంలో పొడవైన తీరాలు గల మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్‌లో పోర్టులు కోసం కొన్నేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తోంది. ఆగ్నేయాసియా, జపాన్, చైనా దేశాలకు సరకు రవాణా ఏర్పాట్లు చేసుకుంటూ, వీటికి అనువైన తూర్పు తీరంలో కనీసం ఒక పోర్టునైనా సంపాదించాలని భావించింది. సరకు రవాణాలో ఎన్నో జాతీయ రికార్డులు సృష్టిస్తున్న గంగవరం పోర్టు (విశాఖ) కోసం, 2015 వరకూ ఎన్నో ప్రయత్నాలు చేసింది. దాదాపు 2.1 బిలియన్ డాలర్లు వెచ్చించడానికి సిద్ధమయింది. కానీ, ప్రస్తుత యాజమాన్యంతో చర్చలు ఫలించలేదు. యాజమాన్యంలో డివిఎస్ రాజు కంపెనీకి 58 శాతం, వార్‌బగ్ పింకస్ సంస్థకు 31 శాతం, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి 11 శాతం వాటాలున్నాయి. వార్‌బగ్ వాటాను కొనుగోలు చేయడానికి ప్రయత్నించిన అదానీ గ్రూప్, సఫలం కాలేకపోయింది. ప్రత్యా మ్నాయంగా తమిళనాడులోని కట్టుపల్లి పోర్టును ఎల్ అండ్ టీతో ఒప్పందంద్వారా సొంతం చేసుకుంది. ఒడిసాలో ప్రధాన పోర్టు పారదీప్ కాగా, 15వ శతాబ్దం నుంచి ఓడరేవుగా కార్యకలాపాలు నిర్వహించిన 'ధమ్రా', కొన్నేళ్లు మూతపడింది. దీన్ని, 1998లో పునరుద్ధరించడానికి ఎల్ అండ్ టీ, టాటా స్టీల్‌తో ఆ పోర్టు యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. దీనికి వ్యతిరేకంగా 'గ్రీన్‌పీస్' వంటి స్వచ్ఛంద సంస్థలు ఆందోళనలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. అందుకు, ప్రధాన కారణం 'పోస్కో' (దక్షిణ కొరియా) స్టీల్ ప్లాంట్ ప్రయోజనాలు. ఈ పోర్టు ప్రాంతాన్ని ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతంగా ఒడిసా ప్రతిపాదించింది. కొత్త పోర్టు, షిప్‌యార్డు, పెట్రో కెమికల్, గ్యాస్ ఆధారిత హబ్‌ల నిర్మాణాలకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ పోర్టును సంపాదించిన అదానీ గ్రూప్, పెట్రో నెట్ గ్యాస్ టెర్మినల్ నిర్మిస్తోంది. అయిదువేల కోట్ల పెట్టుబడి అంచనాలో అదానీ వాటా 49 శాతం. ఐఓసీ, సెయిల్ వాటా 49 శాతం కాగా, ఆర్థిక సంస్థల వాటా రెండు శాతం. 2018-19లో టెర్మినల్ నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన జాతీయ జలమార్గాల బిల్లు పూర్తిగా సరకు రవాణాకు సంబంధించినది. దీనిలో ప్రతిపాదించిన మార్గాల్లో తూర్పు తీరకాలువ ఒకటి. ఇది పశ్చిమ బెంగాల్, ఒడిసా పరిధిలో ఉంటుంది. ప్రస్తుతం ఒడిసా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని ఉక్కు పరిశ్రమలకు పెద్ద ఎత్తున బొగ్గు, ఇనుప ఖనిజం దిగుమతి చేయాల్సి ఉంది. ఆయా రాష్ట్రాల గనుల నుంచి ఇతర రాష్ట్రాల పరిశ్రమలకు పారాదీప్, ధమ్రా, గంగవరం, విశాఖ పోర్టుల నుంచి ఎగుమతులు జరుగుతున్నాయి. తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు వచ్చే ఆదాయంలో వీటి పాత్ర ప్రధానమయింది. విశాఖ, గంగవరం పోర్టుల ఆదాయానికి గండికొట్టాలన్నా, రవాణా దూరం తగ్గించి పరిశ్రమల యామాన్యాలకు ఆర్థిక భారం తగ్గించాలన్నా పారదీప్-విశాఖ మధ్య ఒక కొత్త పోర్టు అవసరం. గంగవరంలో భంగపడిన అదానీ గ్రూప్‌నకు, ఆ అవసరానికి తగిన ప్రదేశంగా 'భావన పాడు' కనిపించింది. సోంపేట, కాకరావల్లి థర్మల్ పరిశ్రమలను ప్రతిపాదించిన నాటినుంచే, వాటికి అవసరమయ్యే బొగ్గును ఇండోనేషియా, ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకునేందుకు వాటికి సమీపంలో ఉన్న భావన పాడు పోర్టును తెరమీదికి తెచ్చారు.

ఫిషింగ్ హార్బర్‌కే పనికి రాదన్నారు!

ప్రధాని మోడీ స్నేహ 'భావన'?

భావనపాడులో 1982కు ముందు, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించింది. విశాఖ- పారాదీప్ పోర్టుల మధ్య కనీసం ఒక జెట్టీ కూడా లేక, తుఫాన్ సమయాల్లో మత్స్యకారులు ఎన్నో ప్రమాదాలకు గురయ్యారు. సంప్రదాయ వృత్తిపై ఆధారపడిన వేలాది మత్స్యకారుల ఆందోళనల ఫలితంగా, దాదాపు రూ.120 కోట్లతో హార్బర్‌ను నిర్మించారు. నాటి గవర్నర్ కుముద్‌బెన్ జోషి దీన్ని ప్రారంభించారు. అయితే, ఇసుక మేటల వల్ల హార్బర్ వినియోగానికి రాలేదు. డిజైన్‌లోనే లోపం ఉందని, హార్బర్ నిర్మాణానికి ఇది అనువైన ప్రదేశం కాదని పూణే నిపుణులు తేల్చి చెప్పారు. టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇదే మాట చెబుతూ, చేతులెత్తేశాయి. హార్బర్‌కు పనికిరాని ప్రదేశంలో పోర్టు నిర్మిస్తామని, రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్భాటంగా ప్రకటించారు. మత్స్యకారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతామన్నారు. కానీ, వెలుగులు కావు, చీకట్లేనని వారు వ్యతిరేకించారు. హార్బరుకు పనికిరాదన్న చోట, పోర్టు ఎలా నిర్మిస్తారని నిలదీశారు. వారి ప్రశ్నలకు జవాబు చెప్పకుండా, పదివేల ఎకరాల సేకరణకు సన్నాహాలను యంత్రాంగం ప్రారంభించింది. దేశంలో ఏ పోర్టుకోసం ఇంత పెద్ద ఎత్తున భూమి సేకరించలేదని ప్రజా సంఘాలు ఉదాహరణలతో నిలదీశాయి. చివరికి, ఒక అడుగు వెనక్కి వేసి 5200 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇది కూడా అవసరానికి మించి చేస్తున్నదేనని 370 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, రైతులు రాజీపడకపోవడంతో 2050 ఎకరాలకు నోటిఫికేషన్ పరిమితమైంది. 2013 భూసేకరణ చట్టం వర్తించకుండా, వెనుక తేదీతో నోటిఫికేషన్ జారీ చేశారు. మత్స్యకారుల వేటకు సంబంధించి, స్పష్టమైన ప్రకటన చేయలేదు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా, ఒక పోరాట కమిటీ ఏర్పాటయింది. ఈ నేపథ్యంలోనే, అదానీ గ్రూపునకు పోర్టు నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తూ, ఈ ఏడాది ఫిబ్రవరి 12న రాష్ట్రప్రభుత్వం జి.ఓ.(ఎం.ఎస్.నం.3) జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో 3735 కోట్ల రూపాయలతో పోర్టు నిర్మిస్తామంటూ, 33 ఏళ్లకు అదానీకి లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. నవయుగ, గంగవరం పోర్టు కంపెనీలు పోటీపడినా, ఆర్థికపరమైన అదనపు అర్హతతో అదానీకే కేటాయించామన్నారు. అదానీకి కట్టబెట్టాలనే ముందస్తు నిర్ణయంతోనే, కేటాయింపు జరిగిపోయిందనే ఆరోపణ ఉంది. ధమ్రా (ఒడిసా) - భావనపాడు (ఆంధ్ర) పోర్టులు, వాటి ఆధారిత పరిశ్రమలు, తూర్పు తీర కాలువ కార్యకలాపాల ద్వారా, 2020 నాటికి 20 కోట్ల టన్నుల సరకు రవాణా లక్ష్యాన్ని చేరుకోవాలన్న, అదానీ గ్రూప్, సంకల్పానికి దారులు తెరుచుకున్నాయి. ఎగుమతులు, ఎగుమతి పథకాలు, తప్పుడు టర్నోవర్ నివేదికలు ద్వారా, అదానీ గ్రూప్ ఎన్నో మోసాలకు పాల్పడిందని, ఆదాయపు పన్ను ఎగవేసిందని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) ఆరోపించింది. ఈ సంస్థ, సాక్షాత్తు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సంబంధించినది. డీఆర్ఐ నివేదికను 2017 డిసెంబర్ 31న 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' పరిశోధనాత్మక వ్యాసంగా ప్రకటించింది. డి.ఆర్.ఐ. నమోదు చేసిన కేసును విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏకె సిక్రీ, రోహిన్‌టన్, నారీమన్ తీవ్రంగా స్పందించారు. దర్యాప్తు సంస్థ కనుగొన్న అంశాల్లో దిగ్భ్రాంతికరమైనది ఏమంటే, గత రెండేళ్లలో15 వేల కోట్ల రూపాయల విలువగల ముడి వజ్రాలను ఎగుమతి చేసినట్టు అదానీ గ్రూప్ తన నివేదికలో చూపించింది. అయితే, మన దేశంలో వజ్రాల ఉత్పత్తి అంతలేనప్పుడు, అంతకుమించి ఎలా ఎగుమతి చేశారని న్యాయమూర్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ గ్రూప్ వల్ల భారీగా ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతున్నా, సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వం రెవ్యూ పిటిషన్ వేయకపోవడం పట్ల చాలామంది వాణిజ్య రంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. భావనపాడు పోర్టు వంటివి ఎలా మంజూర వుతున్నాయని కొందరు అమాయకంగా ప్రశ్నలు వేస్తున్నారు. వాటికి జవాబు ఒకటే, ఓ పాత సామెతను కొత్తగా చెప్పుకోవడం. 'వడ్డించేవారు 'ప్రధాని' అయినప్పుడు, 'అదానీ' చివరి పంక్తిలో కూర్చుంటే ఏమైపోతుంది!? అందులోనూ అతడూ మరో 'స్నేహ' వజ్రమాయె!

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్ట్,
సెల్ : 7396816430

నవీన జీవనశైలికి సంకేతాలైన పలు వస్తూత్పాదనలు కొన్నాళ్ల వినియోగానంతరం ఈ-వ్యర్థాలుగా మారి దేశ పర్యావరణానికి, ప్రజారోగ్యానికి గద్దుసవాళ్లు విసరుతున్నాయి. పాతబడిన కంప్యూటర్లు, టీవీలు, చరవాణులు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు లాంటివి దేశంలో కుప్పలుతెప్పలుగా పోగుపడు తున్నాయి. ఇండియాలో ఏటా అలా 'ఉత్పత్తవుతున్న' వ్యర్థాల రాశి ఎకాయెకి 18.5లక్షల టన్నులుగా లెక్కించారు.

ఈ-వ్యర్థాలు

దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యల్లో వ్యర్థ పదార్థాలు ఒకటి. ఆధునిక జీవనశైలి కారణంగా ఏటికేడు ఈ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. నవీన జీవనశైలికి సంకేతాలైన పలు వస్తూత్పాదనలు కొన్నాళ్ల వినియోగా నంతరం ఈ-వ్యర్థాలుగా మారి దేశ పర్యావరణానికి, ప్రజారోగ్యానికి గద్దుసవాళ్లు విసరుతున్నాయి. పాతబడిన కంప్యూటర్లు, టీవీలు, చరవాణులు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు లాంటివి దేశంలో కుప్పలుతెప్పలుగా పోగుపడుతున్నాయి. ఇండియాలో ఏటా అలా 'ఉత్పత్తవుతున్న' వ్యర్థాల రాశి ఎకాయెకి 18.5లక్షల టన్నులుగా లెక్కించారు. ఏడాదికి 1.2లక్షల మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాల ఉత్పత్తితో ముంబయి నగరం ముందంజలో



ఉంది. ఆ తర్వాత ఢిల్లీ(98వేల టన్నులు), బెంగళూరు (92వేలు), చెన్నై (67వేలు) కోల్‌కతా (55వేలు), అహ్మదాబాద్ (36వేలు), హైదరాబాద్ (32వేలు) నగరాల్లోనూ భారీగా ఈ-వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కాబట్టి భారత్ ముందుముందు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని అర్థమవుతోంది. ఈ సమస్య ఒక్క భారత్‌కే కాదు, ప్రపంచ దేశాలన్నీ ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ వ్యర్థాలను పునశ్శుద్ధి చేస్తున్నాయి. ఇలా ఎన్నో దేశాలు వ్యర్థాలనూ సమర్థ వనరులుగా మలచుకుంటుంటే, ఆ విషయంలో భారత్ వెనకబాటు అనేక అనర్థాలకు దారితీస్తోంది. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యర్థాల (ఈ-వ్యర్థాల) పునశ్శుద్ధిని పెద్ద పరిశ్రమగా వృద్ధిచేసిన దక్షిణ కొరియా, యూకే, జపాన్, నెదర్లాండ్స్ లాంటివి అగ్రరాజ్యమైన అమెరికానే తలదన్ని దూసుకుపోతున్నాయి. అమెరికాలో ఈ-వ్యర్థాల పునశ్శుద్ధి 40 శాతానికి చేరగా, ఆ నాలుగూ 50నుంచి 80శాతం దాకా సాధిస్తూ అబ్బురపరుస్తున్నాయి. అయితే మన దేశంలో ఉత్పత్తవుతున్న ఈ-వ్యర్థాల్లో కేవలం 2.5శాతమే రీసైక్లింగుకు

లోచనం

నోచుకుంటున్నాయన్నది తీవ్ర ఆందోళన కలిగించే అంశం. లక్షల టన్నుల మేర పేరుకుపోతున్న ఈ-వ్యర్థాలు నేలను, నీటిని, గాలిని విషకలుషితం చేస్తున్నాయి. వాటివల్ల మెదడు, నాడీ వ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయని, పుట్టబోయే పిల్లల్లో అంగవైకల్యమూ ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అత్యధికంగా ఈ-వ్యర్థాల ఉత్పత్తిలో అమెరికా, చైనా, జపాన్, జర్మనీల తరవాతి స్థానం ఇండియాదేనని ఐక్యరాజ్య సమితి అధ్యయనం ధ్రువీకరించింది. మూడేళ్ల వ్యవధిలో విశ్వవ్యాప్తంగా ఈ-వ్యర్థాల పరిమాణం 21శాతం దాకా విస్తరించనుందనీ ఆ నివేదిక హెచ్చరించింది. ఇప్పటికే వందకోట్లకు పైబడి మొబైల్స్ ఉపయోగిస్తున్న భారత్‌లో, ఏటా దాదాపు నాలుగోవంతు ఈ-వ్యర్థాల బాట పడుతున్నాయి. ఇంకో మూడేళ్లలోనే భారతగడ్డ మీద సంవత్సరానికి 30 లక్షల టన్నుల దాకా వ్యర్థాల ఉత్పత్తి నమోదు కానుందని 'అసోచామ్' పేర్కొంది. ప్రస్తుతం ఏడాపెడా వచ్చిపడుతున్న ఈ-వ్యర్థాల్లో సింహభాగం ప్రధానంగా అసంఘటిత రంగానికే చేరుతోంది. వాటిని పునశ్శుద్ధి చేసే నైపుణ్యం, అందుకు అవసరమైన శిక్షణ కొరవడి ఐదుగు కార్మికులు, పేద పిల్లలు హానికర రసాయనాలూ అవశేషాల కారణంగా మహమ్మారి వ్యాధుల పాలబడుతున్నారు. అటు పర్యావరణానికి తూట్లు పొడుస్తూ, ఇటు అసంఖ్యాక అభాగ్యుల బతుకుల్ని కర్కశంగా కాటేస్తున్న ఈ-వ్యర్థాల నియంత్రణపై ప్రభుత్వం వద్ద సరైన కార్యాచరణ లేకుండా పోయింది. 'స్వచ్ఛభారత్' అంటూ ఘనంగా చెప్పుకొంటున్న పాలకులు ఈ వ్యర్థాల పునశ్శుద్ధికి తగిన చర్యలు చేపట్టకుండా దాన్ని ఎలా సాధించగలుగుతారు. హానికరమైన వ్యర్థ పదార్థాల దిగుమతిని నిషేధిస్తూ బాసెల్ ఒడంబడికపై భారత్ కూడా సంతకం చేసింది. స్వదేశంలో పద్ధతి ప్రకారం పునశ్శుద్ధి కార్యక్రమాలు చేపట్టేకన్నా గప్‌చుప్‌గా ఆసియాకో ఆఫ్రికాకో తరలించేస్తే ఎంతో మిగులు అన్న సంపన్న రాజ్యాల దుస్తంత్రం పుణ్యమా అని, ఆ ఒప్పందం నిలువునా నీరుగారుతోంది. వివిధ దేశాల నుంచి భారత్‌కు ఈ-వ్యర్థాల అక్రమ రవాణా ఏటికేడు పోటెత్తుతోంది. ఈ-వ్యర్థాల సమర్థ నిర్వహణ కోసమంటూ 2011లో క్రోడీకరించిన నిబంధనల అమలు బాధ్యతను పాలకులు గాలికొదిలేశారు. ఈ-వ్యర్థాల సేకరణ, నిర్వహ ణలకు రాష్ట్రాలవారీగా కాలుష్య నియంత్రణ మండళ్లను ఆయత్తపం చాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ప్రపంచంలోనే అత్యంత పరిశు భ్ర దేశంగా అవతరించిన స్వీడన్ అనుభవాలు, దేశీయ వ్యూహాలకు ఒరవడి దిద్దాలి. వెలుపలి నుంచి అక్రమ తరలింపులు వెల్లువెత్తకుండా కాచుకుంటూ, క్రమేణా పునశ్శుద్ధి కేంద్రాలను విస్తరించే ద్విముఖ ప్రణాళికను సజావుగా పట్టాలకు ఎక్కించడమే- వ్యర్థాల సమస్యకు సరైన విరుగుడు అవుతుంది!

\- జ్యోతి

యూపీలో 'స్వచ్ఛ బద్మాష్ అభియాన్'

11నెలల్లో 1,241 ఎన్‌కౌంటర్లు

సుశీల్ కుట్టి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హంతకులను పెంచిపోషిస్తున్నారు. దేశీయ జేమ్స్‌బాండ్లు, బౌంటీహంటర్లకు హత్యలు చేసేందుకు లైసెన్సులు ఇచ్చారు. వీరిలో చాలా మంది స్వేచ్ఛగా తిరుగుతూ రక్తపాతం సృష్టిస్తు న్నారు. షామిలీ, ముజఫర్‌పూర్, షహరాన్‌పూర్, మీరట్, ఘజియాబాద్, భాగ్‌పట్, కైరనా, గ్రేటర్ నోయిడా, నోయిడా లలో హింసాత్మక ఘటనలు నమోదవుతూనే ఉన్నాయి. యోగి నేతృత్వంలో పోలీసులు రక్తపిపాసులుగా మారిపోయారు. నోటి మాటకన్నా ముందుగా వారి తుపాకులు పేలుతున్నాయి. వారు ఎవ్వరినీ అదుపులోకి తీసుకోరు. నేరుగా ఎన్‌కౌంటర్ చేస్తారు. దానిపై మరో మాట ఉండదు. యోగి చెప్పినదే వేదం, పోలీసులు చేసినదే న్యాయం అన్న రీతిలో యూపీ పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నోరుమెదపకుండా అక్కడున్న క్రిమినల్ న్యాయవాదులు ఏం చేస్తున్నారు? తమ ఉపాధిని, క్లయిం ట్‌ను కోల్పోతున్నామన్న విషయాన్ని వారు గ్రహించడం లేదా? సుప్రీం కోర్టు కూడా అదే తరహాలో వ్యవహరిస్తోంది.. సుమోటో నోటీసులు ఏవి..?

ఉత్తరప్రదేశ్‌కు సీఎం కాకముందు పార్లమెంటు సభ్యుడిగా ఉన్న యోగి నాడు లోక్‌సభలో చిన్నపిల్లాడిలా గుక్కపట్టి ఏడ్చారు. పోలీసులు తనను చంపేస్తారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. రక్షణ కల్పించాలంటూ సభాపతిని వేడుకున్నారు. ఇరు వైపులా ఉన్న బీజేపీ నేతల వద్ద ఆయన కన్నీళ్లు తుడిచేందుకు సరిపడ కర్చీఫులూ లేవు.. అది అప్పుడు. కానీ ఇప్పుడు.. రాష్ట్రం ఎన్‌కౌంటర్లతో దద్దరిల్లు తోంది. యోగి రాజ్యంలో రోజుకు సగటున నాలుగు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. 41 మరణాలు సంభవిస్తు న్నాయి. కేవలం 11 నెలల్లో 1241 ఎన్‌కౌంటర్లు నమోద య్యాయి.. ఇంకా అవుతున్నాయి.

ఇదిలావుండగా, ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ప్రముఖ నటుడు నానా పాటేకర్ నటించిన హిందీ చిత్రం 'అబ్ తక్ ఛప్పన్'కు కేవలం 15 తక్కువలో యోగి పోలీసులు ఉన్నారు. కానీ వారు రక్తాన్ని రుచిమరిగారు. ఈ కారణంగానే ఇప్పటి వరకు ఎన్‌కౌంటర్ చేయబడని వారు రాష్ట్రంలోని పోలీసు స్టేషన్ల ఎదుట క్యూకట్టి, తమను అరెస్టు చేయాలని, జైల్లో పెట్టాలని బతిమాలుకుంటున్నారు. దాదాగిరీ, గూండా యిజం కాదు కదా కనీసం దొంగతనానికి కూడా పాల్పడకుండా బుద్ధిగా ఉంటామని ప్రమాణాలు చేస్తున్నారు. కరడుగట్టిన నేరగాళ్లు సైతం తమకొక అవకాశమివ్వాలన్న ప్లకార్డులతో ఉన్న దృశ్యాలు టీవీల్లో ప్రసారమయ్యాయి.

యూపీలో ఓ వ్యూహం ప్రకారం ఎన్‌కౌంటర్లు జరుగు తున్నాయి. తనను టార్గెట్ చేసినట్టు ఆ క్రిమినల్‌కు కూడా తెలియకుండానే పోలీసులు పనిముగించేస్తున్నారు. సదరు నేరస్తుడు జైలుశిక్షను పూర్తిచేసి ఇంటికొచ్చాడు. గడప దాటవద్దని కుటుంబసభ్యులు అతనికి హితబోధ చేశారు. ప్రతి పోలీసుస్టేషన్‌లోని మోస్ట్ వాంటెడ్ జాబితాలో అతని పేరు వుండవచ్చునని హెచ్చరించారు. కానీ ఏ వ్యక్తి అయినా నాలుగు గోడల మధ్య ఉండాలంటే విసిగిపోతాడు. మిత్రుల నుంచి పిలుపు కూడా రావొచ్చు. కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేయలేడు గదా. దాంతో కుటుంబసభ్యుల హెచ్చరి కను పెడచెవిన పెట్టి ఇంటినుంచి బయటకు వస్తాడు. అంతే విగతజీవిగా మారుతాడు. ఇది ఫుర్‌కాన్ విషయంలో జరి గింది. 2017, అక్టోబరులో ఆపిల్స్ కొనేందుకు ఇంటి బయ టకు వచ్చిన ఫుర్‌కాన్‌ను ముజఫర్‌నగర్ పోలీసులు మట్టుపెట్టారు. బైక్‌పై మరో ఇద్దరితో పాటు ఉన్న అతనిని రొటీన్ చెకప్ పేరిట అడ్డగించడం కాల్పులకు దారితీసింది. ఫుర్‌కాన్‌ను పోలీసులు కాల్చిచంపారు. అతని సహచరులు పారిపోయారు. చాలావరకు ఎన్‌కౌంటర్లలో హతుడి పక్కన ఉండే వ్యక్తులు పరారవుతుంటారు. ఇది ఎలా అన్నది ఓ మిస్టరీ..ఫుర్‌కాన్‌పై 30కుపైగా క్రిమినల్ కేసులున్నాయి. అతని తలకు వెలకట్టారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసుల ర్యాంకుల ఆధారంగా బౌంటీలు రూ.25వేల నుంచి రూ.5లక్షల వరకు ఉన్నాయి. చాలా వరకు ఎన్‌కౌంటర్లు చెరకు తోటల్లోనే జరుగుతుంటాయి. కొన్ని సందర్భాల్లో మీడియాను ఆహ్వానిస్తారు. దీంతో ఈ ఎన్‌కౌంటర్లు ముందుగానే ప్లాన్ చేసినవా అన్న అనుమానం కలుగుతుంది. చాలా వరకు కేసుల్లో గతంలో జరిగిన ఇతర నేరస్తుల ఎన్‌కౌంటర్ల నేపథ్య నేరాలను చూపి తమ వారిని హతమార్చినట్టు కుటుంబాలు ఆరోపిస్తుంటాయి. అలాంటి ఎన్‌కౌంటర్లలో చనిపోయిన వారిలో చాలామంది బెయిల్‌పై బయటకు వచ్చిన వారే ఉండడం గమనార్హం. బెయిల్ వచ్చిన తర్వాత కూడా జైళ్లను వీడి బయటకు వచ్చేందుకు నేరస్తులు భయపడుతున్న పరిస్థితి నేడు యూపీలో ఉంది.

నేరస్తులను పారద్రోలేందుకు యోగి ఆదిత్యనాథ్ 'స్వచ్ఛ బద్మాష్ అభియాన్'ను యూపీలో నడుపుతున్నా రంటూ వ్యాఖ్యానించిన వారెవ్వరో హాస్యపండితులు అయివుంటారు గానీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండడం హాస్యాస్పదం కాదు. కొంతమంది అభాగ్యులపై అధికారాన్ని చెలాయించడం ఏ మాత్రం సబబు కాదు. నేరాల్లోకి నెట్టబడ్డ పాఠశాల చదువు మానేసిన వారు ఎన్‌కౌంటర్ల బారిన పడుతున్నారు. నోయిడాలో ఒక్క కేసులోనైనా నిర్దోషి ఎన్‌కౌంటర్ చేయబడు తున్నాడంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తమ బిడ్డ ఎన్‌కౌంటర్ గురించి తెలిసి ఆ కుటుంబం షాక్‌కు గురైంది. భయంతో వణికిపోయింది. మద్దతు కోసం ఎన్‌హెచ్ఆర్‌సీతో సహా ప్రతి తలుపు తట్టింది. కాళ్లుచేతులు పట్టుకున్నా వారికి చివరకు దక్కింది ఎన్‌కౌంటర్ చేయబడ్డ వ్యక్తి మృతదేహం మాత్రమే.కొన్ని కేసుల్లో కారులో లేదా బైక్‌పై వెళుతుండగా నేరస్తులను హతమార్చారు. అయితే, ఆయా నేరస్తుల తల్లులు మాత్రం తమ బిడ్డలకు కారు కానీ బైక్ కానీ నడపడం తెలియదన్నారు. మరో సందర్భంలో ఓ మానసిక రోగి ... తనలో తానే మాట్లాడుకునే వ్యక్తి.. ఎప్పుడూ గ్రామ చౌపాల్ వద్ద పడివుండే వాడిని పోలీసులు తీసుకెళ్లారు. మరుసటి రోజు తూటాలతో జల్లెడ చేసిన ఆ 'కరడుగట్టిన నేరస్తుడి' మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు. ఎన్‌కౌంటర్ల లెక్క ఉంటుందన్న విషయం యోగికి కచ్చితంగా తెలుసు. ఆయన ఫిబ్రవరి 15న రాష్ట్ర శాసన మండలిలో మాట్లాడుతూ ' ఇప్పటివరకు 1200 ఎన్‌కౌం టర్లు జరిగాయి, 40 మంది నేరగాళ్లను మట్టు బెట్టాం.. ఇది ఇక్కడితో ఆగదు' అని అన్నారు. ముఖ్యమంత్రికి ప్రీతి పాత్రుడైన 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు' కూడా ఉన్నాడు. అతనే షామిలి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజయ్ పాల్ శర్మ. 2017, ఆగస్టు 2న అంటే 'కరడుగట్టిన నేరగాళ్ల'ను ఎన్‌కౌంటర్ చేసిన మూడ్రోజుల తర్వాత అజయ్ పాల్ శర్మను పుష్పాలతో అలంకరించిన వెండి రథంలో షామిలీ వీధుల్లో ఊరేగించారు. అదే రోజు సాయంత్రం సీఎం యోగి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయనను అభినందించారు. శర్మ బాటను అనుసరించాలని మిగతా పోలీసు అధికారులకు సూచించారు.

మరోవైపు మానవహక్కుల జాతీయ కమిషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సీ) యూపీ ప్రభుత్వానికి పలు నోటీసులు ఇచ్చింది. ఎన్‌కౌంటర్లపై వివరణాత్మక నివేదికలు ఇవ్వా లంటూ డిమాండు చేసింది. 'శాంతిభద్రతలు క్షీణించిన ప్పటికీ రాష్ట్రం ఇలాంటి పంథాను అనుసరించడం సరికాదు. అలా చేస్తే నిందిత నేరగాళ్ల న్యాయహత్యలు పెరుగుతాయి. ఇది సమాజానికి మంచిది కాదు. ప్రజల్లో భయోత్పాతం నెలకొంటుంది. రాష్ట్రం అనుసరిస్తున్న విధానాల కారణంగా వారి జీవించే హక్కు ఉల్లంఘనకు గురికావడంతో పాటు చట్టం ఎదుట సమానత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది' అని ఎన్‌హెచ్ఆర్‌సీ పేర్కొంది. అయితే ఈ ఎన్‌కౌంటర్లల్లో కనీసం ఒక్కదానిని ముం దస్తుగానే వ్యూహాన్ని రచించి చేసినదని రుజువు చేసేందుకు సాక్ష్యాధారాలు ఉన్నాయా? ప్రమరితమైన నివేదికల ప్రకారం బలమైన అనుమానాలు ఉన్నాయి. అవి ఇప్పట్లో తొలగిపోవు. గతేడాది జూన్‌లో ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగి మాట్లాడుతూ 'నేరం చేస్తే.. మట్టుపెడతాం' అని స్పష్టంచేశారు. ఏదిఏమైనా.. సుప్రీంకోర్టు 2012లో జారీచేసిన ఆదేశాల గురించి యూపీ సీఎంకి తెలిసినట్లు లేదు. 'కరడుగట్టిన నేరస్తుడైనంత మాత్రాన అతనిని చంపడం పోలీసు అధికారుల విధి కాదు. పోలీసులు ఆయా నేరస్తులను అరెస్టు చేసి, విచారణ కోసం కోర్టులో హాజరుపర్చాలి' అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అంతేకాకుండా భారతదేశ క్రిమినల్ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ ప్రకారం ఇలాంటి మరణాలు న్యాయబద్ధమైనవిగా పరిగణించ బడవు' అని పేర్కొంది. ఆ రూలింగ్‌కి సంబంధించిన ప్రతిని తెచ్చుకొని చదవడమే కాకుండా కంఠస్తం చేసుకోవాల్సిన అవసరం యోగి ఆదిత్యనాథ్‌కు ఎంతైనా ఉంది. అలాగే ఎస్పీ అజయ్ పాల్ శర్మకు కూడా ఓ కాపీని అందజేయాలి. ఈ 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్'కు హృదయ పరివర్తన చాలా అవసరం.

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
09 మార్చి 2018



కూలీ కుటుంబం నుంచి వీసీ...!

తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలీలు. పనికెళ్ళిన రోజునే చేతిలో డబ్బులు. అలాంటి ఇంట్లో చదువుకోవడం గగనమే. పైగా ఆ ఇంట్లో ఉన్నది నలుగురు పిల్లలు. వెరసి ఆరుగురితో కూడిన కుటుంబం. అందరూ అన్ని పూటలా తినడమే కష్టం. మరిక చదువు ఎలా? అయినా ఆ అబ్బాయి చదువుకోవాలనుకున్నాడు. అతని తపనకు ఎలాగైనా చదివించాలి అనే అతని తల్లి పట్టుదల తోడయ్యింది. ఆమె వెన్నుతట్టి ప్రోత్సహించింది. దానికి తోడు ఉపాధ్యాయులు దారి చూపారు. అంతే ఆ వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి విద్యాకుసుమం వెల్లివిరిసింది. ఆ కుర్రాడు తల్లితండ్రుల కష్టాన్ని వృధాపోనివ్వలేదు. వారి కలల్ని నిజం చేశాడు. ఊహించిన దాని కన్నా ఉన్నత స్థానాలకు చేరుకున్నాడు. వెరసి దేశంలోనే ప్రతిష్టాత్మక యూనివర్శిటీగా పేరొందిన విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్ అయ్యారు. ఆయనే ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు.

గ్రామీణ ప్రాంతం నుంచి కేవలం ఉన్నత విద్యాభ్యాసం లక్ష్యంగా ఏయూలో అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదిగి తాను చదువుకున్న యూనివర్శిటీకే వీసీగా నియమితులయ్యారు. ఇదీ ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు వహిస్తున్న ఆచార్య జి.నాగేశ్వరరావు ఘనత. అనుకోని పరిస్థితులలో వీసీ అయిన తాను 20 నెలల పదవీకాలంలో వర్శిటీ అభివృద్ధికి కొంతే చేయగలిగానని, మరింత వృద్ధిచేసి కన్నతల్లి లాంటి వర్శిటీ రుణం తీర్చుకుంటానంటున్నారు ఆచార్య జి.నాగేశ్వరరావు.

ప్రతి విజేత విజయగాథ వెనక ఎన్నో కష్టాలుంటాయి. ఆచార్య నాగేశ్వరరావుదీ అలాంటి నేపథ్యమే. గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతం పిడుగురాళ్ల సమీపంలోని మాచర్ల మండలం గంగిరెడ్లపాలెం ఆయన సొంతూరు. ఆ ఊర్లో అప్పట్లో 60 ఇళ్ళు మాత్రమే ఉండేవి. అమ్మ అనసూయమ్మ, నాన్న నర్సయ్య ఇద్దరూ వ్యవసాయ కూలీలే. ఆయనతో సహా ముగ్గురు అన్నదమ్ములు, ఒక చెల్లెలు. ఆ ఊర్లో ఒకటే ఎలిమెంటరీ స్కూల్. ఇద్దరే టీచర్లు. నాగేశ్వరరావు ప్రాథమిక విద్య ఐదవ తరగతి వరకూ అక్కడే సాగింది. 6వ తరగతి కోసం వేరే వూరు వెళ్ళాలి. అది తెలీని ఆయన అదే స్కూల్‌కి వెళ్లి ఐదో తరగతిలోనే కూర్చునేవారు. ఆ స్కూల్ హెడ్ మాస్టర్ గమనించి తల్లిని పిలిపించి పక్క ఊర్లో ఆరోతరగతిలో జాయిన్ చేయించమని చెప్పారు. అక్కడికి 80 కిలోమీటర్ల దూరంలో ఒక స్కూల్ ఉండేది. అంతదూరం వెళ్లి ఏం చదువుకుంటావులే ఇక వద్దు మానేయమన్నారు. బాగా చదువుతాడు, స్కూల్ మాన్పించవద్దని హెడ్‌మాస్టర్ చెప్పడంతో మా మేనమామ ఇంట్లో ఉంచి చదివించడానికి సిద్ధపడ్డారు. మొదట్లో మేనమామ ఏమీ మాట్లాడకపోవడంతో మళ్లీ అదే స్కూల్‌కి వెళ్ళారు నాగేశ్వరరావు. మళ్ళీ హెడ్మాస్టరే కలగ జేసుకుని మాట్లాడడంతో చివరకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రెంటచింటలకు తీసుకెళ్ళారు. అప్పటికే అడ్మిషన్లు పూర్తయిపోవడంతో మళ్ళీ సమస్య మొదటికొచ్చింది. అక్కడ హెడ్మస్టరును బతిమలాడుకుని ఏదోలా స్కూల్లో చేర్చారు. అక్కడ స్కూల్లో చేరిన ఆ రోజే నాగేశ్వరరావు పుట్టినతేదీ అయ్యింది. అసలు పుట్టినతేదీ తెలియదు. తొమ్మిది వరకూ ఇక్కడే చదువు. ఆ తరువాత పదవ తరగతి ప్రభుత్వ సాయంతో నడిచే స్టూడెంట్ మేనేజ్డ్ హాస్టల్ ఉండి చదువుకున్నారు. టీచర్ల సూచన మేరకు ఇంటర్మీడియట్ మాచర్లలో ఎస్.కె.బి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో చేరారు. విజయవాడ చూద్దామనే ఆలోచనతో ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన నాగేశ్వరరావుకు కాకినాడ జెఎన్‌టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటు కూడా వచ్చింది. ఇంజనీరింగ్ అంటే ఎక్కువ ఖర్చు అని మళ్ళీ ఇంట్లోవాళ్ళు చదువు మానెయ్ అన్నారు. ఏదేమైనా కొడుకును ఇంకా చదివించాసుకుంది ఆ తల్లి. ఆమె ప్రోత్సాహంతోనే అదే కాలేజీలో బిఎస్సీ ఎంపీసీ చదివారు. తరువాత టీచర్ల ప్రోత్సాహంతో ఏయూలోనే ఎంఎస్సీ కెమిస్ట్రీలో చేరారు.





జీవితాన్ని మలుపు తిప్పిన ఘటనలు

నాగేశ్వరరావు జీవితాన్ని మలుపు తిప్పిన ఘటనలు రెండున్నాయి. 5వ తరగతి పూర్తి చేసుకున్న తరువాత మా స్కూల్ హెడ్ మాస్టర్ పంతులు నారాయణ రావుగారు చెప్పకుంటే హైస్కూల్‌కే వెళ్లే వాడిని కాదు అంటారాయన. "తరువాత ఏయూలో ఎంఎస్సీ అయిన తరువాత కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఆచార్య గంటి సూర్యనారాయణ మూర్తి ఇంక ఇప్పుడు ఏం చేస్తావు అని అడిగారు. నేను ఊరెళ్లిపోతానండి అన్నాను. ఊరెళ్లి ఏం చేస్తావు. నీకు ఆసక్తి ఉంటే ఇక్కడ ఏదైనా కాలేజీలో ట్యూటర్‌గా చేరు నేను చెబుతానన్నారు." ఈ రెండూ తన జీవితంలో కీలక ఘటనలు అంటారు నాగేశ్వరరావు. విశాఖలోని బివికె కళాశాలలో అధ్యాపకునిగా చేస్తూనే సిఎస్ఐఆర్-నెట్‌కు క్వాలిఫై కావడం, పిహెచ్‌డి పూర్తి చేయడం జరిగిపోయాయి. ఆ తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. ఇంగ్లీష్ మీడియంలో చదవడానికి భయపడే తెలుగు మీడియం విద్యార్థులకు మెళకువలు నేర్పించి ఇంగ్లీష్ మీడియంలో కొనసాగేలా చేశానన్న సంతృప్తి ఉంది.


దేశంలోనే అగ్రగామిగా ఏయూ

ఉన్నత విద్యాభ్యాసం లక్ష్యంగా ఏయూలో అడుగుపెట్టిన నాగేశ్వరావు వైస్‌ఛాన్స్‌లర్ వరకూ ఎదిగారు. అలాంటి ఏయూ గురించి నాగేశ్వరరావు అభిప్రాయం ఇదీ..."ఏయూలో దేశంలోనే మంచి ప్రతిభావంతులైన, మేథావులైన ఆచార్యులున్నారు. తొంబై ఏళ్ల ఘనచరిత్ర కలిగిన వర్శిటీలో అన్ని అవకాశాలు ఉన్నాయి. తొలి నుంచి వీసీలుగా పనిచేసిన పలువురు మహానుభావుల కృషితో ప్రపంచంలో ఏయూకు ఒక గుర్తింపు ఉంది. ఇప్పటికే దేశంలో మంచి యూనివర్శిటీగా పేరుగాంచింది. నేను వీసీగా బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రధానంగా విద్యావ్యవహారాలపైనే దృష్టిసారించాను. తరగతులకు విద్యార్థుల ఖచ్చితంగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాను. దీంతో పాటు ఆచార్యులు హాజరు ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాను. దీంతో తరగతి గదిలో విద్యార్థులు ఉంటే వారు ఇతరాత్ర వ్యవహారాల జోలికి వెళ్లే అవకాశాలు ఉండవు. పరిశోధన, విద్య రెండు అంశాలు వర్శిటీలో పక్కాగా ఉంటే మిగిలిన విషయాలు అవే సర్దుకుంటాయి. ఆచార్యుల సేవలు సరిగా వినియోగించుకుంటే మంచి పరిశోధన, పేపర్స్ పబ్లికేషన్ జరిగి, ఇక్కడి విద్యార్థులకు మంచి ఉపాధి లభిస్తే ఈ విషయాలు వర్శిటీ ర్యాంకింగ్‌పై ప్రభావం చూపుతాయి. ఏదేమైనా విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఇప్పటివరకు కొంత



చేయగలిగాను. మరింతచేసి నన్ను ఇంతవాడ్ని చేసిన యూనివర్శిటీ రుణం తీర్చుకోవాల్సి వుంది. ఏది ఏమైనా రాబోవు రోజుల్లో దేశంలోనే నెంబర్ వన్ యూనివర్శిటీగా ఏయూను నిలిపేందుకు నా వంతు కృషి చేస్తాను. ప్రపంచ ప్రఖ్యాత టాప్ వంద విద్యాసంస్థలలో ఒకటిగా ఏయూ ఉండాలనేది నా ఆకాంక్ష". అం టారు ఆచార్య నాగేశ్వరరావు. చివరగా ఆయన గురించి చెప్పుకోవలసిన విషయం ఒకటి ఉంది... రక్షణ రంగాలకు కోర్సులు ప్రారంభించి దేశం లోనే డిఫెన్స్ స్టడీ సెంటర్ ఉన్న తొలి విశ్వవిద్యాలయంగా ఏయూను నిలిపారు.

– డి.యర్రయ్య రెడ్డి, విశాఖపట్నం



విద్యావ్యవస్థలో మార్పు...

"విద్యా వ్యవస్థలో చాలా మార్పు వచ్చింది. సిలబస్ ఎప్పటికప్పుడు మారిపోతోంది. దీంతో పిల్లలకు చదివినదాన్ని అర్థం చేసుకునే సమయం ఉండటం లేదు. దీంతో చిన్నప్పుడు పునాదులు సరిగా లేని వారు ఉన్నత విద్యకు వచ్చేసరికి ఇబ్బంది పడుతున్నారు. ఉదాహరణకు ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకున్న వారు సైతం ఐఐటిలలో రాణించలేకపోతున్నారు. కొంతమంది డ్రాపవుట్స్ అవుతున్నారు. ఇంటర్ విద్యా వ్యవస్థలో సబ్జెక్ట్ అనాలసిస్ కన్నా మెమెరీ పవర్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. అధ్యాపకులు కూడా ఒత్తిడి పెట్టడం, ఇన్ఫర్మేషన్ ఇచ్చి బట్టీ పెట్టమంటున్నారు. డిస్కస్ చేయడం లేదు. దీంతో విద్యార్థులకు విశ్లేషణ ఉండడం లేదు. కేవలం బట్టీపట్టడం కనిపిస్తోంది. దీనికి ప్రధానంగా విద్యార్థులకు సరిపడా సమయం లేకపోవడమే అనిపిస్తోంది. దీనికి కొంతవరకు తల్లితండ్రులు, అధ్యాపకులు కూడా కారణంగా నిలవడం బాధ కలిగిస్తోంది. ఈ విషయంలో తల్లితండ్రులు అవగాహన పెంచుకోవాలి" అంటున్నారు వీసీ నాగేశ్వరరావు.

క్రీమీ...కివి!



నిద్ర సరిగ్గా పట్టడం లేదా? అయితే మీకు కివి కావాల్సిందే. కివి అంటే పక్షి కదా అంటారా! కాదు పక్షి మాత్రమే కాదు ఈ పేరుతో పండు కూడా ఉంది. నిద్ర పట్టనివారికి మంచి మందు ఈ కివి పండు. ఇది రుచికరంగానూ వుంటుంది. ఈ కివి పండ్లు వచ్చే కాలం ఇదే. ఇది మన దేశానికి చెందినది కాదులెండి. 20వ శతాబ్దంలో చైనా నుండి న్యూజిల్యాండ్‌కు తీసుకువచ్చారు. అక్కడ నుండి అన్ని దేశాలకూ వచ్చింది. ఈ పండు చూడటానికి బయట గోధుమ రంగులో, లోన ఆకుపచ్చని రంగులో ఉంటుంది. కివి తినడానికి చాలా క్రీమీగా వుంటుంది అంటే సపోటా మాదిరిగి గుజ్జులా ఉంటుంది. బయటకు దీనిరూపం కూడా సపోటాను పోలి ఉంటుంది. దీనిని అనాసపండులా గుండ్రంగా, చక్రాల్లా కోసుకుని తినవచ్చు. కివి పండు గుండె వ్యాధుల్ని, ఇన్‌సోమియా, షుగర్, లోబీపిని నియంత్రిస్తుంది. కివి పండులో విటమిన్-సి, ఎ, ఇ, మాంగనీసు, కాల్షియం, పోటాషియం, ఫైబర్ వంటి విటమిన్స్ వున్నాయి. కివి పండును సలాడ్, రుచికరమైన వంటల్లో, స్మూతీస్‌లో ఎక్కువగా వాడతారు. మరి కివి అందించే మరిన్ని ప్రయోజ నాలేంటో చూద్దామా!





- కివి పండులో వున్న యాంటీఆక్సిడెంట్స్, విటమిన్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, కెరటోనాయిడ్స్ శరీరంలోని డిఎన్ఎ కణాలను పదిలంగా ఉంచుతాయి. తద్వారా వ్యాధుల బారిన పడకుండా చేస్తాయి.
- కివిలో విటమిన్-సి అద్భుతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. 100 గ్రాముల కివి పండులో 154 శాతం సి-విటమిన్ వుంటుంది. అందుకే దీనికి కేన్సర్‌ని నిరోధించే శక్తీ ఉంది.
- కివి పండులోని యాంటీఆక్సిడెంట్స్, సెరోటిన్ వల్ల మంచి నిద్ర మీ సొంతమవుతుందని అధ్యయనాల ద్వారా వెల్లడయింది.
- కివిలో వుండే సి, ఇ-విటమిన్స్, పోటాషియం గుండె వ్యాధుల్ని నివారిస్తాయి. రక్తం గడ్డకట్టకుండా చేస్తాయి.
- కివి పండు తినడం వల్ల శరీరానికి ఐరన్ సరిపడినంత లభిస్తుంది. ఐరన్ లోపం వల్ల వచ్చే వ్యాధుల్ని నివారిస్తుంది.
- దీనిలోని ఎంజైమ్‌లు జీర్ణ శక్తికి తోడ్పడుతాయి.
- వయస్సు మీదపడే కొద్దీ వచ్చే సమస్యల్ని నియంత్రిస్తుంది. దీనిలోని విటమిన్-ఎ కంటిలో శుక్లాలు రాకుండా నివారిస్తుంది.
- కడుపుతో వున్నప్పుడు ఇవి తింటే పిండం పెరుగుదలకు దోహదపడుతుంది. చిన్న పిల్లల్లో మెదడు సంబంధిత వ్యాధులు రాకుండా చూస్తుంది.
- ఈ పండును రోజు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్స్ రాకుండా చేస్తుంది.

ఇవీ జువెలరీ బాక్స్‌లే!

అభరణాలు కొనడానికి చాలా ఖర్చు పెడతారు. వాటిని దాచుకునే విషయంలో మాత్రం చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. అవి వన్నె తరగకుండా పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే వాటిని దాచుకునే జువెలరీ బాక్స్‌లూ మంచివై ఉండాలి. నాణ్యతతో పాటు అభరణాలంత అందమైన డిజైన్‌లలోనూ ఈ బాక్స్‌లు అలరిస్తున్నాయి. మురిపిస్తున్నాయి. అలాంటి బాక్స్‌లే ఇవి.









డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

అమృతరావుకి ఈవేళ సెలవురోజు. ఎండలింకా తగ్గుముఖంపట్టలేదు. తలంటుకుని ఆలస్యంగా భోజనం చేసి చిన్న నిద్దర తీశాను. మూడు కొట్టారు కాబోల్ను, పాపాయి నాపక్కలో కూర్చుని, "సుబ్బక్కా! ఈవేళ "రామ చంద్ర విజయం" సినిమానే. మా బడిపిల్లలందరూ వెళు తున్నారే, నేను కూడా వెళతానే. మూడు గంటలకి నన్ను తీసుకువెళ్ళవే?" అని అడిగింది.

"పన్నెండేళ్ళొస్తున్నాయి. మూడో ఫారం చదువు తున్నావు. నిన్నొకళ్ళు సినిమాకి తీసుకువెళ్ళాలిటే? నాలు గడుగులు వేస్తే ట్రాముంది" అన్నాను. "అబ్బ! ఎండగా వుందే, ఆదివారం కాదంటే, ట్రాములూ, బస్సులూ నిండి పోయుంటాయే. సినిమా చాలా బాగా తీశారుటే. మాకీయేడు తెలుగు నాన్‌డిటైల్డు పుస్తకమే. నువ్వుకూడా రావే. నిన్ను బతిమాలుకుంటానే!" అని ప్రాధేయపడింది.

(నిన్నటి సంచిక తరువాయి)

"కారు తీయమని నన్నిప్పుడు అల్లరి పెట్టకు చెల్లీ! తలంటుకున్నా, నిద్దరమత్తుగా వుంది. మళ్ళీ చీరె మార్చుకోడానికి బద్ధకంగా వుందే" అన్నాను. "నువ్వు చీరె మార్చుకోనక్కర్లేదే! నువ్వు ఏ చీరె కట్టుకున్నా బీరపువ్వులాగు, పార్వతీదేవిలాగు, మహాలక్ష్మీలాగు అందంగానే వుంటావే అక్కా!" అంది. నాకు నవ్వొచ్చింది. "అమ్మా గడుసుదనం. పొంగేస్తే ఉబ్బిపోయి నిన్ను తీసుకువెళతననా యేత్తు? మరీ నెల్లూరు నెరజాణల మాట లొస్తున్నాయే నీకు! దా-యిలా వచ్చి ఒక ముద్దియ్యి!" అన్నా....

కారు తీయబోయేముందు యెందుకేనా మంచిదని చక్రాల వేపు చూశాను. ఒక చక్రంలో గాలి బాగా తక్కువగా వుంది. గాలికొట్టడానికి ఎలెక్ట్రిక్ పంపు తీద్దాం అని కారు వెనుకభాగం తలుపుతీసి పంపు తీయబోతుండగా అదనపు చక్రంసందున పుస్తకం ఒకటి కనిపించింది. ఇక్కడ పుస్తకం వుండడమేమిటి అని ఆశ్చర్యపడి, పుస్తకాన్ని తీసి చూశాను. పై అట్టమీద పెద్ద బంగారం అక్షరాలతో "షేక్స్పియర్ నాటకాలు" అని వుంది ఇంగ్లీషులో. నాలుగు పేజీలు తిరగేసి "మేక్‌బెత్"లో చదివేను: "ఈ జీవితమొక నడుస్తున్న నీడ, రంగస్థలంపై ప్రాణంలేని పాత్ర, ఆర్థాయుషు గడియలో దర్జాతో డంబంతో గంతులు, తదుపరి మరుపు! ఇది ఒక గాథ, పిచ్చివాని ప్రేలాపన, కోపం, తాపం, అర్థం శూన్యం, మార్క్సు యొక్క విప్లవ విధానాన్ని గురించి ఆలోచించుదాం. రష్యాలో వున్న సోషల్ డెమొక్రాట్స్‌లో మార్క్సిజం అంటే ఒక పెట్టీబూర్జువా వ్యాఖ్యానం క్రింద నిర్వచిస్తున్నారు. ప్రత్యేకపు సంఘర్షణ రూపాలనూ, పీడిత ప్రజల విమోచనం కోసం విశిష్టవిధులనుగల ఒక విప్లవ ప్రవృత్తికాలం వుందనడం అసందర్భం అనీ, ఈ విప్లవ ప్రవృత్తి కాలంయొక్క సరియైన స్వభావం రాజ్యాంగ ప్రణాళికావతరణము, పార్లమెంటులో వ్యవహరించే వ్యతిరేక పక్ష నిర్మాణమేనని యీ వక్రభాష్యం చెబుతూంది" నాకేం అర్థం కాలేదు. మేక్‌బెత్తేమిటి మార్క్సు ఏమిటి? షేక్స్పియరేమిటి? పీడిత ప్రజలేమిటి? అని మరొకమాటు పుస్తకాన్ని నిదానించి చూశాను. రెండు పేజీలు షేక్స్పియరుంటే ఒక పేజీ లెనిన్ రచనలు!

ఈ కమ్యూనిస్టు పుస్తకం మన కారులోకి ఎలా వచ్చింది? దీన్ని చదివి రహస్యంగా ఇక్కడెవరు పెట్టారు అని అనేక విధాల పోయింది మనస్సు. సినిమాలో కూచున్నంత సేపూ ఇవే ఆలోచనలు. తెరమీద జీవితగాథ జరుగుతోంది. రామచంద్రుడు వారాలు చేసి చదువుకుంటు న్నాడు. వృద్ధిలోకి వస్తున్నాడు. ఎన్నో ఇబ్బందులను యెదుర్కొం టున్నాడు. నీలాపనిందలు పడుతున్నాడు. ప్రేమని చవిచూడడు. ఇంట్లో చామర్తి జనార్ధనం కుట్రపన్నుతాడు. దొంగతనం జరిగింది. పాపం యేమీ ఎరగని రామచంద్రుణ్ణి అనుమాని స్తారు. నాకు కళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి. నిజమైన దొంగ ఎవరు?....మెదడులో మెరుపు మెరిసినట్లయింది - అమృతరావే ఆ పుస్తకాన్ని రహస్యంగా చదువుతూ దాచిపెట్టాడు అని. అమృత రావు లెనిన్ రచనలు చదువుతున్నాడా, షేక్స్పియర్ నాటకాలని చదువుతున్నాడా? మోటారు- డ్రైవరేమిటి ఈ పుస్తకాలను చదవడమేమిటి? సోవియట్ రష్యాలో టాక్సీడ్రైవర్లు కావ్యాలూ, ప్రబంధాలూ కారు ఆగినప్పుడల్లా పఠిస్తూంటారు అని అమ్మ అంది. నాన్న ఇదంతా గ్రాండ్ డచ్చీ ఆఫ్ టాడెన్ అన్నారు.



అమ్మకి కోపం వచ్చింది...అమృతరావు కమ్యూనిష్టా ఏమిటి? నాన్న అనుమానం నిజమే, లెనిను కమ్యూనిస్టు - అమృతరావు కమ్యూనిస్టు - షేక్స్పియర్ కమ్యూనిస్టే? నాన్నని అడిగితే షేక్స్పియరూ కమ్యూనిస్టే? అంటారేమో?... ఆ మాటకే ఫక్కున నవ్వొచ్చింది. తెరవైపు చూశాను. పెళ్ళికొడుకు పెళ్ళికూతురు తలంబ్రాలు పోసుకుంటున్నారు. ముత్తైదువులు మంగళహారతు లిస్తున్నారు. బడిపిల్లలందరూ చప్పట్లుకొడుతూ లేచిపోతు న్నారు. ఆ హడావుడిలో పాపాయి "సుభక్కా! జనార్ధనం దుర్మార్గుడు కదే?" అంది. "ఛీ! జనార్ధనం ఎంతో మంచివాడు. యోగ్యుడు. వారాలు చేసి చదువుకున్నాడు. తల్లి నీళ్ళబిందెలు మోసి చదువు చెప్పించింది. గొప్ప రైల్వే ఇంజనీరు. లంచాలు పుచ్చుకోడు. అతనికి న్యాయం ప్రధానం. అలాంటి మాటలు ఎప్పుడూ అనకు" అన్నా కోపంగా. "అబ్బా! నీకు టెలిఫోను చేస్తూంటారు, ఆ జనార్ధనంగారు గాదే - సుభక్కా! సినీమాలో జనార్ధమే!" అంది పాపాయి. ఓహో! నేను నా ఆత్మకథ సినిమా కథ రెండూ కలిపేస్తున్నాను. మంచిదాన్నే!... కార్లో యింటికెళు తూంటే పాపాయి దగ్గరగా కూచుని "సుభక్కా! జనార్ధనంగారు మంచివారైతే ఆయనని నువ్వు పెళ్ళిచేసుకోవే!" అంది తటాలున... ఈ కాలం ఆడపిల్లలు ఆవులిస్తే పేగులు లెక్కపెడతారు! అమ్మయ్యో! అయితే నేను ఏ కాలపు ఆడపిల్లను? సీతా - సావిత్రి, దమయంతి రకమా? రుద్రమదేవి, అహల్యా బాయి, ఝాన్సీరాణీ, అమ్మా ఈ తరహాదాన్నా? పోతే క్లారాజెట్ కిన్సు, రోజాలుక్సెంబర్గు - వీళ్ళలాగా - ఇదేమిటి - వీళ్ళద్దరూ కమ్యూనిస్టులు కారూ? వీళ్ళని తల్చుకుంటున్నానేమిటి?....మౌంటురోడ్డులో జనసమ్మర్దం మూలాన పోలీసువారు కార్లని ఆపేశారు. "నే నడిగిందానికి జవాబు చెప్పావు కావు? కోపం వచ్చిందే - సుభక్కా?" అంది పాపాయి. "మరి కాకపోతే చూసినవాళ్ళందరినీ పెళ్ళిచేసుకుంటానుటే?" అన్నాను. "నేను తీర్థగిరీ, అశ్వద్ధా నారాయణగార్ల పేర్లైతేనా, మదనం సీతారాం గార్ల పేర్లైతేనా, అమృతరావుగారి పేరేత్తేనా?" అంది. "అదేమిటి? అమృతరావుగారు మన డ్రైవరే" అన్నా. "అయితే నేమి? మా బళ్లో చెప్పారే: 'కస్తురియట జూడ కాంతి నల్లగ నుండు. పరిమళించు దాని పరిమళంబు: గురువులైనవారి గుణము లీలాగురా విశ్వదాభిరామ వినురవేమ' అని. అసలు అమృత రావుగారు కమ్యూనిస్టు నీకు తెలుసా? ఎంత మంచివాడనుకున్నావు?" నేను నిర్ఘాంతపోయాను. "నీకేం తెలుసే?" అన్నా. "మా బళ్లో కమ్యూనిస్టు పిల్లలున్నారు. వాళ్ళు చెప్పారే. మేం అందరం కలిసి చమ్మచక్క ఆడుకుంటాం. ఎంత మంచి పిల్లలనుకున్నావు సుభక్కా?" అంది. "పిల్లలు మంచి వాళ్ళయితే తల్లిదండ్రులు తప్పకుండా మంచివాళ్ళు అయి తీరుతారనుకో సుభక్కా! కారు ఆగిందంటే - అతను యేదో పుస్తకం ఒకటి చేతపుచ్చుకుని చదువుతూంటారే-అన్నీ ఇంగ్లీషు పుస్తకాలేనే. మా కందరికీ బిళ్ళలు పెప్పరిమెంట్లు కొనియిస్తుంటారే. ఆయన వజ్రాల తమ్మెట్లలాగే మెరుస్తుంటాయి అక్కా ఆయన కళ్ళు" అంది పాపాయి ఉత్సాహంతో. "ఔనే నిజంగా" అని నేను ఉత్సాహంగానే అనబోయాను. కాని, ఆ మాట అంటే పాపాయి ఏం అపార్థం తీస్తుందో అని నేనేదో ఆలోచిస్తున్నట్లు పూరుకున్నాను...ఇంటికెళ్ళాక పాపాయి కళ్ళ బడకుండా కారులోనుంచి షేక్స్పియర్ - లెనిన్ పుస్తకం తీసి చప్పున మేడమీదకెళ్ళి నా మంచమీద తలగడా కింద పెట్టేశాను. వేగంగా భోజనంచేసి పుస్తకం చదవుదాం అని....దీపం అమర్చుకుని మంచంమీద పడుకుని పుస్తకం గుండెలమీద పెట్టుకుని పుటలు తిరగేద్దాం అనుకుంటున్నాను...పాపాయి గదిలోకొచ్చి, "సుభక్కా! జనార్ధనంగారు మంచివారన్నావు కదా - మరి ఆయన గవర్నమెంటు ఉద్యోగం ఎలా చేస్తున్నాడే? మన గాంధీగారు గవర్నమెంటుకి సాయం చేయకూడదంటున్నారు కదా?" అంది. "యక్షప్రశ్నలు వేసి నన్ను చంపకు తల్లీ! అదంతా రాజకీయం!" అన్నా దాన్ని వొదల్చుకోడానికి. "పోనీలే - నీకంత కోపం అవుతే - నాన్ననీ అమ్మనీ అడుగుతాలే. అమ్మా నాన్నా యిద్దరూ రాజకీయ నాయకులు కదే?" అంది. "అమ్మకి దేశం మీద ప్రేమే. నాన్నకి అమ్మమీద ప్రేమ. ఇద్దరూ దేశభక్తులేనే" అన్నాను - సాధ్యమైనంత వరకూ నిజం చెప్పాలని ప్రయత్నిస్తూ. "నాన్నకి అమ్మమీద ప్రేమ అని నువ్వు ఈవేళ అనుకున్నావు కాంసు - నాకు చిన్నప్పటి నుంచీ తెలుసునే. అవును కాని - మరి మా కమ్యూనిస్టు పిల్లలు - ఎర్ర సైన్యానికీ, గవర్నమెంటుకీ సాయం చేయ్యాలంటారే - వాళ్ళూ దేశభక్తులేనా? నాన్న దేశభక్తుడే అయి, జనార్ధనంగారు దేశభక్తుడై, అమృతరావుగారూ దేశభక్తుడైతే ఇది ఎలా సరిపోతుందే! - చెప్పవే?" అంది. "నాకూ తెలియడంలేదే - నాకూ అదే" మనసులో వేధిస్తూందే! అన్నాను. యేం పాలుపోక. "అక్కా అక్కా! నీ చేతిలోది షేక్స్పియర్ పుస్తకమే? బొమ్మలు చూస్తాను - ఇయ్యవే! మాకూ షేక్స్పియర్ నాటక కథలు తెలుగులో చెపుతున్నారే" అని పుస్తకం అడిగింది. నాకేం చెయ్యడానికీ తోచింది కాదు. ఇంతలో టెలిఫోనుగంట మోగింది. చెల్లీ! చూడమ్మా ఎవరో" - అన్నా. పాపాయి ప్రశ్నల పరంపరలకి విఘ్నం కలిగింది కదా అని సంతోషిస్తూ. "ఊర్వశిగారే! నువ్వు వున్నావా అని అడిగితే - వున్నావన్నా! అయితే టెలిఫోను దగ్గిరకి రమ్మనమంది. ఏదో చాలా ముఖ్యం అయిన విషయం అంది. ఊర్వశిగారికి ముఖ్యమైన విషయాలన్నీ రాత్రేగాని, పగలు తట్టవా యేమిటని విసుక్కుంటూ వెళ్ళాను - షేక్స్పియర్ పుస్తకం కూడా చేతిలో పట్టుకునే.

"బర్మా కాందిశీకులకోసం చందాలు పోగుచెయ్యాలి - యెల్లుండి ఆదివారం ఉదయం బయలుదేరి వెళదాం - అనసూయ, దమయంతి, లీల ఇంకా యెవరెవరో నలుగురైదుగురు కూడా వస్తున్నారు, రమ్మన"మని. "ఎవరెవరి దగ్గిర కెళదాం అన్నా. "అదంతా ఇప్పుడెందుకులే. అది నేను చూచుకుంటాను. వెనక పాటకి మీరుంటే - అసలు మేళం అంతా నేను నడిపిస్తా - తప్పకుండా రావాలిసుమా!" అంది. ఆమె మాటలతీరు నాకు నచ్చలేదు. కాని మంచిపని చేస్తూన్నప్పుడు మనం సాయం చేయకపోవడమేమిటని "సరే" అన్నాను.

- ఇంకా వుంది.

ఏ విమానాశ్రయానికి 'గోల్డెన్ పీకాక్ అవార్డ్- 2017 లభించింది ?

◆భారత సైనిక దళాల సామర్థ్యాన్ని పరిపుష్టం చేసే దిశగా ప్రధాన ఆయుధ కొనుగోళ్లకు రక్షణ మంత్రిత్వశాఖ ప్రాథమిక ఆమోదం తెలిపింది. దీని విలువ ఎంత ? - **రూ.15,935 కోట్లు**

◆న్యూజిలాండ్‌లోని ఉత్తర, దక్షిణ ద్వీపాల మధ్య ఉన్న కుక్ జలసంధిని భారత స్విమ్మర్ 8 గంటల 37 నిముషాల్లో ఈది రికార్డు సృష్టించాడు. అతని పేరు ఏమిటి ?

- భారత లాంగ్ డిస్టెన్స్ స్విమ్మర్ రోహన్ మోరె స్వామ్

◆పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, మానవహక్కుల ఉద్యమకారిణి 2018 ఫిబ్రవరి 11న లాహోర్‌లో మరణించారు. ఆమె పేరు ఏమిటి ? - **అస్మా జహంగీర్**

◆ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంపన్న నగరాలలో దేశ ఆర్థిక రాజధాని ముంబయికి చోటు దక్కింది. 950 బిలియన్ దాలర్ల (రూ.60.8 లక్షల కోట్లు) సంపదతో ముంబయి అంతర్జాతీయంగా ఎన్నవ స్థానంలో నిలిచింది ? - **12వ స్థానం**

◆ బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా అండర్ -30లో నలుగురు క్రీడాకారిణులకు చోటు దక్కింది. వారెవరు ?

- **క్రికెటర్లు జస్‌ప్రీత్ బుమ్రా, హర్మన్‌ప్రీత్ కౌర్, హాకీ గోల్డ్ కీపర్ సవితా పునియా, షైటర్ హీనా సిద్ధు**

◆చిన్నారుల కోసం ఉద్దేశించిన గణితశాస్త్ర ప్రతిభా పోటీల్లో భాగంగా 'యూకే మ్యాథ్స్ హాల్ ఆఫ్ ఫేమ్' ఆన్‌లైన్ పోటీలో వివిధ దేశాల విద్యార్థులతో పోటీపడి 'లీడర్ బోర్డ్'లో భారత సంతతి బాలిక చోటు సాధించింది. ఆ బాలిక పేరు ఏమిటి ?

- **సోహినీ రాయ్ ఛౌదురి (8)**

◆రాష్ట్రంలో బోదకాలు బాధితులను ఆదుకోవాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వారికి నెలకు ఎంత పింఛను అందజేయనుంది ? - **రూ.వెయ్యి**

◆'ముగ్గురు జననీ జనకుల' విధానం ఆధారంగా ఆధారంగా తొలి సంతానోత్పత్తికి ఏ దేశ అధికారులు పచ్చజెండా ఊపారు ?- **బ్రిటన్**

◆అణ్వాస్త్ర సామర్థ్యమున్న స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-1ను భారత్ 2018 ఫిబ్రవరి 6వ తేదీన విజయవంతంగా పరీక్షించింది. అయితే ఇది ఎన్ని కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు ? - **700 కిలోమీటర్లు**

- 2018 ఫిబ్రవరి 11న జరిగిన ఆరవ ప్రపంచ ప్రభుత్వ సదస్సులో ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా పురస్కారాన్ని అందుకున్నది ఎవరు ?

- **ఇండోనేసియా ఆర్థికమంత్రి శ్రీ ముల్యానీ ఇంద్రావతి**

◆ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ఎన్ఐటీల్లోని మన ప్రతిభావంతులకు విదేశాల నుంచి అందే స్కాలర్‌షిప్‌లకు ధీటుగా.. భారీస్థాయిలో స్కాలర్‌షిప్ ఇచ్చే పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం పేరు ఏమిటి ? - **పీఎం రీసెర్చ్ ఫెలోషిప్**



◆హిందూ మహాసముద్రంలో భారత్‌కు పొరుగున ఉన్న ఏ దేశంలో 2018 ఫిబ్రవరి 2న మరోసారి రాజకీయ సంక్షోభం తలెత్తింది ? - **మాల్దీవులు**

◆నాడీ కణాల రుగ్మత హంటింగ్‌టన్స్ చికిత్సకు వినియోగించే ఏ జనరిక్ ఔషధం బిళ్లలను అమెరికా మార్కెట్‌లోకి డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విడుదల చేసింది ? - **టెట్రాబెనాజైన్**

◆ తెలంగాణలో ఆహార శుద్ధి విధానంపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనికి చైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు ?

- **వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి**

◆ఆస్ట్రేలియా బెస్ట్ ఉమెన్ క్రికెటర్‌కు ఇచ్చే బెలిండా క్లార్క్ అవార్డు 2018 సంవత్సరానికి గాను ఎవరికి లభించింది ? - **ఎలిస్ పెర్రీ**

◆ఫోర్బ్స్ తొలిసారిగా విడుదల చేసిన క్రిప్టోకరెన్సీ కుబేరుల జాబితాలో 7.5-8 బిలియన్ దాలర్ల (దాదాపు రూ.48,750- 52,000 కోట్లు)తో అగ్రస్థానంలో నిలిచింది ఎవరు ? - **రిపుల్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లారెన్స్**

◆ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్ విడుదల చేసిన ఇండియన్ స్టేట్స్ ఫారెస్ట్ రిపోర్ట్-2017 ప్రకారం అత్యధిక అటవీ ప్రాంతం వృద్ధి చెందిన రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచింది ఏది ? - **ఆంధ్రప్రదేశ్**

◆ప్రతిష్టాత్మక చైనా లేడీస్ పీజీఏ టూర్ ఈవెంట్‌కు భారత మహిళా గోల్ఫర్ అర్హత సాధిం చింది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా గోల్ఫర్‌గా రికార్డులకెక్కింది. ఆమె పేరు ఏమిటి ? - **శర్మిలా నికోలెట్**

కరెంట్ అఫైర్స్ బిట్‌బ్యాంక్

◆నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నే టివ్స్ నంస్థ ఏటా అందించే ప్రతి ష్టాత్మక నాయుడమ్మ అవార్డుకు ఈ ఏడాది ఎవరు ఎంపికయ్యారు ?

- **ఆస్ట్రేలియాకు చెందిన ప్రొ. డాక్టర్ చెన్నుపాటి జగదీశ్**

◆అనుచిత వ్యాపార విధానాలు అనుసరిస్తున్నందుకు సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఎన్ని కోట్ల రూపాయల జరిమానా విధించింది ?

- **135.86 కోట్ల రూపాయలు**

◆రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్ నేతృత్వంలోని నాజీ జర్మనీ సైన్యాన్ని ఎదిరించి పోరాడి రష్యన్ సేనలు విజయం సాధించిన స్టాలిన్‌గ్రాడ్ యుద్ధానికి ముగింపు పలికి 2018 ఫిబ్రవరి 2వ తేదీ నాటికి సరిగ్గా ఎన్నేళ్లు గడిచింది ?

- **75 ఏళ్లు**

◆బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి, ఖలీదా జియా అవినీతికి అవినీతికి పాల్పడినందుకు ఎన్నేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం 2018 ఫిబ్రవరి 8న తీర్పు వెలువరించింది ?

- **ఐదేళ్లు**

◆పౌర విమానయాన రంగంలో నాణ్యమైన రవాణా సేవలు, సామాజిక బాధ్యత తదితర అంశాల్లో ఏ విమా నాశ్రయానికి 'గోల్డెన్ పీకాక్ అవార్డు 2017' దక్కింది ? - **జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్**

◆దేశంలో తొలిసారిగా సంస్కృత సంభాషణ కేంద్రాన్ని ఏ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది ?

- **గుజరాత్ విశ్వవిద్యాలయం**

◆నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ 'ఆరోగ్యకర రాష్ట్రాలు.. పురోగమన భారత్.. రాష్ట్రాలు- కేంద్రపాలిత ప్రాంతాల ర్యాంకులు' పేరుతో ఒక నివేదికను ఢిల్లీలో విడుదల చేశారు. దీని ప్రకారం దేశంలో ఆరోగ్య రంగంలో ఏ రాష్ట్రం మరోసారి అగ్రస్థానం నిలబెట్టుకుంది ? - **కేరళ**

◆2018 ఫిబ్రవరి 3వ తేదీ నాటికి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో ఉన్న హౌరా బ్రిడ్జి ప్రారంభోత్సవం జరిగి సరిగ్గా ఎన్నేళ్లు ముగిసింది ? - **75 ఏళ్లు**

◆కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడిగా ఎవరు ఎంపికయ్యారు ? - **ఆచార్య చంద్రశేఖర కంబార**

◆మానవ చర్మాన్ని పోలిన సరికొత్త ఎలక్ట్రానిక్ స్కిన్‌ను ఏ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు ?

- **అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో**

◆'అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు' (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్) 2018 ఫిబ్రవరి 3,4 తేదీల్లో ఎక్కడ జరిగింది ?

- **అస్సాంలోని గువాహతిలో**

◆భారతదేశంలో జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటై 2018 జనవరి 31వ తేదీ నాటికి ఎన్నేళ్లు పూర్తయ్యాయి ?

- **26 ఏళ్లు**

◆ఈ ఏడాది 'శ్రీ ఎన్ఆర్ చందూర్ - జగతి' పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?

- **గిజ్‌మోడో**

◆భారత ప్రధాని నరేంద్ర మోడీ 2018 ఫిబ్రవరి 9-12 తేదీల మధ్య నాలుగు రోజుల పాటు ఏఏ దేశాల్లో అధికారిక పర్యటన జరిపారు ?

- **జోర్డాన్, పాలస్తీనా, యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), ఒమన్**

◆స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన పృథ్వీ-2 క్షిపణిని భారత్ 2018 ఫిబ్రవరి 7న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి పరిధి ఎంత ? - **350 కిలోమీటర్లు**

◆మద్దతుధరకు కొనే కందుల పరిమితిని గతంలో ఉనన 53.300 టన్నుల నుంచి ఎంతకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది ? - **75,300 టన్నులు**

◆యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన జెల్లా వెంకటేశం చేనేత హస్తకళలో అద్భుతాలు సృష్టించినందుకుగాను ఏ పురస్కారం దక్కింది ? - **సంత్ కబీర్- 2016**

◆ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన రాకెట్ తొలి ప్రయోగం విజయవంతమైంది. ఫ్లోరిడాలోని కేప్ కెనెవెరాల్‌లోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి 2018 ఫిబ్రవరి 6న దీనిని ప్రయోగించారు. ఈ రాకెట్ పేరు ఏమిటి ? - **ఫాల్కన్ హెవీ**

◆ఇండియా ఓపెన్ - 2018 బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?

- **చైనా సంతతికి చెందిన అమెరికా క్రీడాకారిణి బీవెన్ జాంగ్**

◆బంగ్లాదేశ్ దేశాధ్యక్ష పదవికి 2018 ఫిబ్రవరి 7న తిరిగి ఎన్నికయింది ఎవరు ? - **అబ్దుల్ హమీద్**

◆వందో వన్డే ఆడుతూ సెంచరీ చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించింది ఎవరు ? - **శిఖర్ ధావన్**

◆నెక్స్‌బ్రాండ్ అందించే 'పవర్‌ఫుల్ ఉమెన్ అఛీవర్' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?

- **హీరా గ్రూప్ వ్యవస్థాపకురాలు, సీఈఓ షేక్ నౌహెరా**



◆అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన గ్లోబల్ ఇన్నో వేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) రూపొందించిన అంతర్జాతీయ మేధోహక్కుల (ఐపీ) సూచీలో భారత దేశానికి ఎన్నో స్థానం దక్కింది ? - **44వ స్థానం**

◆న్యూజిలాండ్‌లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌ను ఏ జట్టు కైవసం చేసుకుంది ?

- **భారత్**

◆అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) తొలి మహిళా స్వతంత్ర డైరెక్టర్ గా ఎవరు నియమితుల య్యారు ?

- **పెప్సికో చైర్మన్, సీఈఓ ఇంద్రా నూయీ**

◆2018 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మక అలెన్ బోర్డర్ పతకానికి ఎవరు ఎంపికయ్యారు ?

- **ఆస్ట్రేలియా క్రికెట్ కప్ కెప్టెన్ స్టీవ్ స్మిత్**

◆కౌలాలంపూర్‌లో జరిగిన మలేషియన్ ఓపెన్ మేబ్యాంక్ ఛాంపియన్‌షిప్ - 2018 విజేతగా నిలిచింది ఎవరు ?

- **భారత గోల్ఫ్ రైజింగ్ స్టార్ శుభాంకర్ శర్మ**

◆2018 సంవత్సరానికిగాను బయో ఆసియా ప్రతిభా పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?

- **మైఖేల్ ఎన్.హాల్**

◆వింటర్స్ ఒలింపిక్స్ 2018 ఫిబ్రవరి 9న ఎక్కడ ఘనంగా ప్రారంభమయ్యాయి ? - **ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా)**

◆భాతర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ 2018 ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఏ దేశంలో అధికారిక పర్యటన జరిపారు ?

- **నేపాల్**

విద్యార్థినులకు ఉన్నత విద్యావకాశాలు, ప్రోత్సాహకాలు...

ఉన్నతవిద్యలో విద్యార్థినుల నమోదు శాతం పెంచడంతోపాటు డ్రాప్ అవుట్స్‌ను తగ్గించేందుకు దేశంలో పలు కార్యక్రమాలు అమలవుతున్నాయి. అలాగే ఆర్థిక కారణాలతో చదువులో ముందడుగు వేయలేకపోతున్న యువతులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించేలా పలు పథకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (సీఏబీఈ) సమావేశంలోనూ ఉన్నతవిద్యలో అమ్మాయిలకు ప్రోత్సాహంపై ప్రధానంగా చర్చ జరిగింది. సీఏబీఈ పరిధిలోని సబ్ కమిటీలు కూడా పలు సిఫార్సులు చేశాయి. మరోవైపు ఐఐటీలు, ఐఐఎంల్లో అదనపు సీట్లు, మహిళలకు ప్రత్యేకంగా యూనివర్సిటీల ఏర్పాటు ప్రతిపాదన తదితరాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. ప్రస్తుతం విద్యార్థినులకు ఉన్న ఉన్నతవిద్యావకాశాలు, ప్రోత్సాహకాల గురించి తెలుసుకుందాం.

14 శాతం అదనపు సీట్లు :

విద్యార్థినులను ఉన్నతవిద్య వైపు ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో ప్రధానమైనది.. ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో 2018-19 విద్యా సంవత్సరం నుంచి అదనంగా 14 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించడం. దీనివల్ల ఐఐటీల్లో దాదాపు 550 సీట్లు విద్యార్థినులకు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఎన్ఐటీల్లో దాదాపు 400 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీన్ని 2020 నాటికి 20 శాతానికి పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది.

మేనేజ్‌మెంట్ విద్య :

విద్యార్థినులు మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశించేలా ప్రోత్సహించేందుకు ఐఐఎంలలో జండర్ డైవర్సిటీ పేరుతో మూడేళ్ల క్రితం నుంచి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అన్ని ఐఐఎంలలో 5 నుంచి 10 శాతం మేర జెండర్ డైవర్సిటీని అమలు చేస్తున్నారు. ఫలితంగా ఐఐఎంలలో అడుగుపెడుతున్న విద్యార్థినుల సంఖ్య గత రెండేళ్ల నుంచి క్రమేణా పెరుగుతోంది. మొత్తం విద్యార్థుల్లో 25 నుంచి 30 శాతం మేరకు విద్యార్థినులు ఉండటం దీనికి నిదర్శనం. కొన్ని ఐఐఎంలు విద్యార్థినుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా రెండో సెమిస్టర్ నుంచి స్కాలర్‌షిప్ అందిస్తున్నాయి.

ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక యూనివర్సిటీ :

యువతులను ఉన్నతవిద్య దిశగా ప్రోత్సహించే చర్యల్లో భాగంగా.. ఇటీవల సీఏబీఈ సబ్ కమిటీ కీలక సిఫార్సులు చేసింది. వీటిలో ఒకటి ప్రతి రాష్ట్రంలో ఒక్కొక్కటి చొప్పున మహిళలకు ప్రత్యేక యూనివర్సిటీని నెలకొల్పడం. ఈ సిఫార్సులు ఫిబ్రవరి చివరి నాటికి తుది రూపు దిద్దుకోనున్నాయి. వాటి ఆధారంగా మానవ వనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంటుంది.

జిల్లాకో రెసిడెన్షియల్ స్కూల్..

అమ్మాయిల కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను సీఏబీఈ సబ్ కమిటీ సిఫార్సు చేసింది. ప్రస్తుతం అమలవుతున్న నవోదయ విద్యాలయాల తరహాలో వీటిని రూపొందించాలని సూచించింది. +2 వరకు సీబీఎస్ఈ సిలబస్ విధానాన్ని అమలు చేయాలని.. ఫలితంగా జాతీయస్థాయిలో పోటీపడే సన్నద్ధత లభిస్తుందని సబ్ కమిటీ సిఫార్సు చేసింది. జిల్లాకో రెసిడెన్షియల్ స్కూల్ విధానం ఫలితంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని.. పదోతరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చని భావిస్తున్నారు.

పీజీ వరకు ఉచిత విద్య..

విద్యార్థినులకు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఏబీఈ సభ్య రాష్ట్రాలు సూచించాయి. 2018, జనవరి 10న హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకోసం అవసరమైతే ఆర్‌టీఈలో మార్పులు చేయాలని కూడా సూచించారు. ఈ అంశాన్ని సీఏబీఈ జనవరి 15, 16 తేదీలలో నిర్వహించిన జాతీయ సదస్సులో సైతం ప్రస్తావించారు. ఇలాంటి విధానం ఫలితంగా.. అన్ని ప్రాంతాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు ప్రయోజనకరంగా ఉంటుందని.. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉన్నత చదువులవైపు అడుగులు వేయించేందుకు ఆస్కారం లభిస్తుందని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పేర్కొన్నట్లు సమాచారం.

ప్రోత్సాహకాలు..

ప్రస్తుతం దేశంలో విద్యార్థినులను ప్రోత్సహించేందుకు వివిధ స్కాలర్‌షిప్ పథకాలు అమలవుతున్నాయి. వీటి వివరాలు..

సెంట్రల్ సెక్టార్ స్కీమ్ :

దేశంలోనే భారీ స్కాలర్‌షిప్ పథకంగా దీన్ని చెప్పొచ్చు. ఆయా రాష్ట్రాల పరిధిలోని ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సులో 80 పర్సంటైల్ కంటే ఎక్కువ సాధించి.. డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకమిది. మొత్తం 82వేల మందికి ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. ఇందులో 50 శాతం స్కాలర్‌షిప్‌లను విద్యార్థినులకు కేటాయించారు. స్కాలర్‌షిప్ వ్యవధి కనిష్టంగా మూడేళ్లు, గరిష్టంగా అయిదేళ్లు. ఎంపికైన వారికి తొలి మూడేళ్లు ఏటా రూ.10 వేలు, తర్వాతి రెండేళ్లు ఏటా రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారు.

వెబ్‌సైట్ : www.scholarships.gov.in

యూజీసీ స్కాలర్‌షిప్ :

నాన్-ప్రొఫెషనల్ కోర్సుల ఔత్సాహిక విద్యార్థినులకు యూజీసీ అందుబాటులోకి తెచ్చిన స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇందిరాగాంధీ స్కాలర్‌షిప్ స్కీమ్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్. పీజీ స్థాయిలో నాన్-ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థినులు వీటికి అర్హులు. మొత్తం 1200 మందికి స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. రెండేళ్ల పీజీ కోర్సు వ్యవధిలో ప్రతి విద్యా సంవత్సరంలో పది నెలల పాటు నెలకు రూ.3,100 చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుంది.

వెబ్‌సైట్: www.ugc.ac.in

ఏఐసీటీఈ స్కాలర్‌షిప్ :

సాంకేతిక విద్య ఔత్సాహిక విద్యార్థినులకు ఏఐసీటీఈ ప్రవేశపెట్టిన వినూత్న స్కాలర్‌షిప్ పథకం.. ప్రగతి స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ స్టూడెంట్. ఇది డిప్లొమా (పాలిటెక్నిక్), బ్యాచిలర్ డిగ్రీ (బీటెక్) విద్యార్థులకు అందిస్తారు. ఏటా డిప్లొమా అభ్యర్థులకు రెండు వేలు, బీటెక్ విద్యార్థులకు రెండు వేలు చొప్పున మొత్తం 4 వేల స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉంటాయి. ఎంపికైన వారికి ఏటా ట్యూషన్ ఫీజు లేదా రూ.30 వేలు (ఏది తక్కువైతే దాన్ని) ఆర్థిక ప్రోత్సాహకంగా మంజూరు చేస్తారు. ప్రతి విద్యా సంవత్సరంలో 10 నెలల పాటు నెలకు రూ.2 వేలు స్టైపెండ్ కూడా లభిస్తుంది.

వెబ్‌సైట్: www.aicte-india.org

సైన్స్ విద్యార్థులకు డీఎస్‌టీ :

సైన్స్ కోర్సుల ఔత్సాహికులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ).. సైన్స్ స్కాలర్‌షిప్ ఫర్ ఉమెన్ పేరుతో ప్రోత్సాహకం అందిస్తోంది. ఎంఎస్సీ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయిలో రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌లో చేరిన వారిని అర్హులుగా పేర్కొంది. ఎంపికైన వారికి ఎంఎస్సీ స్థాయిలో నెలకు రూ.30 వేలు; ఎంఫిల్ స్థాయిలో నెలకు రూ.40 వేలు; పీహెచ్‌డీ స్థాయిలో నెలకు రూ.55 వేలు అందిస్తుంది.

వెబ్‌సైట్: www.dst.gov.in

డీబీటీ స్కాలర్‌షిప్స్ :

లైఫ్ సైన్సెస్ విభాగంలో విద్యార్థినులను ప్రోత్సహించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ (డీబీటీ) ప్రత్యేక ఫెలోషిప్ పథకాన్ని అమలు చేస్తోంది. బయోటెక్నాలజీ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ రీ-ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్ సైంటిస్ట్స్ పేరిట అన్ ఎంప్లాయ్డ్/ ఎంప్లాయ్డ్ పర్సన్స్‌కు ఫెలోషిప్‌ను అందుబాటులో ఉంచింది.

వెబ్‌సైట్: www.dbtindia.nic.inp



ఆహారభద్రతకు ఇంతేనా?

బడ్జెట్‌లో ఆహారభద్రతకు రూ. 3,495 కోట్లు కేటాయించారు. నిత్యావసర వస్తువుల స్థిరీకరణకు పౌరసరఫరాల కార్పొరేషన్‌కు అదనపు కేటాయింపులను ప్రతిపాదించారు. గిరిజన ఎల్పీజీ ప్యాకేజీ కింద పేద గిరిజన మహిళలకు రూ.2,480 విలువగల 5 కిలోల ఎల్జీజీ సిలెండరు కనెక్షను, ఐఎస్ఐ ప్రామాణ్యతగల స్టవ్, రెగ్యులేటర్, పాస్ పుస్తకాన్ని ఉచితంగా అందజేయనున్నారు. ఇప్పటివరకు 61,444 గిరిజన కుటుంబాలకు లబ్ధిచేకూరింది. గ్రామీణాభివృద్ధి కింద రాష్ట్రంలోని 56,735 కి.మీల అంతర్గత రహదారుల్లో 30,546కి.మీలు ఇప్పటికే సిమెంట్ పేవ్‌మెంట్ చేయబడ్డాయి. వాడవాడల్లో చంద్రన్న బాట కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి స్థాయిలో సిమెంట్ రోడ్లు వేసేందుకు సంకల్పించారు. 2017-18లో 5,102 కి.మీల నిడివిగల అంతర్గత రహదారులకు సిమెంట్ పేవ్‌మెంట్ వేసినట్టు తెలిపారు.



ఏపీ బడ్జెట్ 2018 -19



వ్యర్థాలతో ఇంధన ప్రాజెక్టులు

2018-19 రాష్ట్ర బడ్జెట్‌లోమున్సిపల్, పరిపాలన, పట్టణాభివృద్ధి, క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సీఆర్డీఏ)లకు రూ.7,741 కోట్లు కేటాయించారు. గతేడాదితోపోలిస్తే 49 శాతం ఎక్కువగా (గతేడాది5,207 కోట్లు) నిధులు పెంచారు. మురికి నీటి వ్యవస్థ మెరుగుదల కోసం రూ. 300 కోట్లు ప్రకటించారు. (గతేడాది రూ. 100 కోట్లు) ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య ఒప్పందంలోని అమృత్ పథకంలో నిర్ణయించిన 78 పట్టణాల్లోని విశాఖ, విజయవాడ, తిరుపతి, జిల్లాలకు ఒకటి చొప్పున మూడునిర్మాణాలు, వ్యర్థాల శుద్ధికోసం ప్రాజెక్టులు నిర్మించనున్నారు. ఈ పథకంలోనే మరో 51 పట్టణ స్థానిక సంస్థల్లోని 4,321 టన్నుల వ్యర్థాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఇంధన శక్తిగా మార్చడానికి 9 ప్రాజెక్టులు లభించాయి. విశాఖ, తిరుపతి, కాకినాడ, అమరావతిలతోపాటు శ్రీకాకుళం, ఏలూరు, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, నెల్లూరుల్లో స్మార్ట్ సిటీస్ మిషన్ అమలు కానుంది.

కేటాయింపులు ఇలా..

- వ్యవసాయ రంగానికి రూ.12,352కోట్లు. గతంలో పోలిస్తే 35.91 శాతం అదనం
- సాగునీటి రంగానికి రూ.16,978.23కోట్లు. గతంలో పోలిస్తే 32.95శాతం అదనం
- గ్రామీణాభివృద్ధికి రూ.20,815కోట్లు.
- ఇంధన రంగానికి రూ.5,052.54కోట్లు
- పరిశ్రమల శాఖకు రూ.3,074.87కోట్లు
- రవాణా శాఖకు రూ.4,653కోట్లు
- గృహ నిర్మాణ శాఖకు రూ.3,679కోట్లు
- సాధారణ సేవల కోసం రూ.56,113.17కోట్లు
- పోలవరం ప్రాజెక్టుకు రూ.9,000కోట్లు
- రైతు రుణమాఫీకి రూ.4,100కోట్లు
- విద్యా రంగానికి రూ.24,185.75కోట్లు. గతంలో పోలిస్తే 18.65 శాతం అదనం
- క్రీడలు, యువజన సేవల శాఖకు రూ.1,635.44 కోట్లు. గతంలో పోలిస్తే 62.7 శాతం అదనం
- సాంకేతిక విద్యకు రూ.818.02కోట్లు
- కళ, సాంస్కృతిక రంగానికి రూ.94.98కోట్లు
- సమాచార, పౌర సంబంధాల శాఖకు రూ.224.81కోట్లు
- కార్మిక, ఉపాధి కల్పనకు రూ.902.19కోట్లు
- వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం రూ.4,477కోట్లు
- బీసీ సంక్షేమానికి రూ.12,200కోట్లు
- కాపుల సంక్షేమానికి రూ.1,000కోట్లు
- మేదరుల సంక్షేమానికి రూ.30కోట్లు
- నాయీ బ్రాహ్మణుల కోసం రూ.30కోట్లు
- వైశ్యుల సంక్షేమం కోసం రూ.30కోట్లు
- కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం రూ.70కోట్లు
- చేతివృత్తులకు ఆదరణ పథకానికి రూ.750 కోట్లు
- చేనేతలను ప్రోత్సహించేందుకు జనతా వస్త్రాల పథకం కింద రూ.250కోట్లు
- జనతా వస్త్రాల సరఫరా కోసం రూ.200కోట్లు
- చంద్రన్న పెళ్లి కానుక కింద ఎస్సీలకు రూ.100కోట్లు, బీసీలకు రూ.100కోట్లు
- సామాజిక భద్రత కోసం రూ.3,029కోట్లు
- ఆర్థికంగా వెనుకబడిన కులాల విద్యార్థులకు బోధన ఫీజు కోసం రూ.700కోట్లు
- కాపు సామాజిక విద్యార్థులకు రూ.400కోట్లు
- హోంశాఖకు రూ.6,226కోట్లు
- పర్యాటక శాఖకు రూ.290కోట్లు
- తాగునీరు, పారిశుద్ధ్యం కోసం రూ.2,623కోట్లు
- ఫైబర్ గ్రిడ్ కోసం రూ.600కోట్లు
- మెడ్ టెక్ జోన్ కోసం రూ.270కోట్లు
- అన్నా క్యాంటీన్ల కోసం రూ.200కోట్లు
- స్టార్టప్‌ల కోసం రూ.100కోట్లు
- ఎన్టీఆర్ జలసిరి కోసం రూ.100కోట్లు
- డ్వాక్రా మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్ల కోసం రూ.100కోట్లు
- వారానికి ఐదు రోజులు గుడ్లు పథకానికి రూ.266కోట్లు
- పౌష్టకాహార లోపం నియంత్రణకు రూ.360కోట్లు
- హిజ్రాల సంక్షేమానికి రూ.20కోట్లు
- న్యాయశాఖకు రూ.886కోట్లు
- నిరుద్యోగ భృతికి రూ.1000కోట్లు
- ఎన్టీఆర్ పింఛన్లకు రూ.5,000కోట్లు
- ఎన్టీఆర్ ఆరోగ్య సేవకు రూ.1000కోట్లు
- స్వచ్ఛభారత్ కోసం రూ.1,450కోట్లు
- విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు రూ.1,168కోట్లు
- గృహ నిర్మాణం-భూసేకరణకు రూ.575కోట్లు
- ఈ-ప్రగతికి రూ.200కోట్లు
- మెగా సీడ్ పార్క్ కోసం రూ.100కోట్లు
- చర్మకారుల జీవనోపాధి కోసం రూ.60కోట్లు

వెనుకబడిన తరగతులకు ఆసరా అట...



వెనుకబడిన తరగతులకు గత బడ్జెట్‌లో రూ.3,316 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.4,477 కోట్లు కేటాయించారు. అంటే 35% పెంపును ప్రతిపాదించారు. దాదాపు 16 లక్షల వెనుకబడిన తరగతుల విద్యార్థులకు గత బడ్జెట్‌రూ.1,732 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది దాన్ని రూ.2,165 కోట్లకు పెంచారు. కాపు సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు రూ.400 కోట్లు ప్రతిపాదించారు. అలాగే చేతివృత్తుల వారికి ఆదరణ పథకం కింద రూ.750 కోట్లు, చేనేత పనివారలకు రూ.200 కోట్లు, నూలు కొనుగోలుపై రాయితీకి రూ.42 కోట్లు కేటాయించారు.

సాంఘిక సంక్షేమానికి పెద్దపీట



సాంఘిక సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ.3,685 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.11,228 కోట్లు కేటాయించారు. అంటే 14% పెంపును ప్రతిపాదించారు. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీకి గతంలో రూ.749 కోట్లు కేటాయించగా, వాటిని రూ.1,050కి పెంచారు. అలాగే షెడ్యూలు కులాల సర్వతోముఖాభివృద్ధికి, సాధికారితకు ఎస్సీ కాంపోనెంట్ కింద రూ.9,847 కోట్లను 22 శాఖలకు కేటయించారు. 250 కంటే జనాభా కలిగి అనుసంధానంలేని ఎస్సీ ఆవాసాలను కలుపుతూ 446 రహదారులను రూ.452 కోట్లతో నిర్మించదానికి అనుమతులు మంజూరయ్యాయి.

గ్రామీణాభివృద్ధికి పరిమిత కేటాయింపులు



గ్రామీణాభివృద్ధి శాఖకు గత బడ్జెట్‌లో రూ.21,140 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.23,439 కోట్లు కేటాయించారు. అంటే 11% పెంపును ప్రతిపాదించారు. ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం కింద 103 క్లస్టర్లలో 8000 నివాస యోగ్యాలను కమ్యూనిటీ ట్రీట్‌మెట్ ప్లాంట్స్ ద్వారా సురక్షిత మంచినీటి సదుపాయాల ఏర్పాటు. అన్ని కుటుంబాలకు కుళాయి సదుపాయం. రూ.22 వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు ప్రతిపాదనలు. ఎన్‌టీఆర్ సుజల స్రవంతికి రూ.150 కోట్లు. స్వచ్ఛాంధ్ర మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో 86% కుటుంబాలకు ఐహెచ్‌హెచ్‌ఎల్ సదుపాయం

విద్యకు స్వల్ప ఊరట..

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్టులో మానవ వనరుల అభివృద్ధికి కాస్త ఊరట కలిగింది. 2018-19 బడ్జెట్టులో విద్యకు మొత్తంగా రూ. 24,185.75 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 2017-18 బడ్జెట్టు కంటే అధికంగా 18.65 కోట్ల నిధులను సమకూర్చారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, విశ్వవిద్యాలయాల విద్యాభివృద్ధికి, మౌలిక సౌకర్యాల కల్పనకు బడ్జెట్టులో సముచిత స్థానం కల్పించారు. 2017-18 బడ్జెట్టులో పాఠశాల విద్యకు రూ.17.197 కోట్లు అనగా 13.05శాతం కేటాయించారు. 2015-16 బడ్జెట్టులో విద్యకు 16.44శాతం నిధుల్ని సమకూర్చారు. దీంతో గత ఆర్థిక సంవత్సర బడ్జెట్టు కంటే.. ఈ ఏడాది బడ్జెట్టులో విద్యకు మెరుగ్గా నిధుల్ని కేటాయించడం గమనార్హం. సెకండరీ విద్యకు గత బడ్జెట్టు కంటే రూ. 21,612 కోట్ల (20శాతం) నిధుల్ని కేటాయించారు. సాంకేతిక విద్యకు రూ.818.02 కోట్లు, మోడల్ స్కూళ్లకు రూ.377 కోట్ల నిధుల్ని ప్రభుత్వం వెచ్చించింది. రూ.266 కోట్లతో మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పటిష్టం చేయాలని నిర్ణయించింది. 2017-18 బడ్జెట్టులో వారానికి 3కోడి గుడ్లను కేటాయించగా, 2018-19 బడ్జెట్టులో 5 కోడిగుడ్లతో విద్యార్థులకు భోజనం వడ్డించనున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం రూ. 23కోట్లు కేటాయించారు. పౌష్టికాహారాన్ని ఇంటర్ విద్యార్థులకూ అమలు చేయనున్నారు. డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల ప్రయోగశాల్ని ఏర్పాటు చేసి ఆంగ్ల విద్యను మరింత బలోపేతం చేయనున్నారు. ఈ కళాశాలల భవన నిర్మాణం, ప్రయోగశాలల ఆధునీకరణ, మౌలిక సౌకర్యాలు, కొత్త పుస్తకాల సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. కొత్త విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రతి విశ్వవిద్యాలయానికి రూ.40కోట్ల చొప్పున నిధులు వెచ్చించనున్నారు. రాజమండ్రి-ఆది కవి నన్నయ్య, శ్రీకాకుళం-డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కర్నూలు-రాయలసీమ, నెల్లూరు-విక్రమ సింహపురి విశ్వవిద్యాలలను ఆధునీకరించనున్నారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికీ విద్యార్థినుల హాస్టల్ సౌకర్యం కోసం రూ.20కోట్లను బడ్జెట్టులో ప్రభుత్వం ప్రతిపాదించింది. 2015-16, 2016-17 బడ్జెట్టులో డిజిటల్ తరగతులు, సంక్షేమ హాస్టళ్లకు, నూతన గురుకుల పాఠశాలల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి నిధుల్ని కేటాయించలేదు. ఈ బడ్జెట్టులో డిజిటల్ తరగతులకు, కొత్త తరహా విద్యా బోధనా విధానానికిగాను రూ.117 కోట్లు, పాఠశాలల్లో మరుగు దొడ్ల నిర్మాణానికి రూ.100కోట్లు బడికొస్తా కార్యక్రమానికి రూ.160కోట్లు కేటాయించారు. గురుకుల విద్యాలయాల అభివృద్ధికి రూ.1,050కోట్ల నిధుల్ని ప్రభుత్వం వెచ్చించింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో రాష్ట్రంలో నడుస్తున్న మోడల్ స్కూళ్లకు రూ.377కోటు, అటు ఉన్నత విద్యకు మొత్తంగా రూ. 2,835కోట్లు కేటాయించారు. పాలిటెక్నికల్ కళాశాలల బలోపేతానికి 2017-18లో రూ.28కోట్లు కేటాయించగా, 2018-19 బడ్జెట్టులో వాటిని ఆరు రెట్లకు పెంపుదల చేసి రూ.176 కోట్ల నిధుల్ని వెచ్చించారు. నిరుద్యోగ భృతికి రూ.1000 కోట్లు కేటాయించారు. మొత్తంగా 2016-17, 2017-18 బడ్జెట్టులతో పోలిస్తే 2018-19 బడ్జెట్టులో మానవ వనరుల అభివృద్ధికి(విద్యారంగానికి) ప్రభుత్వం నిధుల్ని పెంపుదల చేసింది.

రూ.24,185.75 కోట్ల కేటాయింపు

- గత బడ్జెట్ కంటే 18.65 కోట్ల నిధుల పెంపు
- డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల ప్రయోగశాలలు
- పాఠశాల విద్యార్థులకు వారానికి ఐదు కోడి గుడ్లు
- ఇంటర్ విద్యార్థులకూ పౌష్టికాహారం



సెన్సెక్స్ 33,351.57
నిఫ్టీ 10,242.65

గోల్డ్

హైదరాబాద్	
22 క్యా. 10 గ్రా	29,150
24 క్యా. 10 గ్రా	31,176
విశాఖపట్టణం	
22 క్యా. 10 గ్రా	29,150
24 క్యా. 10 గ్రా	31,180
ప్రొద్దుటూరు	
22క్యా 10గ్రా	29,150
24క్యా 10 గ్రా	30,610
విజయవాడ	
22క్యా 10గ్రా	29,200
24క్యా 10 గ్రా	31,550

విదేశీ మారకం (ఫారెక్స్)

కరెన్సీ	రూపాయివిలువ
డాలర్	65.14
యూరో	80.68
పౌండ్	90.36
ఆస్ట్రేలియా డాలర్	50.80
సింగపూర్ డాలర్	49.48

ముడి చమురు 64.34
బ్రెంట్ ధర డాలర్లలో....

ఎస్‌బీఐకి ఆర్‌బీఐ పెనాల్టీ

ముంబై : నకిలీ నోట్లకు సంబంధించి నిబంధనలను అమలు చేయడంలో విఫలమైన ఎస్‌బీఐకు రూ. 40 లక్షల మేరకు జరిమాన విధించింది ఆర్‌బీఐ. ఈ మార్చి 1వ తేదీన ఆర్‌బీఐ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తొలుత ఆర్‌బీఐకు చెందిన రెగ్యులేటరీ అధికారులు రెండు ఎస్‌బీఐ శాఖల్లోని క్యాష్ చెస్ట్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. జనవరి 5న బ్యాంక్‌కు ఆర్‌బీఐ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. దీనికి ఎస్‌బీఐ ప్రతినిధి వచ్చి వివరణ ఇచ్చారు. ఈ వివరణను పరిశీలించిన అనంతరం ఎస్‌బీఐకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

పలు బ్యాంకులకు జరిమానా

ఇటీవల ఆర్‌బీఐ పలు బ్యాంకుల పనితీరును పరిశీలించి జరిమానాలు విధించింది. వీటిల్లో యాక్సిస్ బ్యాంక్ కూడా ఉంది. ఎన్‌పీఏలకు సంబంధించి ఆర్‌బీఐ నిబంధనలు పాటించనందుకు ఈ జరిమానా విధించింది. ఐవోబీకి కూడా రూ. 2 కోట్లు విధించినట్టు సమాచారం.

గృహనిర్మాణానికి సగం నిధులేనా...!

కేటాయింపు రూ.4,572 కోట్లు

కావాల్సింది రూ.10,125 కోట్లు

అందులో ఏపీ టిడ్కో గ్రాంట్ రూ.వెయ్యి కోట్లు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి ప్రభుత్వం అత్యంత అధిక ప్రాధాన్యం ఇచ్చే ఎన్‌టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణానికి ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన 2018-19 వార్షిక బడ్జెట్‌లో అంతంత మాత్రంగానే నిధుల కేటాయింపు జరిగింది. వార్షిక బడ్జెట్‌లో గృహనిర్మాణం, ఇళ్ల స్థలాల కొనుగోలు కోసం రూ.4,752 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాదితో పోల్చితే కేటాయింపు మూడు రెట్లు పెరిగినప్పటికీ, ఇళ్ల నిర్మాణం కూడా అదేరీతిలో పెరిగాయి. గత సంవత్సరం గృహనిర్మాణానికి రూ.1,456 కోట్లను ప్రభుత్వం కేటాయిం చింది. గ్రామాల్లో ఎన్‌టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం, పట్టణాలలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనా ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సుమారు 30 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం చేయాలని ప్రభు త్వమే లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకే రూ.10,125 కోట్ల నిధుల అవసరం ఉంది. కాని అందులో సగం నిధులను కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవటం గమ నార్హం. ఇప్పటికే ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మెటీరియల్ కాంపోనెంట్, వేజ్ కాంపో నెంట్‌తోపాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన రూ.58 వేలు రాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాని తాజా బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకం నుంచి ఏమేర నిధులు వస్తా యో స్పష్టంగా పేర్కొనకపోవటం గమనార్హం. తాజా గా కేటా యించిన నిధులలో గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 4.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాం తాల్లో మరో 1.25 లక్షల ఎన్‌టీఆర్ గృహనిర్మాణాలు సాగుతున్నాయి. ఇవి కాకుండా కేంద్ర ప్రభుత్వ సహకా రంతో పట్టణాలలో మరో తొమ్మిది లక్షల ఇళ్ల నిర్మణాలు చేపట్టాల్సి ఉంది. తాజా బడ్జెట్‌లో గృహనిర్మాణానికి రూ.3,600 కోట్లను, పేదలకు నివేశన స్థలాలు కొనుగోలు చేసేందుకు రూ.500 కోట్లను, పట్టణ ప్రాం తాల్లో నిర్మి స్తున్న ఇళ్లకు రూ.వెయ్యి కోట్లు ఏపీ టిడ్కో నుంచి గ్రాంట్ వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది.

గృహనిర్మాణం కేటాయింపులు

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2016-17	1,136.83
2017-18	1,456.55
2018-19	4,572.00




గిరిజన సంక్షేమం అంతంత మాత్రం...

గిరిజన సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ.3,528 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 4,176 కోట్లు కేటాయించారు. అంటే 18 శాతం పెంపును ప్రతిపాదించారు. రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణానికి గతంలో రూ.100 కోట్లు కేటాయించగా, వాటిని రూ.250 కోట్లకి పెంచారు. అలాగే గిరిజన సంక్షేమ రెసిడెన్షిల్ స్కూల్స్‌కు గతంలో రూ.524 కోట్లు కేటాయించగా వాటిని రూ.670 కోట్లకు పెంచారు. షెడ్యూల్ తెగల ఆర్థిక సహాయానికి, నైపుణ్య పెంపు కార్యక్రమాలకు రూ.262 కోట్లు, గిరిజనులకు పోషకాహారాన్ని సమకూర్చేందుకు ఫుడ్ బాస్కెట్‌లకు రూ. 40 కోట్లు ప్రతిపాదించారు. అలాగే ఐటీడీఏలలో మార్కెటింగ్, స్టోరేజ్, మౌలిక సదుపాయాల కల్పన మరింత బలోపేతం చేయడానికి రూ.50 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్‌కు ఎస్టీ ఉపపథకం కింద రూ.10,033 కోట్లు కేటాయించారు. అత్యాధునిక ట్రిపుల్ ప్లే సర్వీసులను గిరిజన ప్రాంతాల్లో అన్ని పంచాయతీలకు విస్తరించాలన్న యోచనతో వయబులిటీ గ్యాప్ సహాయంగా రూ.90 కోట్లు కేటాయించారు.




ఆరోగ్య సం'రక్షణ' .. మాటలకే పరిమితం




ఆరోగ్య సంరక్షణకు గత బడ్జెట్‌లో రూ.7,020 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.8,463 కోట్లు కేటాయించారు. అంటే 21% పెంపును ప్రతిపాదించారు. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ సాధించేందుకు నాణ్యతతో కూడిన మెరుగైన సేవలు అందించేందుకు పీపీపీ విధానంలో ఆరోగ్య సేవలు అందించనున్నారు. ఇందుకోసం సాంకేతిక సూచనలు ఇచ్చేందుకు పలు సంస్థలను నియమించారు. అలాగే శ్రీకాకుళంలోని ఉద్దానంలో మూత్రపిండాల వ్యాధులు కలవరపెడుతున్నాయి. సత్వరమే బాధితుల ఉపశమనం కోసం 14 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

క్రీడా వికాసానికి అరకొర నిధులు




క్రీడలకు గత బడ్జెట్‌లో రూ.211 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.300 కోట్లు కేటాయించారు. అంటే 42% పెంపును ప్రతిపాదించారు. ఫిజికల్ లిటరసీ కార్యక్రమానికి రూ. 50 కోట్లు కేటాయించారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో క్రీడాకారులు అత్యున్నత ప్రమాణాలు చూపడానికి, బాలబాలికలకు ఆరు అకాడమీలు, ప్రతి ఒక్క అకాడమీకి 150 మంది ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను ఏర్పాటు చేస్తారు. 13 జిల్లాల నుంచి ఎంపికచేసిన 303 ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ ఎడాప్టెడెట్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

మాటల వరకే మైనార్టీల సంక్షేమం



అల్ప సంఖ్యాక వర్గ సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ.840 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,102 కోట్లు కేటాయించారు. అంటే 31% పెంపును ప్రతిపాదించారు. స్వయం ఉపాధికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, సాంకేతిక శిక్షణ ద్వారా నైపుణ్యం మెరుగుపరుచుకోవడానికి ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తోంది. విదేశీ విద్య పథకాల్లో భాగంగా అల్పవర్గాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేస్తోంది. దుల్హన్ పథకానికి రూ.80 కోట్లు, ఇమామ్స్, మౌజమ్స్‌కు రూ.75 కోట్లు కేటాయించారు.

గృహ నిర్మాణం వేగవంతం



గృహనిర్మాణానికి గత బడ్జెట్‌లో రూ.1,452 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.4,752 కోట్లు కేటాయించారు. అంటే మూడు రెట్ల పెంపును ప్రతిపాదించారు. ప్రధానమంత్రి అవాస్ యోజన అనుసంధానంతో ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద 1,25వేల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. మరో 4.50 లక్షల ఇళ్లు ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ కింద వివిధ దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి.

మేక వన్నె పులి



ఒక గ్రామంలో లక్ష్మీపతి అనే ధనవంతుడు ఉండేవాడు. పేరుకు తగ్గట్టు గానే రోజూ ముస్తాబు అవుతుండేవాడు, లాల్చీ, పైజామా, కండువా, ఉంగరాలు, మెడలో గొలుసులతో తన దర్పాన్నంతా ప్రదర్శిస్తూండేవాడు. వేసుకొని పైకి చాలా సౌమ్యుడులా కనిపించేవాడు. అతని మాటలు, సూక్తులు, నీతులు, వేషభాషలు చాలా సౌమ్యంగా వుండేవి. అతని మనసు మాత్రం నిత్యం ఈర్ష్యా ద్వేషాలతో, కక్షలు, కుట్రలు, అసూయ, అనుమానం, అపార్ధంతో రగిలిపోతూ వుండేది.


"సాధువు అత్యంత సౌమ్యుడు, మహామంచివాడు, అమాయకుడు, నీతి నిజాయితీ గల గొప్ప మానవతావాది" అని అందరూ అనుకునే వారు. అతన్ని చూస్తే పరమ మేధావులు కూడా "యితడు పరమ పవిత్రుడు, మంచివాడు" అని అనుకునే విధంగా నటించేవాడు సాధువు.


ఒక రోజు అతడు అడవి దారిలో పోతుంటే ఒక ముసలమ్మ డబ్బు, బంగారం మూటతో కనిపించింది. సాధువు ఆమెను పలకరించి "ఏమైనా సాయం కావాలా?" అని అడిగాడు "నేను ఈ డబ్బు, బంగారం నీకు యిస్తాను, నీవు మహా మంచివాడివి కాబట్టి నీ మీద నాకు నమ్మకం వుంది. నీవు పోయి ఈ డబ్బుని, బంగారాన్ని పేద నిరుపేదలకు పంచిపెట్టు నేను నా ఆరోగ్యం కుదుటపడ్డాక గ్రామం చేరుకుంటాను" అని చెప్పింది. సాధువులో స్వార్ధపరుడు రగిలిపోయాడు వెంటనే ముసలమ్మ సంపదను తీసుకొని, ఆమెను ఒక రాయితో మోది చంపడానికి ప్రయత్నించాడు అతడు కొట్టిన రాతి దెబ్బకు ఆమె స్పృహ కోల్పోయింది, "చని పోయింది" అనుకొని సంపదతో యిల్లు చేరి ఏమీ తెలియనట్లు వున్నాడు సాధువు.

రెండు రోజు గ్రామ పంచాయతీకి గ్రామ సర్పంచ్ సాధువుని పిలిపించాడు, గ్రామసభలో సాధువుని నిలబెట్టి "నువ్వు ఈ కుర్రవాడిని చంపడానికి ప్రయత్నించావట" నిజమేనా? అని అడిగాడు. "లేదు లేదు" అంటూ కంగారు పడ్డాడు సాధువు. "నీవు హత్యా ప్రయత్నం చేసినట్లు సాక్ష్యాలు వున్నాయి. ఎంతో భవిష్యత్ వున్న ఈ చిన్న కుర్రవాడ్ని చంపడానికి ప్రయత్నించావు కాబట్టి నీకు మరణశిక్ష పడుతుంది. అదే నీవు ముసలివాళ్ళను చంపడానికి ప్రయత్నిస్తే కేవలం ఏడేళ్ళు మాత్రమే శిక్ష పడేది "అని తెలివిగా మాట్లాడాడు సర్పంచ్" నిజానికి నేను ముసలిదాన్నే చంపాను" అని తడబడుతూ అన్నాడు సాధువు; తనకు శిక్ష తగ్గుతుందన్న ఆశతో. గ్రామస్థులందరూ సాధువుని నిలదీస్తూ,"ఈ తెలివైన కుర్రవాడునీ స్వార్ధబుద్ధిని బయట పెట్టడానికే ముసలిదాని వేషంలో నీ దారిలో మాటువేశాడు, నీ స్వార్ధబుద్ధి బయట పెట్టాడు; గతంలో చాలాసార్లు నీవు మేక వన్నె పులివి అని ఈ తెలివైన కుర్రాడు పసిగట్టి చెప్పినా మేము నమ్మలేదు .... నీకు మరణ శిక్షే సముచితం" అంటూ గ్రామస్థులు అరిచారు. సాధువు మోకాళ్ళు మీద నిలబడి అందరినీ క్షమాపణ కోరాడు. తన యావదాస్తినీ గ్రామానికి యిచ్చేసి తాను హిమాలయాలకు పోయాడు.

మీగడ. వీరభద్రస్వామి, 9441571505







1. వేటిని మొట్టమొదటి రైళ్ల లేదా రైలు ఇంజిన్లుగా చెప్పవచ్చు?
2. స్టీమ్ ఇంజిన్‌ను ఎవరు కనుగొన్నారు?
3. పట్టాలమీద నడిచే తొలి రైలింజన్‌ను ఎప్పుడు తయారుచేశారు?
4. ప్రపంచంలోకెల్లా పొడవైన రైల్వే లైను ఎక్కడ ఉంది?
5. మొట్టమొదటి భూగర్భ రైల్వేలైనును ఎక్కడ నిర్మించారు?


జవాబులు:



1. రైలు ఇంజిన్లను కనిపెట్టకముందు చెక్కతో తయారైన రైళ్లను ఉపయోగించేవారు. బ్రిటన్‌లో 15వ శతాబ్దానికి పూర్వం గుర్రాలతో నడిచే చెక్క రైళ్లను వినియోగించేవారు. 1804లో స్టీమ్ ఇంజిన్‌తో నడిచే రైలును కనుగొన్నారు. దీన్నే మొదటి రైలుగా చెప్పవచ్చు.



2. గ్రీకు గణిత శాస్త్రవేత్త 'హీరో' తొలినాటి స్టీమ్ ఇంజిన్‌ను రెండో శతాబ్దంలోనే కనుగొన్నాడు. అయితే అన్ని హంగులు కలిగిన తొలి స్టీమ్ ఇంజిన్‌ను 1769లో జేమ్స్‌వాట్ రూపొందించాడు.



3. 1804లో రిచర్డ్ ట్రివితిక్ అనే నిపుణుడు ఇంగ్లండ్‌లో స్టీమ్ ఇంజిన్‌తో నడిచే రైలును రూపొందించాడు.
4. రష్యాలో 9,300కిలోమీటర్ల పొడవున్న ట్రాన్స్-సైబీరియన్ రైల్వే మార్గం అన్నింటికన్నా పొడవైనది.



5. లండన్‌లోని 'ది మెట్రోపాలిటన్ లైన్'ను తొలి భూగర్భ రైల్వే మార్గంగా చెప్పవచ్చు. దీన్ని 1863లో ప్రారంభించారు.





16న దండుపాళ్యం 3





దండుపాళ్యం ఈ పేరు వింటేనే కన్నడ సీమ అదిరిపోతుంది. బెంగుళూరు సిటీకి ముచ్చెమటలు పట్టించిన ఓ నొటోరియస్ కిల్లర్ గ్యాంగ్‌కి పోలిసులు ఇచ్చిన బిరుదే దండుపాళ్యం. ఆ గ్యాంగ్‌కి సంబంధించిన ఊరు పేరే ఈ దండుపాళ్యం. కన్నడంలో దండుపాళ్య అని అంటారు.

1996 నుంచి 2000 మధ్య బెంగుళూరు, చెన్నై పరిసర ప్రాంతాల్లో 80కి పైగా హత్యలు, రేప్‌లు, దోపిడీలు చేసిన హంతకుల ముఠా నేపథ్యంగా, యదార్ధ సంఘటనలు ఆధారంగా కన్నడ దర్శకుడు శ్రీనివాస రాజా 2012లో కన్నడనాట దండుపాళ్య అనే చిత్రాన్ని తెరకెక్కించారు.

ఈ చిత్రంలో ప్రముఖ శాండిల్ వుడ్ హీరోయిన్ పూజా గాంధీ కీలకపాత్ర పోషించారు. థియేటర్ ఆర్ట్స్ యాక్టర్స్ రవికాలే, మకరందన్ దేశ్ పాండే తదితరులు ఈ చిత్రంలో నటించారు. పూజాగాంధీ, రవికాలే, మకరందన్ దేశ్ పాండే మినహా ఓ తొమ్మిది మంది నూతన నటీనటులతో దండుపాళ్యం చిత్రాన్ని 3 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కించాడు దర్శకుడు శ్రీనివాస రాజు. ఉన్నది ఉన్నట్లుగా చూపించే ప్రయత్నంలో భాగంగా కొద్దిగా బోల్డ్‌గా ఈ సినిమాను తెరెక్కించి అప్పట్లో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు దర్శకుడు.

హింసాప్రేరేపిత సన్నివేశాలు ఉన్నాయని ఈ చిత్ర ప్రదర్శన ఆపేయాలంటూ కన్నడనాట పెద్ద ఎత్తున ఆందోళన జరగడం దండుపాళ్యంకు మరింత ఊపును ఇచ్చింది, కన్నడంలోనే కాకుండా తెలుగు, తమిళ, మళయాలీ భాషల్లో కూడా ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించారు. అన్ని భాషల్లో కలిపి దాదాపు 40 కోట్లకి పైగా గ్రాస్ ను వసూలు చేసింది ఈ క్రైమ్ థ్రిల్లర్.

మొదటి భాగం ఇచ్చిన ఊపుతో అదే నటీనటులతో దండుపాళ్యంకి సీక్వెల్‌ని 2014లో తెరకెక్కించేందుకు రంగం సిద్ధం చేసింది దర్శకుడు శ్రీనివాసరాజు అండ్ టీమ్. అయితే కొన్ని కారణాల వల్ల ఈ రెండో భాగం 2016లో సెట్స్ పైకి వచ్చింది. 2017లో రిలీజై విజయాన్ని అందుకుంది అలానే దర్శకుడుతో పాటు నటీనటులకి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ముఖ్యంగా ఈ రెండు భాగాలు తరువాత డైలాగ్ కింగ్ సాయికుమార్ సోదరుడు రవిశంకర్ కన్నడనాట యాక్టర్ గా బిజీ అయ్యాడు. ఓ వైపు తన గంభీరమైన గాత్రంతో డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకున్న రవిశంకర్, దండుపాళ్యం సీరిస్‌తో నటుడిగా కూడా మరో మెట్టు ఎక్కాడు. దండుపాళ్యం 2లో కన్నడ హాట్ బ్యూటీ సంజనా కూడా నటించింది. ఇక దండుపాళ్యం మొదటి, రెండు భాగాలతో ఆగని దర్శకుడు దండుపాళ్యం 3కి తెరలేపడం గతేడాది ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయింది. మూడో భాగంలో కూడా మొదటి రెండు భాగాల్లో నటించిన నటీనటుల్నే తీసుకొని దండుపాళ్యం 3ని రెడీ చేశాడు దర్శకుడు శ్రీనివాస రాజు. ఈనెల 16న విడుదల కాబోతున్న దండుపాళ్యం 3తో ఈ ట్రాయాలజీకి ఫుల్ స్టాప్ పెడుతున్నట్లుగా దర్శకుడు శ్రీనివాస రాజు ప్రకటించారు.

ఈ సక్సెస్ ఫుల్ సీరిస్‌లో లేటెస్ట్ పార్ట్‌ని శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్స్‌పై శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి, సాయి కృష్ణ పెండ్యాల సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్ర తెలుగు హక్కులకు ఏర్పడ్డ క్రేజ్ దృష్ట్యా ఫ్యాన్సీ రేట్ ఆఫర్ చేసినట్టు నిర్మాతలు చెబుతున్నారు. సహజత్వం కూడిన సన్నివేశాలతో, భావోద్వేగమైన డైలాగులతో ఈ కథ సాగుతుంది. 'దండుపాళ్యం 3' చిత్ర ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ 'దండుపాళ్యం' సీరిస్‌కి ఇదే చివరి పార్ట్ కావటంతో అసలు క్లైమాక్స్ ఎలా వుండబోతుందో అనే ఆసక్తి అందరిలోనూ వుంది.

సోషల్ మీడియా వ్యసనంగా మారింది!



కథానాయకుడు విజయ్ దేవరకొండకు నాకు మధ్య ఎలాంటి సమస్యలు లేవు. ప్రస్తుతం ఇతర చిత్రాల షూటింగ్‌లతో బిజీగా వుండటం వల్ల ఆయన ఈ చిత్ర ప్రచారానికి రావడం లేదు. విజయ్ మాకు ఎల్లప్పుడూ అన్ని విధాలా సహకరించాడు. ఆయనతో సినిమా చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు శ్రీధర్ మర్రి. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం ఏ మంత్రం వేసావే. విజయ్ దేవరకొండ, శివానీ సింగ్ జంటగా నటించిన ఈ చిత్రం నేడు రీలీజ్ అవుతున్నది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీధర్ మర్రి గురువారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.

నేపథ్యం..

చిన్నతనం నుంచి సినిమాలతో పాటు స్టోరీస్ అంటే చాలా ఆసక్తి వుండేది. ఊహ తెలిసిన దగ్గరి నుంచే కథలు రాయడం అలవాటుగా మారింది. నా స్వస్థలం హైదరాబాద్. అయితే మా కుటుంబం కొన్ని కారణావల్ల బెంగళూరులో స్థిరపడింది. ఇంజీనీరింగ్ పూర్తి చేసిన తరువాత మాస్టర్స్ ఇన్ ఇండస్ట్రీయల్ డిజైన్ చేశాను. ఆ తరువాత కోల్‌కతాలో ఐఏఎమ్ చేశాను. ఇన్ఫోసిస్‌లో వైస్‌ప్రెసిడెంట్‌గా 15 ఏళ్లు పనిచేశాను. నేనున్న రంగం వేరు కావడంతో సినిమా రంగంవైపు దృష్టి సారించలేకపోయాను. అయితే కెరీర్‌లో స్థిరపడిన తరువాత సినిమా చేయాలనే కోరికను నెరవేర్చుకోవాలనే సంకల్పంతో సినిమా చేయాలని ఓ కథ రాసుకున్నాను. అదే ఏ మంత్రం వేసావే.

సోషల్ మీడియా పిచ్చిలో..

మన చుట్టూ నిత్యం జరిగే సంఘటనలను తీసుకుని కథ చేసుకున్నాను. మన చుట్టూ వున్న వాళ్లతో కాకుండా ప్రతీ ఒక్కరు నిత్యం సెల్‌ఫోన్‌లో మునిగితేలుతున్నారు. ఈ పిచ్చిలో ప్రతీ చిన్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం మొదలైంది. ప్రాఫిట్ మోజులో సోషల్ మీడియా కంపెనీలు జనాలని ఏ స్థాయికి దిగజారుస్తున్నారో వాళ్లు పట్టించుకోవడం లేదు. సోషల్ మీడియా మోజులో భావోద్వేగాల్ని, బంధాల్ని మర్చిపోవడం వేలం వెర్రిగా మారింది. దీన్నే ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని యూత్‌కు చెప్పాలనుకున్నాను. అయితే ఇది రెగ్యులర్‌గా సాగే సినిమా కాదు.

మార్పులు చేయలేదు..

పెళ్లిచూపులు చిత్రానికి ముందే విజయ్ దేవరకొండకు ఈ కథ చెప్పాను. ఇలాంటి కథతో రిస్క్ చేయడానికి ఏ నిర్మాత ముందుకురాడని గ్రహించి స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించాను. ఉద్యోగం చేస్తూ సినిమా చేయడం వల్ల కొంత ఆలస్యమైంది. ఈ సమయంలోనే విజయ్ చేసిన పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాలు సూపర్‌హిట్ అయ్యాయి. వాటి ఫలితాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రంలో ఎలాంటి మార్పులు చేయలేదు. గత చిత్రాలకు ఏ మాత్రం సంబంధం లేని విధంగా చాలా భిన్నంగా విజయ్ దేవరకొండ పాత్ర వుంటుంది. అందుకే ఆ చిత్రాలతో పోల్చవద్దు అంటున్నాను.విభిన్నమైన పాత్రల్లో నటించేలా నటులకు ప్రేక్షకులు స్వేచ్ఛనివ్వాలి. లేదు ఒకే తరహా పాత్రల్లో చూస్తాం అనడం తప్పు. అమీర్‌ఖాన్ దంగల్ సినిమా తరువాత మళ్లీ అదే తరహా సినిమా చేస్తానంటే కుదరదు కదా. కొత్త తరహా కథలు చేస్తేనే నటుడనే వాడి కెరీర్ ఫుల్‌ఫిల్ అవుతుంది. ఇక ఈ సినిమా పూర్తయిన తరువాత చాలా మంది డిస్ట్రిబ్యూటర్‌లను సంప్రదించాను. కానీ ఎవరూ దీన్ని విడుదల చేయడానికి ఆసక్తిని కనబరచలేదు. ఆ సమయంలో ఈ చిత్ర కథ నచ్చి ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి మల్కాపురం శివకుమార్ ముందుకొచ్చారు.

మా మధ్య ఎలాంటి సమస్యలు లేవు..

హీరో విజయ్‌కి నాకు మధ్య ఎలాంటి సమస్యలు లేవు. ప్రస్తుతం ఇతర చిత్రాల షూటింగ్‌లతో బిజీగా వుండటం వల్ల ఆయన ఈ చిత్ర ప్రచారానికి రావడం లేదు అంతే. డబ్బు కోసమే నేను చిత్రపరిశ్రమకు రాలేదు. అర్థవంతమైన చిత్రాలకే నా ప్రాధాన్యత. నా దగ్గర చాలా కథలున్నాయి. ఈ సినిమా తరువాత రిలీజ్ తరువాత ఓ కొత్త తరహా కథతో తదుపరి చిత్రానికి శ్రీకారం చుడతాను అని చెప్పారు శ్రీధర్.

విజయ్ దేవరకొండ, కె.ఇ. జ్ఞానవేల్‌రాజా, ఆనంద్ శంకర్ చిత్రం పేరు 'నోటా'



విజయ్ దేవరకొండ హీరోగా మెహరీన్ హీరోయిన్‌గా 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్‌రాజా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం. 14 చిత్రానికి 'నోటా' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను గురువారం సాయంత్రం 5 గంటలకు విడుదల చేశారు. విజయ్ దేవరకొండ, మెహరీన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రలు పోషిస్తుండగా ఈ చిత్రానికి సంగీతం: సి.ఎస్. శ్యాం, కెమెరా: శాంత, ఆర్ట్: కిరణ్, కాస్ట్యూమ్ డిజైనర్: శ్రావ్య, దర్శకత్వం: ఆనంద్‌శంకర్, నిర్మాత: కె.ఇ. జ్ఞానవేల్ రాజా.

విడుదలకు సిద్ధమైన మాస్ హీరో విశాల్ 'అభిమన్యుడు'



మాస్ హీరో విశాల్ కథానాయకుడిగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అభిమన్యుడు'. ఎం.పురుషోత్తమన్ సమర్పణలో హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయనున్నారు.

యూత్‌స్టార్ నితిన్ విడుదల చేసిన మొదటి పాట

ఈ చిత్రంలోని మొదటి పాటను యూత్‌స్టార్ నితిన్ నిన్న సాయంత్రం విడుదల చేశారు. 'తొలి తొలిగా తొలకరి చూసి పిల్లాడ్నై.. విప్పారిన కన్నుల్లో లోకాన్నే చూశా..' అంటూ సాగే ఈ పాటను శ్రేష్ట రచించగా, యువన్ శంకర్ రాజా సంగీత సారధ్యంలో జితిన్‌రాజ్ ఆలపించారు. ఈ సందర్భంగా హరి వెంకటేశ్వర పిక్చర్స్ అధినేత జి.హరి మాట్లాడుతూ "హీరో నితిన్‌గారు ఈ చిత్రంలోని మొదటి పాటను విడుదల చేశారు. యువన్ శంకర్‌రాజా అద్భుతమైన సంగీతాన్ని అందించారు. విశాల్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. మాస్ హీరో విశాల్, సమంత, యాక్షన్ కింగ్ అర్జున్‌తోపాటు భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, సినిమాటోగ్రఫీ: జార్జి సి. విలియమ్స్, ఎడిటింగ్: రూబెన్, ఫైట్స్: దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్: ఉమేష్ జె.కుమార్, మాటలు: రాజేష్ ఎ.మూర్తి, సహ నిర్మాత: ఇ.కె.ప్రకాశ్, నిర్మాత: జి.హరి, దర్శకత్వం: పి.ఎస్.మిత్రన్.

దిల్ రాజు నిర్మాణంలో రామ్ హలో గురు ప్రేమ కోసమే



యువ హీరో రామ్ కొత్త సినిమా పనులు మొదలయ్యాయి. దిల్ రాజు నిర్మాణంలో త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి రామ్ అంగీకరించిన విషయం తెలిసిందే. ఆ సినిమా గురువారం ప్రారంభమైంది. ఈ సినిమాకు హలో గురూ ప్రేమ కోసమే అనే టైటిల్ పెట్టారు. సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా ఆ టైటిల్‌తో పాటు లోగోను కూడా విడుదల చేశారు. గతంలో నాగార్జున నటించిన నిర్ణయం సినిమాలోని హలో గురు ప్రేమ కోసమేరో జీవితం అనే పాట ఎంత పెద్ద హిట్టో తెలిసిందే. ఆ పాటలోని పదాలను తీసుకునే రామ్ సినిమాకు ఆ పేరు పెట్టారు. ఈ సినిమాలో రామ్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటిస్తోంది. ఉన్నది ఒకటే జిందగీ తర్వాత రామ్, అనుపమ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది.

సమతుల్య పారిశ్రామికాభివృద్ధి

రూ.3,075 కోట్లు కేటాయింపు



సమతుల్య, సమానమైన, వికేంద్రీకృత, పారిశ్రామికాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో 18 విభాగాలలో 1,946 మెగా ప్రాజెక్టులకు రూ.13.54 కోట్ల పెట్టుబడులు, 31 లక్షల ఉద్యోగావకాశాల కల్పనను పరిశీలిస్తున్నట్లు పేర్కొంటూ ఇందుకుగాను రూ.3,075 కోట్ల కేటాయింపును ప్రతిపాదించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఊతమిచ్చే స్టార్టప్ వ్యాపార సంస్థలకు ప్రోత్సాహకాలను అందించేందుకు రూ.100 కోట్లను, ఇక ఏపీఎస్ఎఫ్ఎల్, దాని అనుబంధ రంగాలకు రూ.602 కోట్లను ప్రతిపాదించింది. భావనపాడు తీర ప్రాంతం, కెఎస్ఇజెడ్ తీర ప్రాంతం, మచిలీపట్నం తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపింది.

పంచాయతీలు, గ్రేడ్-3 పురపాలక సంఘాలకు రూ.119 కోట్లు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.75 కోట్లు ప్రతిపాదించింది. అలాగే పురపాలక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యా నాణ్యత పెంపునకు రూ.50 కోట్లు, నగర పంచాయతీలు, గ్రేడ్-3 పురపాలక సంఘాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.119 కోట్లు కేటాయింపును ప్రతిపాదించింది.



ఆర్భాటం ఎక్కువ.. నిధులు తక్కువ

• పర్యాటక శాఖకు రూ. 290 కోట్లు • పర్యాటకుల సంఖ్య పెరిగిందట..



పర్యాటక ఆకర్షణలో దేశంలోనే మూడో స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని ప్రథమస్థానానికి చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ. 290 కోట్లు కేటాయించారు. 2016-17లతో పోల్చిచూస్తే 2017-18ల్లో పర్యాటకుల శాతం 8 శాతం పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. ఆతిథ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు 2,400 మందికి శిక్షణ ఇచ్చామని, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని విస్తరించేందుకు కళలు, సంస్కృతి, హస్తకళలు, కలంకారి, చేనేతల్లో నైపుణ్యం కలిగిన 12 గ్రామాల్లో ప్రాజెక్టు సంస్కృతీ పథకాన్ని ప్రారంభించామని ఏపీ ప్రభుత్వం వివరించింది. సంస్కృతి అభివృద్ధికోసం కళలు, సంగీతం, చరిత్ర, విజ్ఞాన శాస్త్రాల కోసం ప్రభుత్వం 7 అకాడమీలను ప్రారంభించగా ఈ విద్యా సంవత్సరం నుంచి అవి పనిచేస్తాయి. రాష్ట్రంలోని 6,746 మంది వృద్ధ కళాకారులకు ప్రభుత్వం పింఛన్‌ను అందిస్తోంది.

మహిళా, శిశువుల రక్షణకు నిధుల పెంపు

- పోషక ఆహారానికి 383 కోట్లు
- శానిటరీ నాప్‌కిన్‌లకు 100 కోట్లు



మహిళా, శిశు, వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ.1,773 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.3,008 కోట్లు కేటాయించారు. అంటే 70% పెంపును ప్రతిపాదించారు. పోషకార లోపంగల పిల్లలకు, తల్లులకు ప్రత్యేక పోషకాహార పథకానికి రూ.383 కోట్లు, అమృత హస్తం పథకాన్ని 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులకు విస్తృత పరిచారు. పోషకాహార పథకం అమలు ప్రస్తుత కేటాయింపును రూ.1,017 కోట్లకు పెంచారు. సబల పథకానికి రూ.60 కోట్లు, కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందించేందుకు రూ.27 కోట్లు, ఎస్‌హెచ్‌జీ మహిళలకు, ఇతర కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందించేందుకు రూ.100 కోట్లు ప్రతిపాదించారు. హిజ్రాల గౌరవప్రదమైన జీవనం కోసం రూ.20 కోట్లు ప్రతిపాదించారు.

పర్యావరణం, అడవులకు రూ.524 కోట్లు



పర్యావరణం, అడవులకు గత బడ్జెట్‌లో రూ.364 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.524 కోట్లు కేటాయించారు. అంటే 44% పెంపును ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 2,141 చదరపు మీటర్లలో చెట్లు, అడవులతో గరిష్ఠంగా నింపడంతో దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది.

ఉద్యోగులకు త్వరలో మరో విడత కరువు భత్యం



అన్ని కేడర్‌ల, వర్గాల ఉద్యోగుల ప్రతి విషయానికి ప్రభుత్వం మద్దతు ఇస్తుందని, వారి సహేతుకమైన, సమంజసమైన కోర్కెలను సానుభూతితో పరిశీలిస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. తాజాగా విడుదల చేసిన జనవరి 1, 2017 కిస్తుతో కలిపి ఏడు కిస్తుల కరువు భత్యాన్ని విడుదల చేశామని, త్వరలో మరో విడత కరువు భత్యాన్ని విడుదల చేస్తామని, అలాగే పదవ వేతన సవరణ బాకీలను ఉద్యోగులకు చెల్లించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇక ఆర్థిక నిర్వహణకు సంబంధించి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధనకు కూడా తగిన కేటాయింపులను ప్రతిపాదిస్తున్నట్లు వివరించారు.

నిర్మాణ పనులకు అంతంతమాత్రమే..

ఎక్సైజ్‌లకు రూ.50 కోట్ల చొప్పన

మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు, భవనాల నిర్మాణాలకు బడ్జెట్‌లో రూ.50 కోట్లు ప్రతిపాదించారు. ఎక్సైజ్ విభాగానికి కూడా అంతే మొత్తం కేటాయింపు ప్రతిపాదన చేశారు.



హోం శాఖకు రూ.6,226 కోట్లు

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ఉన్న 30 మోడల్ పోలీసుస్టేషన్ భవనాలకు నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక్కడ పనులు ఎంతో పురోగతిలో ఉన్నాయని, అలాగే అగ్నిమాపక, విపత్తు నివారణ విభాగాన్ని పటిష్టపరిచేందుకు మొత్తంగా రూ.6,226 కోట్లు కేటాయింపును ప్రతిపాదించింది.

న్యాయ శాఖకు రూ.886 కోట్లు

రాష్ట్రంలో 86 కోట్లు భవనాలు, 21 వసతి గృహాలను నిర్మించే 45 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని, ఇందుకోసం రూ.95 కోట్లు ప్రతిపాదించింది. ఇక పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి అవసరానికి అనుగుణంగా



న్యాయాధికారుల నియామకం చేపడతామని బడ్జెట్‌లో వెల్లడించింది. మొత్తంగా న్యాయ శాఖకు రూ.886 కోట్లు ప్రతిపాదించింది.

పశుగ్రాస బ్యాంకులు

పశువైద్యశాలలకు 111 కోట్లు



పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖకు గత బడ్జెట్‌లో రూ.1,394 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,743 కోట్లు కేటాయించారు. అంటే 25% పెంపును ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచార పశు వైద్యశాలలు ప్రారంభం. 10లక్షల క్వింటాళ్లు, 5 లక్షల క్వింటాళ్లతో పశుగ్రాస బ్యాంకుల రూపకల్పన చేశారు. వ్యవస్థాపకుల సహకారంతో భారీ పశుగ్రాస క్షేత్రాల నిర్వహణ చేపట్టాలని ప్రతిపాదన. రూ.111 కోట్లతో పశువైద్యశాలలు, చికిత్స కేంద్రాలు. 10 లక్షల జంతువులను బీమా చేసేందుకు రూ.5 కోట్లతో కొత్త స్కీమ్ ప్రతిపాదన. చంద్రన్న ఆక్వా రైతుల క్షేత్రాల పథకం కింద ఈ రంగంలో అత్యధిక వృద్ధి రేటును సాధించేందుకు వ్యవసాయ ఆధారిత చెరువులలో ఆధునిక టెక్నాలజీ వినియోగం.

పేదరిక నిర్మూలనే లక్ష్యమట

ఎన్టీఆర్ పెన్షన్ పథకానికి రూ.5 వేల కోట్లు



గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలనకు సెర్ప్ ద్వారా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎన్టీఆర్ పెన్షన్ పథకం క్రింద రూ.5 వేల కోట్లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు వడ్డీ లేని రుణాల పథకం క్రింద రూ.1,463 కోట్లు, ఎస్‌హెచ్‌జీ మహిళలకు క్యాపిటల్ ఇన్‌ఫ్యూజన్ క్రింద రూ.1,700 కోట్లు, స్త్రీ నిధికి రూ.100 కోట్ల కేటాయింపును బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

చంద్రన్న బీమాకు రూ.140 కోట్లు

చంద్రన్న బీమా క్రింద ఇప్పటి వరకు 28,038 అసంఘటిత శ్రామికులకు రూ.392 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పథకానికి రూ.140 కోట్లు ప్రతిపాదించింది.

నైపుణ్యాభివృద్ధికి రూ.300కోట్లు



నైపుణ్యాభివృద్ధి శాఖకు రూ.300కోట్లు కేటాయించారు. 2018-19లో పది లక్షల మంది లబ్ధిదారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విస్తరింపచేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన సాంఘిక సంక్షేమ, గిరిజన పాఠశాలలో డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధికలిపించే నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇచ్చి, వారిని ఉద్యోగానికి సంసిద్ధులను చేయడానికి 1000 నైపుణ్య శిక్షణా కేంద్రాలు ప్రారంభించనున్నారు.

రాజ్యసభకు ఎస్పీ అభ్యర్థిగా జయా బచ్చన్



లక్నో : రాజ్యసభకు జయాబచ్చన్‌ను నాల్గవసారి పంపించాలని సమాజ్‌వాది పార్టీ(ఎస్పీ) నిర్ణయించినట్లు ఆ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదురి తెలిపారు. శుక్రవారం లక్నోలో జయాబచ్చన్ నామినేషన్ దాఖలు చేయవచ్చని అన్నారు. ఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు కిరణ్మోయి నందా, సీనియర్ నాయకుడు నరేష్ అగర్వాల్ వంటి వారు గట్టి పోటీదారులుగా ఉన్నప్పటికీ పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్న ఎంపీ జయాబచ్చన్‌ను తిరిగి ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు పార్టీ అంతరంగిక వర్గాలు తెలిపాయి. జయాబచ్చన్ తొలిసారి 2004లో ఎన్నిక కాగా, అటుతర్వాత 2006, 2012ల్లో, ఇపుడు 2018 ఎన్నికలకు ఆమెనే అభ్యర్థిగా నిర్ణయించారు. ఇదిలాఉండగా, ఎస్పీ ఎంపీలు చౌదురి మున్వార్ సలీం, దర్శన్ సింగ్ యాదవ్, అలోక్ తివారిల పదవీ కాలం కూడా 2018, ఏప్రిల్ 2వ తేదీకి ముగియనుంది.

మహిళా శక్తి ప్రపంచానికి చాటాలి..

- నా ఖర్చులకు నా భార్యనే అడగాలి..
- 120 కోట్లతో శానిటరీ నాప్కిన్స్...
- స్త్రీ ప్రతిభకి ప్రోత్సహం అందిస్తాం..
- మహిళా దినోత్సవాల్లో ఏపీ సీఎం చంద్రబాబు...



విశాలాంధ్ర అమరావతి : మహిళా శక్తి ఎంతో గొప్పది మా కుటుంబం బాధ్యత అంతా నా భార్య , కోడలు చూసుకుంటారు. నా ఖర్చుల కోసం ఇప్పటికి నా భార్యని అడిగి తీసుకోవాల్సిందే అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసం వద్ద ఉన్న గ్రీవెన్స్ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ముఖ్యమంత్రి సందర్శించి వారి ప్రతిభా పాటవాలను కొనియాడారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ మహిళల శక్తి అపారమైనదని అన్ని రంగాల్లో మీరు తమ సత్తా చాటుతున్నారని కొనియాడారు. డ్వాక్రా సంఘాలకు 2000 రూపాయలు మహిళా దినోత్సవం సందర్భంగా ఇస్తున్నామని తెలిపారు. అంతేకాక మరో రెండు వేలు త్వరలోనే ఇస్తామని మహిళలకు చేయుతను ఇచ్చేందుకు అందించే సహకరమని చెప్పారు. ఆడవాళ్ళు ప్రత్యేక శ్రద్ధ కనబరచి పనిచేస్తారని అందుకే వారికి చేయూత ఇవ్వాలనుకుంటున్నామని అన్నారు. ఏ ఇంట్లో అయితే మహిళ చదువుకోని ఉంటుందో ఆ కుటుంబమే బాగుపడుతుందని సీఎం వ్యాఖ్యానించారు. మహిళకు సామర్థ్యం ఉంటే కుటుంబంతో పాటు గ్రామం, రాష్ట్రం కూడా బాగుపడుతుందని చిపోయారు. కుటుంబ పోషణలో మహిళలదే కీలక పాత్ర అని మా కుటుంబ పోషణలో సైతం నా భార్య కోడలు చేసుకుంటారని వివరించారు. నా కుటుంబం లో నాకు వచ్చే ఆదాయం తక్కువని, మా కంపెనీలు అన్ని మా భార్య ,కోడలు నడిపిస్తారని మా తండ్రి కొడుకుల ఆదాయం కన్నా వారి ఆదాయమే ఎక్కవ అని చెప్పారు.నేటికి లోకేష్ కానీ నేను కానీ ఇంటి బాధ్యతలు నెరవేర్చే వారిపైనే ఆధారపడాలని అన్నారు. నేడు ప్రభుత్వం మహిళకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. మగవాళ్ళు కూడా అన్ని సౌకర్యాలు వచ్చాయి గనుక వంట చేసుకోవచ్చనని చంద్రబాబు చెప్పటంతో సభలో నవ్వులు విరిసాయి. గతంలో మహిళలు టాయిలెట్స్ లేక ఇబ్బంది పడవలసి వచ్చేదని ఇప్పుడా ఆ పరిస్థితి లేదని అతికొద్ది రోజుల్లో వందశాతం ఓడిఎఫ్ గా తీర్చిదిద్దుతామని చెప్పారు.రాష్ట్రంలో 49.80 శాతం మంది మహిళలు ఉంటే అందులో 70.80 శాతం మంది ఆరోగ్య వంతులుగా ఉన్నారని తెలిపారు. మగవారు మాత్రం 63 సంవత్సరాల మాత్రమే జీవిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఉండాలని కొందరు పురుషుల్లో ఉన్న అసమాన భావాలను పారద్రోలాలని పిలుపునిచ్చారు. తలిబిడ్డ ఎక్స్ ప్రెస్, మహిళ మాస్టర్ హెల్త్ చెకప్ , సామూహిక శ్రీమంతాలు ,వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. లక్షా 80 వేల సైకళ్లు అందించామని అన్నారు. మహిళల రక్షణ కోసం నేడు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. పెళ్లికానుక పేరుతో బడుగు బలహీన వర్గాలకు చేయూత ఇస్తున్నామని అన్నారు. కోటి 60 లక్షలకు కుటుంబాలకు 120 కోట్ల ఖర్చుతో శానిటరీ నాప్కిన్స్ ఇస్తున్నామని 50 శాతం సబ్సిడీతో ఇవి పొందవచ్చని వివరించారు. విద్య అనేది కుటుంబ వ్యవస్థను అన్ని విధాలా అదుకుంటుందని అన్నారు. ప్రతి మహిళ నిత్య విద్యార్థిగా విద్యను అభ్యసిస్తూ ఉండాలని సూచించారు. నాలెడ్జ్ అనేది దోచుకోలేని సంపద అని చెప్పారు. డ్వాక్రా మెప్మా లు రెండు తనకు ఎంతో ముఖ్యమైనవని కొనియాడారు.



రాజ్యసభకు జైట్లీ, ప్రధాన్, జవదేకర్

ఎనిమిది మందితో బీజేపీ తొలి జాబితా

న్యూఢిల్లీ : రానున్న రాజ్యసభ ఎన్నికలకు ఎనిమిది మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితాను విడుదల చేసింది. కాషాయ పార్టీ లిస్టులో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ వంటి ప్రముఖ నాయకులు ఎగువ సభకు పోటీ చేయనున్నారు. ప్రస్తుతం గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న జైట్లీ ఈసారి ఉత్తరప్రదేశ్ నుంచి టికెట్ పొందారు. అయితే ప్రధాన్, జవదేకర్‌లు ఈసారి గుజరాత్ నుంచి పోటీ చేస్తున్నారు. ప్రధాన్ బీహార్ నుంచి ఎగువ సభకు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తుండగా, జవదేకర్ మధ్యప్రదేశ్ ఎంపీగా ఉన్నారు. కాగా సామాజిక న్యాయ మంత్రి తవార్‌చంద్ గెహ్లాట్, ఆరోగ్య మంత్రి జె.పి.నడ్డా, కేంద్ర మంత్రులు పరషోత్తం రూపాలా, మనుసుఖ్ మాందవియాలు కూడా పోటీలో ఉన్నారు. గెహ్లాట్, నడ్డాలు హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల నుంచి పోటీ చేస్తుండగా, రూపాలా, మాందవియాలు గుజరాత్ నుంచి బరిలో ఉన్నారు. గత రెండేళ్లుగా అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన పని తీరు ప్రదర్శించిన బీజేపీ రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. మొత్తం 58 రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి.

నాగాలాండ్ సీఎంగా రియో ప్రమాణస్వీకారం



కోహిమా : నాగాలాండ్‌లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొలువు దీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా 'నేషనల్ డెమోక్రటిక్-ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)' సీనియర్ నేత నెయిఫియు రియో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కోహిమాలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ పి.బి. ఆచార్య ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా, జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌లతో పాటు మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు బీరెన్ సింగ్, పెమా ఖండూ, శర్వానంద సోనోవల్, కాన్రాడ్ సంగ్మా హాజరయ్యారు.


సీపీఎం ఆఫీస్‌కు మానిక్ సర్కార్ మకాం



విశాలాంధ్ర-అగర్తల : త్రిపుర ఎన్నికల ఫలితాల అనంతరం మానిక్ సర్కార్ ముఖ్యమంత్రి నివాసాన్ని ఖాళీ చేశారు. తన భార్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని పాంచాలి భట్టాచార్యతో సహా సీపీఎం కార్యాలయంలో ఉన్న రెండు గదుల ఫ్లాట్‌లో ఉంటున్నారు. త్రిపుర ముఖ్యమంత్రిగా పనిచేసినా ఉండడానికి ఆయనకు సొంత ఇల్లు కూడా లేదు. అంతేకాక ఎమ్మెల్యేకు కేటాయించే గృహాలలో ఉండడానికి ఆయన ఇష్టపడలేదు. సీపీఎం కార్యదర్శి బీజన్ దార్ మాట్లాడుతూ పార్టీ కార్యాలయం ఎక్కువ ఖరీదైనవి కాకపోయినా ఉండడానికి కావలసిన కనీస వసతులున్నాయన్నారు. అంతేకాక చాలా మంది నాయకులు సాధారణ జీవితం గడిపారన్నారు. సర్కార్ తన ఆస్తినంతటిని తన చెల్లికి ఇచ్చేశారన్నారు. సర్కార్ పార్టీ కోసమే బతికారని ఆయన అన్నారు. సర్కార్ భార్యకు ఇంటి స్థలం ఉంది కానీ అది సమస్యల్లో వుందన్నారు. త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ దేవ్ మాట్లాడుతూ సర్కార్ సుపరిపాలన చేశారన్నారు.

దుబాయ్ నుంచి భారత్‌కు

25 ఏళ్ల తర్వాత మళ్లీ ఫరూక్‌పై విచారణ



విశాలాంధ్ర - న్యూఢిల్లీ : దావుద్ ఇబ్రహీం సహయకుడు ఫరూక్ తాక్లాను 25ఏళ్ల తరువాత గురువారం తడ కోర్టులో హాజరుపరిచారు. 1993లో జరిగిన ముంబాయి పేలుడు తర్వాత పారిపోయన ఫరూక్‌ను ఇంతకాలం తర్వాత దుబాయ్ నుండి తీసుకోచ్చారని ఎఎన్ఐ న్యూస్ తెలిపింది. ఫరూక్‌ని సీబీఐ గురువారం విచారించింది. అనంతరం రిమాండ్‌కు తరలించారు. సీనియర్ లాయర్ ఉజ్వల్ నిక్కమ్ మాట్లాడుతూ ఇది చరిత్రలోనే భారి విజయం అన్నారు.

యథేచ్ఛగా విగ్రహా విధ్వంసం

కేరళలో గాంధీ, తమిళనాడులో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసం



తిరువనంతపురం/చెన్నై : దేశవ్యాప్తంగా సోమవారం నుంచి విగ్రహాల విధ్వంసం దావానలం వ్యాపిస్తోంది. తాజాగా కేరళకు చెందిన కన్నూర్ జిల్లాలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని, తమిళనాడుకు చెందిన తిరువొత్రియూర్ పెరియార్ నగర్‌లో బాబా సాహెబ్ అంబేద్కర్‌లకు గురువారం ఉదయం అవమానం జరిగినట్లు గుర్తించారు. కన్నూర్‌కు చెందిన తాలిపరంబాలో మహాత్మాగాంధీ విగ్రహ కళ్లజోడు ధ్వంసం చేయడంతో అది వేలాడుతూ కనిపించింది. తమిళనాడులోని తిరువొత్రియూర్‌లో అంబేద్కర్ విగ్రహంపై ఎరుపు రంగు పెయింట్ పోశారు. త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్, కోల్‌కతాలో శ్యాంప్రసాద్ ముఖర్జీ, యూపీకి చెందిన మీరట్‌లో అంబేద్కర్ విగ్రహాలపై గుర్తు తెలియని దుండగులు గత కొన్ని రోజులుగా వరుసగా దాడులు జరుపుతున్నారు. కన్నూర్‌లో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై పోలీసులు మాట్లాడుతూ తాలిపరంబా తాలూకా కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్ముని విగ్రహంపై దుండగులు రాళ్లు, బాటిళ్లు విసిరి గాంధీ మెడలోని దండను, కళ్లజోడును ధ్వంసం చేశారని తెలిపారు. గురువారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించామన్నారు. ఈ ఘటన చోటుచేసుకున్న వెంటనే పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వాధికారులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దుండగులను పట్టుకునేందుకు విగ్రహం సమీపంలోని దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఎవరైనా విషయం ఇంకా తెలియకపోయినా దాడిలో చాలా మంది పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు. 2005లో మాజీ ముఖ్యమంత్రి ఒమన్ చాందీ ఆవిష్కరించిన గాంధీ విగ్రహంపై జరిగిన దాడిని రాజకీయ పార్టీలన్నీ ఖండించాయి. త్రిపురలో బీజేపీ మద్దతుదారులు కొందరు మంగళవారం కమ్యూనిస్టు నేత లెనిన్ విగ్రహాన్ని కూల్చి వేశారు. అయితే ఇటువంటి ఘటనలు ఆమోదనీయం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఖండించారు. ఇటువంటి ఘటనలను నిరోధించాల్సిందిగా రాష్ట్రాలకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కోరినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.శాంతి, భద్రతలకు విఘాతం కలిగినట్లయితే పోలీసు సూపరింటెండెంట్‌లు, జిల్లా మెజిస్ట్రేట్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని కూడా హెచ్చరించింది. అయితే మంగళవారం రాత్రి దుండగులు మీరట్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చి వేయడంతో స్థానిక దళితులు ఆందోళన చేపట్టారు.

హెల్మెట్ పెట్టుకోలేదని వెంబడించిన పోలీసు..

కింద పడి నిండు గర్భిణి మృతి



చెన్నై: హెల్మెట్ పెట్టుకోకుండా బైక్ నడుపుతున్న వ్యక్తిని పట్టుకునేందుకు ఓ పోలీసు అధికారి చేసిన ప్రయత్నం కారణంగా ఓ గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. తమిళనాడులోని తిరుచి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. తంజావూరుకు చెందిన రాజా అనే వ్యక్తి గర్భిణి అయిన తన భార్యతో కలిసి బుధవారం సాయంత్రం బైక్‌పై తిరుచి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో తిరువెరుంబర్ చెక్‌పాయింట్ వద్ద రాజా బైక్‌ను పోలీసులు ఆపబోయారు. అయితే అతడు హెల్మెట్ పెట్టుకోకపోవడంతో బైక్‌ను చెక్‌పాయింట్ వద్ద ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో కామరాజ్ అనే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజా బైక్‌ను వెంబడించాడు. పోలీసుకు దొరకకుండా ఉండేందుకు రాజా వేగంగా వెళ్లాడు. ఈ క్రమంలో బ్యాలెన్స్ కోల్పోయి రాజా, అతడి భార్య బండి మీద నుంచి పడ్డారు. ఈ ఘటనలో రాజా భార్య అక్కడికక్కడే మృతిచెందింది. బైక్ పైనుంచి పడిన తర్వాత ఆమెపై మరో వాహనం వెళ్లిపోయిందని దీంతో ఆమె ప్రాణాలు కోల్పోయిందని కొందరు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసు బైక్‌ను తన్నడం వల్లే వారు కిందపడిపోయారని మరికొందరు తెలిపారు.



రోడ్డు వేయొద్దంటూ అడ్డుపెట్టిన రైతు వాహనం (ఇన్‌సెట్) నిస్సహాయంగా పొలంలో సొమ్మసిల్లిన రైతు మీరా ప్రసాద్

రాజధాని రైతును లాగేసి రోడ్డేశారు

పోలీసులు, అధికారుల దౌర్జన్యంపై ఆగ్రహం

విశాలాంధ్ర-తుళ్ళూరు : రాజధాని నిర్మాణం కోసం ఆ రైతు భూమి ఇవ్వకపోయినా పోలీసులు బుధవారం అర్ధరాత్రి వేళ అతని భూముల్లో రోడ్డు నిర్మించిన ఘటన రాజధాని రైతుల్లో ఆగ్రహం రగిలించింది. తాత్కాలిక సచివాలయం వెనుక తన భూమి నుంచి రహదారి నిర్మించవద్దంటూ రైతు మీరా ప్రసాద్ సీఆర్డీఏ అధికారులకు వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. పనులు చేయొద్దంటూ అడ్డుపడిన మీరా ప్రసాద్‌ను పోలీసులు లాగి పడేశారు. ఎక్స్‌ప్రెస్ రోడ్డు (ఎన్9) రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గద్దె మీరా ప్రసాద్‌కు 214/ఏ సర్వే నంబరులో ఎకరం 14 సెంట్లు భూమి ఉంది. ముఖ్యమంత్రి బ్లాకు వెనుక వైపు ఎన్9 రహదారిని రైతు మీరా ప్రసాద్ పొలం నుంచి నిర్మించడానికి గత నెల రోజులుగా సీఆర్డీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆ భూమిలో రహదారి నిర్మాణం చేపట్టకుండా ఉన్నత న్యాయస్థానం నుంచి ఆదేశాలు తీసుకున్నాడు. తనకు తెలియకుండా రోడ్డు వేస్తారన్న భయంతో తన పొలంలోనే రాత్రనక, పగలనక మీరా ప్రసాద్ కాపలా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ప్రభుత్వాధికారులు కోర్టు ఉత్తర్వులను అతిక్రమిస్తూ రోడ్డు నిర్మించారు. రైతు ప్రసాద్‌ను ఈడ్చుకెళ్ళి ఎవరితో మాట్లాడకుండా ఫోన్లు లాక్కున్నారు. అసెంబ్లీ బందోబస్తు కోసం వచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలతో రాత్రి వేళ ఇదంతా చేశారని రైతు ప్రసాద్ వాపోయాడు. రైతుకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడటం దారుణమని వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు బోల్తా - ఇద్దరు డ్రైవర్లు మృతి

విశాలాంధ్ర - కదిరి అర్బన్ : ప్రకాశంజిల్లా కదిరి మండలంలోని కుమ్మరవాండ్లపల్లి సమీపంలో గురువారం ఆర్టీసీ కదిరి డిపోకు చెందిన బస్సు బోల్తా కొట్టిన ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఇదే జిల్లా గాండ్లపెంట మండలం ద్వారణాలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ గంగాధర్ (42) అక్కడికక్కడే మృతి చెందారు. కదిరి కుమ్మరవాండ్లపల్లి చెందిన మరో డ్రైవర్ కిషోర్‌కుమార్ (44) తీవ్రంగా గాయపడటంతో కదిరి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే కన్నుమూశారు. తీవ్రంగా గాయపడిన మరో మహిళను మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. ఒక చిన్నారి, మరో మహిళ గాయపడ్డారు. ఆర్టీసీ డ్రైవర్లు మృతిచెందడంతో కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాష, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి తదితరులు బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యానికేతన్ యాజమాన్యంపై కేసు నమోదు



విశాలాంధ్ర - తిరుపతి : డ్రస్ కోడ్ సరిగ్గా లేదన్న నెపంతో ఉద్యోగం నుంచి తొలగించారంటూ విద్యానికేతన్ అధినేత, యాజమాన్యంపై చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం రంగంపేట వద్దనున్న శ్రీ విద్యానికేతన్ విద్యా సంస్థలలో హైదరాబాద్‌కు చెందిన బ్యూలా 12వ తరగతి అధ్యాపకులుగా పనిచేస్తోంది. సెప్టెంబర్ 28 వ తేదీన కాలేజీకి వెళ్ళిన సమయంలో డ్రస్ కోడ్ సరిగ్గా లేదని కాలేజీ యాజమాన్యం మందలించడంతో అక్కడ నుంచి ఆమె వెళ్ళిపోయారు. రెండు నెలలైనా కాలేజీకి రాకపోవడంతో కళాశాల యాజమాన్యం ఆమెను సస్పెండ్ చేశారు. విషయం తెలుసుకున్న బ్యూలా నోటీసులు ఇవ్వకుండా ఎలా సస్పెండ్ చేస్తారంటూ మీడియా ఎదుట వాపోయింది. తన భర్తతో కలసి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు ఆమె ఫిర్యాదు స్వీకరించిన ఎస్.ఐ సురేష్ మొత్తం ఐదు మందిపై కేసు నమోదు చేశారు. ఈ విషయం చంద్రగిరిలో చర్చనీయాంశం అయ్యింది.



ఆశావర్కర్ల ఆందోళనలో ఉద్రిక్తత

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు రాష్ట్ర రాజధాని ప్రాంతం విజయవాడలో కనీస వేతనం కోసం పోరుబాట పట్టిన ఆశావర్కర్ల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించాలని, నెలకు కనీసం రూ.6 వేలు వేతనం ఇవ్వాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా, వేతన బకాయిలు చెల్లించడంతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ఆశా వర్కర్లకు హామీలు గుప్పిస్తున్నప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని రగిలిపోయారు. తొలుత విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్దకు వస్తూ నాలుగురోడ్ల కూడలిలో బైఠాయించారు. నడిరోడ్డుపై ఆశావర్కర్లు నినాదాలు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి గురించి గొప్పలు చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం ఆశా వర్కర్లకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. గత ఎన్నికలకు ముందు మహిళలను లక్షాధికారులను చేస్తామన్న చంద్రబాబు ఆశావర్కర్‌లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పలకరింపు, ఇంటింటి సర్వే పేరుతో తిండి తిప్పలు లేకుండా వీధివీధినా తిప్పుకుంటున్నారన్నారు. ఎండల తీవ్రతకు ఆందోళన ప్రదేశంలో 7 గురు మహిళలు స్పృహతప్పి పడిపోవడంతో పోలీసుల సహకారంతో విజయవాడ ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తరలించారు. పోలీసు అధికారుల చొరవతో అక్కడకు చేరుకున్న మెడికల్ అండ్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ శారద, ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ కమిషనర్ ప్రమీల, ఆశావర్కర్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరి యూనియన్ ప్రతినిధులతో చర్చించారు. అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 10వ తేదీలోపు జాయింట్ మీటింగ్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించడంతో ఆశావర్కర్లు ఆందోళన విరమించారు. నిరసనలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ముజఫర్ అహ్మద్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ.కమల, నాగవేణి, ఏ.శ్యామలారాణి, శ్రీలక్ష్మి, దయా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై 'అతిసార' వేటు

- గుంటూరులో ఏడుగురు ఉద్యోగులపై చర్యలు
- పబ్లిక్‌హెల్త్‌కు ఈఈ, డీఈ సరెండర్
- డీఎంఈ ఆధ్వర్యంలో విచారణ కమిటీ

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరు నగరంలో కలుషిత నీరు తాగి పది మంది ప్రజలు మృతి చెందిన ఘటనలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి కరికల వలవన్ గురువారం నగరంలోని చిన్న బజారులో తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ గురువారం ఏడుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యానికి కారణమైన ఒక ఈఈ, మరో డీఈలను ఇంజినీర్ ఇన్ చీఫ్ పబ్లిక్‌హెల్త్‌కు సరెండర్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ నియమిస్తున్నారు. దీంతో నగరపాలక సంస్థ ఉద్యోగుల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. నగరంలో కలుషిత తాగునీరు తాగడంతో డయేరియా కారణంగా నాలుగురోజుల నుంచి పదిమంది మృతిచెందారు. నగరవాసులు దాదాపు మూడువందల మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరపాలకసంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మయ్య, డీఈ బి.మధుసూదన్‌రావులను ఇంజినీర్ ఇన్ చీఫ్ పబ్లిక్‌హెల్త్‌కు సరెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అసిస్టెంట్ ఇంజినీర్లు మదన్‌మోహన్, సాయికిరణ్‌ను సస్పెండ్ చేశారు. ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు కె.సాంబశివరావు, శ్రీనులను, ఫిట్టర్ షేక్‌భాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయుబ్‌ఖాన్, భవానిబాబులను సస్పెండ్ చేస్తూ నగరపాలకసంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో విచారణ పూర్తి అయిన తర్వాత మరికొందరిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.



నల్లమలలో కారుచిచ్చు

- ఆత్మకూరు డివిజన్‌లో మంటలు
- కాలిపోతున్న విలువైన సంపద
- విలవిలలాడుతున్న మూగజీవాలు
- జీవరాశులకు పెనుముప్పు



విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : నల్లమల అడవుల్లో కారుచిచ్చు రేగుతోంది. మంటలు చుట్టుముట్టడంతో వృక్షాలు, అమూల్యమైన వనమూలికలు కాలిపోతున్నాయి. కర్నూలుజిల్లా ఆత్మకూరు డివిజన్‌లోని కొత్తపల్లె అటవీ రేంజిలో, ఆత్మకూరు - దోర్నాల రహదారి వెంబడి కొండల్లో మంటలు అంటుకుంటున్నాయి. ఎండిన ఆకులతోపాటు చిన్నచిన్న మొక్కలను దహించి వేస్తున్నాయి. వేసవి ఆరంభంలోనే కారుచిచ్చు వెలుగుచూస్తుంటే ఎండల తీవ్రత మరింత పెరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడంలేదని సమీప ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాగలూటి రేంజిలో నాగలూటి దేవాలయం, పెద్ద చెరువు ప్రాంతం, బైర్లూటి రేంజి, రుద్రకోడూరు, వెలుగోడు రేంజిలో ప్రతి సంవత్సరం అడవిలో కారుచిచ్చు సర్వసాధారణమవుతోంది. నల్లమల అభయారణ్యం ఆకు రాల్చు అడవులు. ఉగాదికి ముందు అడవుల్లో చెట్ల ఆకులు రాలిపోయి చిగురు వేస్తాయి. అభయారణ్యంలో స్మగ్లర్లు తమ అవసరాలకు కోసం మంటలు పెట్టడంతో ప్రకృతి సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గడ్డితోపాటు చిన్నచిన్న మొక్కలు బూడిదవుతున్నాయి. పక్షులు గూళ్ళు, జంతువులు ఆవాసాలు కోల్పోతున్నాయి. జంతువులు, పాములు ప్రాణాలు కోల్పోతున్నాయి. అరణ్యంలో ఎగిసిన మంటలను అదుపు చేయడం చాలా కష్టం. ఈ మంటలు మరింత వ్యాపిస్తే జంతువులకు తీవ్ర నష్టం తప్పదు.

నల్లమలకు ఎంతో ప్రాముఖ్యత

కర్నూలు జిల్లాలోని 17,658 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 3,842.65 చదరపు కిలోమీటర్ల మేర అడవులున్నాయి. నల్లమలను ప్రభుత్వం టైగర్‌ప్రాజెక్టుగా గుర్తించింది. ప్రపంచంలో అతిపెద్ద పులుల రక్షిత కేంద్రంగా గుర్తింపు ఉంది. ఇక్కడ అమూల్యమైన వనమూలికలున్నాయి. అడవిలో 50 శాతం భూభాగంలో వెదురు చెట్లు ఉన్నాయి. వెదురులో మల్లెం, సాధనం అనే రకాలు ఇక్కడ ప్రత్యేకం. ప్రభుత్వం గతంలో వేలం పాటల ద్వారా వెదురు సేకరించి విక్రయించేది. వెదురును ఇచ్చాపురంలోని సమీపంలోని కాగజ్‌నగర్ పేపరుమిల్లుకు, కర్నూలు పేపరు మిల్లులకు తరలించేవారు. టైగర్ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత వెదురు నరికివేతను ప్రభుత్వం తగ్గించడంతో నల్లమల గుబురుగా మారింది. నల్లమల గుండా పాదయాత్ర ద్వారా శ్రీశైలం వెళ్లే భక్తులు, కొందరు స్మగ్లర్లు సంచరించే సమయంలో బీడీలు తాగడం, రాత్రివేళల్లో రక్షణగా మంటలు వేయడం వలన కింద రాలిపోయిన ఆకులు అంటుకుని కారుచిచ్చుగా మారుతోంది. అడవిలో దొరికే తేనె, జిగురు, కుంకుడుకాయలు, ఇతర అటవీ ఫలసాయాలు విక్రయిస్తూ జీవిస్తున్న గిరిజనులు కారుచిచ్చులతో తీవ్రంగా నష్టపోతున్నారు. చిన్నచిన్న జీవరాశులు అంతరించిపోయే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా నల్లమలలో నక్షత్ర తాబేళ్ళు మృతి చెందక తప్పదు.

అమూల్యమైన వనమూలికలు

ఆత్మకూరు అటవీ డివిజన్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రం, గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యాలు ఉన్నాయి. శ్రీశైలం పరిసరాలలో పవన క్రిష్ణమ్మ నదికి ఇరువైపులా అమూల్యమైన వనమూలికలు లభ్యమవుతాయి. అయుర్వేద వైద్యం కోసం ఎంతోమంది వైద్యులు, సాధువులు నల్లమల అడవుల్లో సంచరిస్తూ వనమూలికలు సేకరిస్తుంటారు. రాష్ట్రప్రభుత్వం కూడా శ్రీశైలంలో 30 పడకల ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలకు ప్రమాదం ఏర్పడింది.

నిఘా నామమాత్రమే

నల్లమల అటవీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఎలాంటి అనుమతి లేకుండా అరణ్యంలోకి చొరబడుతున్న వారే తగలబెడుతున్నారు. నిరంతరం నిఘా ఉంచడం ద్వారా అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. కారుచిచ్చు వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను ప్రజలతోపాటు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించడం ఎంతో అవసరం. ప్రకృతి సంపదను భావితరాలకు అందించేలా కాపాడాలి. నల్లమల పరిసర ప్రాంత ప్రజలు, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. శాటిలైట్ ద్వారా కారుచిచ్చును గుర్తించి మంటల అదుపునకు అధునాతన విధానంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది.



భవిష్యత్‌లో అంతరిక్షమే నివాసానికి జాగా

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : భవిష్యత్తులో భూమికన్నా అంతరిక్షమే నివాసాలకు అనుకూలంగా మారబోతున్నదని నాసా ఆహ్వానం అందుకున్న విజయవాడలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ బాలికలు తెలిపారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని ఒక హోటల్‌లో నాసా ఆహ్వానం పొందిన బాలికలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు మాట్లాడుతూ స్పేస్‌లో నివాసానికి సంబంధించి ఒక్కొక్కరు ఒక్కో ప్రాజెక్టు చేసి నాసాకు పంపామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 6,500 పైగా వచ్చిన ఆహ్వానాల్లో మన నగర విద్యార్థినులు ఎంపికవ్వడం అభినందనీయ మన్నారు. మే 24వ తేదీన లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని మా ఆలోచనలను వివరించాల్సిందిగా తమకు ఆహ్వానం అందిందన్నారు సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ నాసా సదస్సుకు హాజరవుతున్న ఈ 11 మంది చిన్నారుల్లో 8 మంది దినసరి కూలీల పిల్లల న్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు కేజీబీవీలో చదువుతున్న చిన్నారి సైదాభానుకు తల్లిదండ్రులు లేరని, ఇటువంటి చిన్నారి నాసా సదస్సుకు హాజరవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. పేద పిల్లల ప్రతిభను ప్రతిఒక్కరూ గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఎన్నో అద్భుతాలు చేస్తారని వీరు నిరూపించారని అన్నారు. ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్, కేజీబీవీ స్కూల్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు, స్టేట్ సీఎంవో బి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల జోలికెళ్తే ఖబడ్దార్

- ఒక విగ్రహం కూలదోస్తే లక్ష వెలుస్తాయి
- బీజేపీ అల్లరి మూకలకు వామపక్ష నేతల హెచ్చరిక
- లెనిన్ మాస్కులు ధరించి తిరుపతిలో వినూత్న నిరసన




విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : మహనీయుల విగ్రహాలను కూలదోస్తే చూస్తూ ఊరుకోబోమని చిత్తూరు జిల్లా వామపక్షనేతలు హెచ్చరించారు. ప్రపంచంలో అత్యంత ప్రము ఖులుగా చరిత్రకెక్కిన మహాత్మాగాంధీ, లెనిన్, అంబేద్కర్, భగత్‌సింగ్, పెరియార్ విగ్రహాలను విధ్వంసం చేసే కుట్రను బీజేపీ నేతలు మానుకోకుంటే వీధుల్లో తిరగనివ్వబోమని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎ.రామానాయుడు, పుల్లయ్య స్పష్టం చేశారు. మహాత్ముల విగ్రహాలను కూల్చివేస్తున్న బీజేపీ మూకల చర్యలను నిరసిస్తూ గురువారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం నుంచి వామపక్ష నాయకులు, కార్యకర్తలు లెనిన్ మాస్కులు ధరించి తిలక్‌రోడ్, నాలుగుకాళ్ల మండపం, గాంధీరోడ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నేతల ఆగడాలను ఎండగడుతూ ప్రదర్శనకారులు చేసిన నినాదాలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి ప్రధానమంత్రి నెహ్రూనే లెనిన్ నాకు స్ఫూర్తి అంటూ కొనియాడిన ఘటనను బీజేపీ నేతలు మరచిపోయారన్నారు. లెనిన్ ప్రవేశపెట్టిన పంచవర్ష ప్రణాళికలను దేశంలో అమలు చేసిన చరిత్రను బీజేపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని దేశ ప్రజలపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తున్నారన్నారు. బీజేపీ అగ్రనాయకుల ఆదేశాలతోనే త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్, ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాలను కూలదోశారని ధ్వజమెత్తారు. భావజాలంపై కొనసాగుతున్న దాడిని దేశంలోని వామపక్ష, లౌకికశక్తులు ఐక్యతతో తిప్పికొడుతూ మతోన్మాదులకు బుద్ధిచెబుతామన్నారు. ఒక్క విగ్రహాన్ని కూలదోస్తే లక్ష విగ్రహాలు వెలుస్తాయని పునరుద్ఘాటించారు. ఒక్క కమ్యూనిస్టు కార్యకర్త నేలకొరిగితే లక్ష మంది కొత్తవారు పుట్టుకొస్తారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జె.రామచంద్రయ్య, పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాధ్, సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, కార్యవర్గసభ్యులు ఎస్.డి.రవి, శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శశికుమార్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి రామకృష్ణ, సునీల్, నాయకులు రామచంద్ర, సిహెచ్.శివ, నాగరాజు, సీపీఎం నాయకులు కందారపు మురళి, సుబ్బారావు, చంద్రశేఖర్, జయచంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోలో అభివృద్ధి

చంద్రబాబుకు కనిపించకపోవడం బాధాకరం

రాష్ట్ర మాజీ మంత్రులు కామినేని, పైడికొండల



విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కనిపించకపోవడం బాధాకరమని రాష్ట్ర మాజీ మంత్రులు, బీజేపీ నేతలు కామినేని శ్రీనివాసరావు, పైడికొండల మాణిక్యాలరావు, ఎమెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ అన్నారు. ప్రత్యేక హోదా పోరాటం ప్రకంపనల నేపథ్యంలో బీజేపీ, టీడీపీ మధ్య నిధుల వివాదంలో గురువారం మంత్రి పదవులకు రాజీనామా చేసిన కామినేని, పైడికొండలతోపాటు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గుంటూరు జిల్లా మంగళగిరి టీబీ శానిటోరియం ఆవరణలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2020 నాటికి ఎయిమ్స్ నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. నాలుగు నెలల క్రితం ఎయిమ్స్ పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టడంతో ఇప్పటికే ప్రహరీగోడ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. వచ్చే ఏడాది ఎయిమ్స్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని, 2020 నాటికి రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూనే ఉందన్నారు. ఎయిమ్స్ నిర్మాణానికి రూ.1,608 కోట్లు కేటాయించగా, తొలివిడత రూ.272 కోట్లు ఇచ్చిందన్నారు. 17 భవన నిర్మాణాల్లో ఓపీ, అత్యవసర సేవలు, వైద్యుల క్వార్టర్స్, బాలుర, బాలికల హాస్టల్స్ నిర్మిస్తామన్నారు. త్వరలోనే మరో రూ.500 కోట్లతో రెండవ విడుత పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికే దీనిపై సమగ్ర నివేదిక సిద్ధం చేశామన్నారు. ఇంత చేస్తుంటే ఎయిమ్స్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేయడంలో అర్థం లేదన్నారు. ప్రజల్లో కేంద్ర ప్రభుత్వం పట్ల నెలకొన్న అపోహలను తొలగించేందుకే తాము ఎయిమ్స్ పనుల పరిశీలనకు వచ్చామన్నారు. మెడికల్‌బోర్డు ఛైర్మన్ లక్ష్మీపతి, బీజేపీ జిల్లా అధ్యక్షులు నల్లబోతుల వెంకట్రావు, ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు జగ్గారపు శ్రీనివాసరావు, కంకణాలశివ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులను నిర్బంధించిన అన్నదాతలు

- కడపలో మార్క్‌ఫెడ్ ఆఫీసుకు తాళం
- పంట కొనుగోలులో మాయాజాలంపై ఆగ్రహం
- దళారులకు టోకెన్లమ్ముకోవడంపై నిరసన



విశాలాంధ్రబ్యూరో - కడప : కడప మార్కెట్ యార్డులో మినుములు, శనగలు, కందులు కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో అక్రమాలపై అన్నదాతలు రగిలిపోయారు. అధికారులు రైతులకు టోకెన్లు ఇవ్వకుండా దళారులకు అమ్ముకుంటున్నారంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మార్కెట్‌యార్డులో రైతులు ఆందోళన చేశారు. మార్క్‌ఫెడ్ డీఎం వచ్చే వరకూ పోరాటం కొనసాగుందని హెచ్చరించారు. ఎవరూ స్పందించకపోవడంతో కొనుగోలు కేంద్రంలోని అధికారులను లోపల పెట్టి తలుపులు వేసి నిర్బంధించారు. అయినా డీఎం రాకపోవడంతో రైతు సంఘ నేతలు జిల్లా జాయింట్ కలెక్టర్ శివారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నివేదికలు రప్పించుకుని తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరతో రైతుల నుంచి మినుములు, శనగలు, కందులు సేకరించాలన్న నిర్ణయాన్ని పాటించ కుండా మార్క్‌ఫెడ్ అధికారులు వ్యాపారులకు టోకెన్లు ఇచ్చి కొనుగోలు చేయడం దారుణ మన్నారు. టోకెన్లకు భారీ స్థాయిలో డబ్బు వసూలు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో 6 లక్షల 92 వేల క్వింటాళ్ళు పండిస్తే ప్రభుత్వం కేవలం 60 వేల క్వింటాళ్ళు మాత్రమే సేకరించాలన్న నిబంధన నేపథ్యంలో వ్యాపారులు ముందు వరుసలో ఉంటూ మోసం చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల గోడౌన్ల నుంచి తీసుకు వచ్చిన సరకునంతా అమ్ముకుని సొమ్ము చేసుకుంటే జిల్లా రైతాంగం ఎవరికి అమ్ముకోవాలని అధికారులను నిలదీ శారు. కరవు జిల్లాలో దిగుబడి తగ్గిపోయిన తరుణంలో ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధర కూడా వారికి దక్కకుండా చేస్తున్నా వారిని ఉపేక్షించకూడదన్నారు. ప్రతి రైతుకు టోకెన్లు ఎప్పటికప్పుడు తేదీ ఖరారు చేసివ్వాలన్నారు. మైదుకూరు మండలం గడ్డంవారిపల్లె గ్రామానికి చెందిన రైతులమంటూ వ్యాపారులు విక్రయిస్తూ దొరికిన నేపథ్యంలో మైదుకూరు, దువ్వూరు మండలాల వ్యవసాయ అధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి తక్షణ చర్యలు తీసుకోకపోతే రైతు సంఘం పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకుడు మేకల జయన్న పాల్గొన్నారు.

బీజేపీ దగాపై మహిళ వేషధారణతో నిరసన



విచిత్ర వేషధారణలతో ప్రజలను ఆలోచింపజేసే కర్నూలు నగర మాజీ మేయర్, టీడీపీ నాయకుడు బంగి అనంతయ్య గురువారం మహిళా వేషధారణలో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినందుకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవం నాడు రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ఎండగడుతూ మహిళ వేషంతో నిరసన వ్యక్తం చేసినట్లు అనంతయ్య వివరించారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ప్రతిఘటనతో తెలుగువారి సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

-విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు

20వ తేదీ నుంచి ఓపెన్ స్కూలు టెన్త్, ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం-అమరావతి ఆధ్వర్యాన దూర విద్యావిధానంలో (ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 30వరకూ నిర్వహిస్తారు. విద్యాపీఠం రాష్ట్ర డైరెక్టర్ ఆర్.నరసింహారావు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 20వ తేదీన ఇంటర్ తెలుగు, ఉర్దూ, హిందీ, అరబిక్ పరీక్షలు, 21న ఇంగ్లీషు, 22న జీవశాస్త్రం, అర్థశాస్త్రం, 23న చరిత్ర, 24న రాజనీతి శాస్త్రం/పౌరశాస్త్రం, చిత్రకళ, 25న రసాయన శాస్త్రం, వ్యాపార గణాంక శాస్త్రం పరీక్షలను ఏర్పాటు చేస్తారు. 26న భౌతికశాస్త్రం, భౌగోళికశాస్త్రం, 27న గణితం, గృహ విజ్ఞాన శాస్త్రం, 28న వాణిజ్య/ వ్యాపారశాస్త్రం, 29న సామాజిక శాస్త్రం, మాస్ కమ్యూనికేషన్, 30న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్, మనో విజ్ఞాన శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు.

ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల షెడ్యూలు: ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 30 వరకూ కొనసాగుతాయి. 20వ తేదీన లాంగ్వేజీస్‌లో భాగంగా మరాఠీ, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 21న భారతీయ సంస్కృతి/ వారస త్వం, 22న అర్థికశాస్త్రం, 23న గృహ విజ్ఞానం, 24న హిందీ, మనో విజ్ఞాన శాస్త్రం పరీక్షలను నిర్వహి స్తారు. ఒకేషనల్ థియరీ, 25న సాంఘిక శాస్త్రం, 26న తెలుగు, 27న ఇంగ్లీషు, 28న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, 29న గణితం, 30న ఒకేషనల్ ప్రాక్టికల్స్, బిజినెస్ స్టడీస్ పరీక్షలను ఏర్పాటు చేస్తారు.

పరీక్షా తేదీల్లో మార్పు లేదు: డైరెక్టర్ ఆర్.నరసింహారావు : ఓపెన్ స్కూలు టెన్త్, ఇంటర్ పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులేదని, ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ ఆర్.నరసింహారావు తెలిపారు. ఎంసెట్ పరీక్షలు వున్నప్పటికీ, టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూలు అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు అనువుగా స్వల్ప మార్పులు చేశామని వివరించారు. అభ్యర్థుల పూర్తి వివరాల కోసం.. 'ఏపీఓపెన్‌స్కూల్. ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను తిలకించాలని కోరారు.




మహిళా ఉపాధ్యాయులకు

బదిలీలలో ప్రాధాన్యత ఇవ్వాలి : కత్తి

విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్రంలో 40 శాతం మంది మహిళా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారికి బదిలీలలో ప్రాధాన్యం, 5 అదనపు సెలవు దినాలు ఇవ్వా లని రాయల సీమ పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. గురువారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, చంద్రన్న మాల్స్ వల్ల ఆయా ప్రాంతాల్లో సన్నకారు, మధ్యతరగతి వారికి లాభం కలిగే చర్యలు తీసుకోవాలన్నారు.

జగన్‌కు కునుకు లేదు - మంత్రి ఆనంద్‌బాబు : వైసీపీ అధినేత జగన్‌కు టీడీపీ కేంద్రమంత్రుల రాజీ నామాల నిర్ణయంతో కంటి మీద కునుకు లేదని మంత్రి ఆనంద్‌బాబు చెప్పారు. గురువారం మీడియా పాయింట్ లో ఆయన మాట్లాడుతూ, జగన్ అభద్రతా భావంతో 25 ఎంపీల రాజీ నామాలు చేసి ఇవ్వమని కోరడమే కాకుండా, నేపాల్‌కి పంపారని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ వెళ్లి కూడా ప్రధానిని , కేంద్రాన్ని కానీ ఒక్క విమర్శ చేయలేదు సరికదా దీక్షల్లో తెలుగు ప్లకార్డులను ప్రదర్శించారని విమర్శించారు.





చంద్రబాబుకు ప్రధాని మోడీ ఫోన్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడారు. తాజా రాజకీయ పరిణామాలపై సుమారు 20 నిమిషాల పాటు ఆయన చంద్రబాబుతో చర్చలు జరిపినట్లు సమాచారం. గురువారం ఉదయం రాజస్థాన్‌లో భేటీ పడావో- భేటీ బచావో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన మోడీ ఈ సాయంత్రం 4.30గంటలకు తన నివాసానికి చేరుకోగానే చంద్రబాబుకు ఫోన్‌చేసి మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. బుధ వారం సాయంత్రం 7 గంటల నుంచి ప్రధానితో మాట్లాడి తమ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని చెప్పేందుకు చంద్రబాబు ప్రయత్నించగా వీలు పడలేదు. బుధవారం మంత్రిమండలి సమావేశం, గురువారం ఉదయం రాజస్థాన్ పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం మోడీ చంద్రబాబుకు ఫోన్‌చేసి మాట్లాడినట్టుగా ప్రధాని కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న తమ ఇద్దరి మంత్రుల రాజీనామాకు దారితీసిన కారణాలను చంద్రబాబు వివరించినట్లు తెలుస్తోంది.

పోలవరం సరే.. మిగతా ప్రాజెక్టుల సంగతేమిటి!?

- జలవనరులశాఖకు రూ. 16,978 కోట్ల కేటాయింపు
- ఒక్క పోలవరం ప్రాజెక్టుకే 9వేల కోట్లు
- గాడి తప్పుతున్న ప్రాధాన్యత క్రమం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీ బడ్జెట్‌లో జలవనరులశాఖకు జరిగిన కేటాయింపుల్లో అగ్రస్థానం పోలవరం ప్రాజెక్టుకు కల్పించారు. ఈశాఖకు మొత్తం రూ. 16,978 కోట్లను ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు ప్రతిపాదించారు. ఇందులో ఒక్క పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే రూ. 9వేల కోట్లను కేటాయించారు. గత పాలకులు జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసారని విమర్శించిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి పూర్తిచేస్తామని పదేపదే చెబుతోంది. అయితే చాలా ప్రాజెక్టుల పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో మహేంద్ర తనయ, వంశధార, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజలస్రవంతి, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం, గోదావరి డెల్టా ఆధునీకరణ, చింతలపూడి ఎత్తిపోతల పథకం, కృష్ణాడెల్టా ఆధునీకరణ, నాగార్జునసాగర్ ఆధునీకరణ, వెలుగొండ ప్రాజెక్టు, సంగం ఆనకట్ట, నెల్లూరు ఆనకట్ట, సోమశిల ప్రాజెక్టు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కాల్వ, తెలుగు గంగ ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం.. ఇలా అనేక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలెప్‌మెంట్ కార్పోరేషన్ (ఏపీఎస్‌ఐడీసీ) ద్వారా అమలు చేస్తున్న అన్ని ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామన్నారు. మరోవైపు ఏపీ నీటి భద్రతపై దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఐదు ప్రధాన నదులైన వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నాలను అనుసంధానం చేస్తూ ఒక మహాసంగమాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. అయితే కేటాయించిన రూ. 16,978 కోట్లలో రూ. 9వేల కోట్లు పోలవరం నిర్మాణానికే వెచ్చిస్తే.. మిగిలిన మొత్తం పైన పేర్కొన్న ప్రాజెక్టులను ఏవిధంగా పూర్తి చేస్తారో అర్థం కాని పరిస్థితి.

ప్రాధాన్యత క్రమం గాడితప్పుతోందన్న విమర్శలు ఈ రంగానికి చెందిన నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా మెరుగైన నీటి నిర్వహణ పద్ధతులను చేపట్టడం ద్వారా రాష్ట్రాన్ని కరవు నిర్మూలన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

గత 2017-18 బడ్జెట్‌లో రూ. 12,770లను కేటాయించగా, ఈ ఏడాది 33 శాతం వృద్ధిరేటుతో రూ. 16,978 కోట్లను ప్రతిపాదించినట్లు మంత్రి యనమల పేర్కొన్నారు.

ముఖ్యమైన ప్రాజెక్టులకు కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి.

- ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టుకు రూ. 547.70 కోట్లు
- తుంగభద్ర బోర్డు రూ. 270.32 కోట్లు
- కృష్ణాబేసిన్‌కు రూ. 59 కోట్లు
- పోలవరం ప్రాజెక్టు రూ. 9,000కోట్లు
- గోదావరి డెల్టా వ్యవస్థకు రూ. 575.17 కోట్లు
- కృష్ణా డెల్టా వ్యవస్థకు రూ. 340 కోట్లు
- మొత్తం నీటిపారుదల ప్రాజెక్టులు, కడప రూ. 554.62 కోట్లు
- మొత్తం నీటిపారుదల ప్రాజెక్టులు, ఉత్తరకోస్తా జిల్లాలు రూ. 616.76 కోట్లు
- మొత్తం నీటిపారుదల ప్రాజెక్టులు, ఒంగోలు రూ. 616.64 కోట్లు
- మొత్తం నీటిపారుదల ప్రాజెక్టులు, అనంతపురం రూ. 664.07 కోట్లు
- మొత్తం నీటిపారుదల ప్రాజెక్టులు, కర్నూలు రూ. 289.22 కోట్లు

రవాణా, ఆర్ అండ్‌బీకి నామమాత్రపు పెరుగుదల

● రూ. 4,703 కోట్ల కేటాయింపు ● గతేడాదితో పోలిస్తే 13 శాతం వృద్ధి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రవాణా, రహదారులు-భవనాలశాఖకు బడ్జెట్‌లో రూ. 4,703 కోట్లను కేటాయించారు. గత ఏడాది రూ. 4,042 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది 16 శాతం వృద్ధిని చూపుతూ నామ మాత్రంగానే బడ్జెట్ కేటాయింపులు చేసింది. ముఖ్యంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలను ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసే క్రమంలో మరింత అభివృద్ధి చేసేందుకు రహదారి నెట్‌వర్క్‌ను నవీకరిస్తున్నట్లు మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. వివిధ కార్యకలాపాల ద్వారా నిరంతరం రహదారుల నాణ్యతను మెరుగుపరుస్తామన్నారు. ఇప్పటి వరకూ రహదారులతో అనుసంధానం కాని గ్రామాలను ఈ ఏడాది లక్ష్యంగా ప్రభుత్వం ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలకు బస్సులను నడిపేందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ)కి రూ. 200 కోట్లను గ్రాంట్‌గా మంజూరు చేసింది. ఈమొత్తంతో బస్సులను కొనుగోలు చేసి గ్రామీణ ప్రాంతాలకు తెలుగు-వెలుగు (పల్లె-వెలుగు) పేరుతో బస్సులను నడపనుంది. అలాగే వివిధ వర్గాలకు ఆర్టీసీ నుంచి కల్పిస్తున్న రాయితీలను భర్తీ చేసే క్రమంలో రూ. 290 కోట్లను కేటాయించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలెప్‌మెంట్ కార్పోరేషన్ (ఏపీఆర్‌డీసీ)కి రూ. 240 కోట్లు కేటాయించింది. ఇంకా రైల్వేశాఖతో కలసి 50:50 శాతం భాగస్వామ్యంతో నిర్మించే నూతన రైలు మార్గాల కోసం కూ. 100 కోట్లు, జిల్లాతోపాటు ఇతర రహదారుల నిర్మాణానికి రూ. 486.69 కోట్లు, మేజర్ జిల్లా రహదారుల కోసం రూ. 341 కోట్లు, ఏపీఆర్‌డీసీ ఆధ్వర్యంలో నిర్మించే రాష్ట్ర హైవేలకు రూ. 250 కోట్లు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి రూ. 200 కోట్లు కేటాయించింది.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు మొండి చేయి

గతంలో రూ. 350 కోట్లు, ప్రస్తుతం రూ.42 కోట్లు



విశాలాంధ్ర - భట్టిప్రోలు : అధికారం చేజిక్కించుకునే వరకు మీరు పడుతున్న కష్టాలను చూస్తుంటే కడుపు తరుక్కు పోతుంది. మీ బాధలు వింటుంటే కంట నీరోస్తోంది అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు మొండి చేయి చూపారు. టీడీపీ అధికారంలోకి వస్తే పెద్ద కొడుకునై చేనేతకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి ఏటా రూ.1000 కోట్లు కేటాయించడంతోపాటు మరో వేయ్యి కోట్లతో మూలధనం ఏర్పాటు చేస్తానంటూ నేతన్నలను నమ్మించి అధికారంలోకి వచ్చిన సీఎం మరో సారి చేనేత కార్మికులను మోసం చేశారు. గురువారం ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి కేవలం 42 కోట్లు మాత్రమే కేటాయించి తీరని ద్రోహం చేశారు. నూతన జౌళి విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి చేనేత కార్మికుల సమస్యలు తీవ్రం అయ్యాయి. కుటుంబమంతా పనిచేసినా చేనేత కార్మికుల ఆకలి తీరడంలేదు. పోగు పోగు చూసి చూపు మందగిస్తుంది. 45 ఏళ్లకే నడుము వంగిపోయితుంది. అర్ధ గుంటలో అర్ధనగ్నంతో 12 గంటల పాటు శ్రమపడుతున్న నేత కార్మికుడి ఆదాయం రోజుకు 100 రూపాయలకు మించి రావడంలేదనడంలో ఏలాంటి సందేహం లేదు. దీంతో వృతినే నమ్ముకున్న నేతన్న కుటుంబం దారిద్ర్యంలో మునిగింది. భారతదేశంలో వ్యవసాయం తార్వత ఎక్కువమందికి ఉపాధి చూపుతున్న చేనేత రంగాన్ని రక్షించాల్సిన పాలకులు రానురాను బడ్జెట్ కెటాయింపులో కోతలు కోస్తున్నారు. పుష్కర కాలం క్రితం రూ. 350 కోట్లగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ నేడు 42 కోట్లకు పడిపోయింది.2016-17 రాష్ట్ర బడ్జెట్ నేడు 99.87 కోట్ల కేటాయించగా, 2017-18 బడ్జెట్‌లో రూ. 121.06 కోట్లు కేటాయించి, రూ. 62.70కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2018-19 బడ్జెట్‌లో రూ. 42 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని చూస్తే చేనేత రంగాన్ని నాశనం చేసేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారన్నది స్పష్టమవుతోంది. చేనేత ఎగుమతుల ద్వారా కోట్లాది రూపాయిల విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చిపెడుతున్న ఈ పరిశ్రమ పట్ల పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కార్మికులకు శాపంలా మారుతున్నాయి. నూలు సబ్సీడి ఉంటుందన్న ఆర్థిక మంత్రి నిధులు కేటాయింపులు జరపలేదు. జనతా వస్త్రాల పునరుద్ధరణకు రూ. 200 కోట్లు కేటాయించామని ఆర్థిక మంత్రి ప్రకటించడం దూడకు మేత వేసి మూతికి చిక్కం కట్టినట్లు ఉంది. జనతా వస్త్రాలు కొనుగోలు చేసే వినియోగ దారులు నేడు లేరు. ఆ వస్త్రం తయారు చేయాలంటే కార్మికునికి కూలీ గిట్టుబాటు కాని పరిస్థితి. చేనేతను జౌళీ శాఖ నుంచి వేరు చేసి రెండు శాఖలుగా ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని చేనేత కార్మిక సంఘాల నేతలు. కార్మికులు ఏళ్ళతరబడి చేస్తున్న విజ్ఞప్తులు పాలకుల చెవికి సోకక పోవడం బాధాకరం. చేనేత పరిశ్రమ రక్షణకు కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుకు చేనేత ఉత్పత్తులకు రిజర్వేషన్ యాక్టు అమలు చేయాలని ఐక్యంగా ఉద్యమించడం తప్ప మరో మార్గం లేదు.

బడ్జెట్‌పై భిన్నస్వరాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర చరిత్రలో తొలిసారి అత్యధికంగా లక్షా 91 వేల కోట్లతో ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఒకప్రక్క అప్పులు, మరోప్రక్క రెవిన్యూలోటుతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని చెబుతూనే గత ఏడాదికంటే దాదాపు 22శాతం పెంచి ఆడంబర బడ్జెట్ ప్రవేశపెట్టడమంటే ప్రజలను మోసగించడమేనని వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా విమర్శించారు.


బడాయి బడ్జెట్ -సీపీఐ రామకృష్ణ



గత ఏడాది కంటే 21.69 శాతం అధికంగా ఆర్థిక మంత్రి యనమల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ బడాయి బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు.గత ఏడాది రూ.లక్షన్నర కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి, ఖర్చు చేసే సమయంలో కోతలు విధించినట్టే...ఇప్పుడూ రూ.1.91లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రజల ముందు ఉంచారన్నారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమం పేరిట భారీ కేటాయింపులు చూపించారని, కానీ ఖర్చు చేసేందుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో వివరించలేదన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పద్దులు రాశారని ఎద్దేవా చేశారు. రైతుల రుణమాఫీకి కేవలం రూ.4100 కోట్లు కేటాయించారని, అంటే రైతుల రుణాలు ఈ ఏడాదీ తీరవని స్పష్టమవుతోందన్నారు. కేవలం రూ.1000 కోట్లు కేటాయించి డ్వాక్రా మహిళలను మళ్లీ దగా చేశారని విమర్శించారు. సాగునీటి రంగానికి రూ.16వేల కోట్లు కేటాయించినట్టు గొప్పలు పోతున్నారని, కానీ ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చూస్తే వచ్చే పదేళ్లల్లోనూ పూర్తికాని పరిస్థితి కనిపిస్తోందన్నారు. గ్రామీణాభివృద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించారని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామంటూనే కేటాయింపుల్లో అరకొరగా విదిల్చారన్నారు. మొత్తం మీద ఆర్థిక వనరుల సమీకరణపై ఏమాత్రం స్పష్టత లేదన్నారు. పేరుకు భారీ కేటాయింపులు జరిపి, ఖర్చు సమయంలో కోత విధించటమే యనమల బడ్జెట్ సారాంశమని రామకృష్ణ పేర్కొన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి భరోసా ఇవ్వలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరుద్యోగ భృతికి రూ.1000 కోట్లు కేటాయింపులు చూపినప్పటికీ, దీనికి సంబంధించిన విధివిధానాలను రూపొందించలేదన్నారు. ఎవరికి ఇస్తారో, ఎంత ఇస్తారో, అసలు ప్రభుత్వం దగ్గర నిరుద్యోగుల డేటా ఉందా? లేదా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర ఖచ్చితమైన సమాధానం లేదన్నారు. ఈ కేటాయింపులు నిరుద్యోగ భృతి పేరిట యువతను వంచించటమేనన్నారు. వ్యవసాయరంగానికి పెద్ద పీట వేసినట్టు చెప్పారేగాని, స్వాతంత్ర్యానంతరం వ్యవసాయరంగాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన కోపరేటివ్ సెక్టార్ ప్రస్తావనే ఈ బడ్జెట్‌లో లేదన్నారు. కేటాయింపుల పరంగా చూస్తే ఈ బడ్జెట్ అంచనాలు ఘనం, ఆచరణ శూన్యంగా ఉంటుందనేది స్పష్టమవుతోందన్నారు.

ప్రజల్ని మభ్యపుచ్చే బడ్జెట్ : సీపీఎం మధు



గతంలో ఎన్నడూలేని విధంగా రూ.1.91 లక్షల కోట్ల బడ్జెట్లో 50వేల కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద చూపించడమే రాష్ట్ర అత్యాశను వెల్లడిస్తోందని. ఇది ముమ్మాటికే ప్రజల్ని మభ్యపుచ్చే బడ్జెట్టు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. పది లక్షలు ఇళ్ళు కట్టిస్తామని రూ.24వేల కోట్లకుగాను రూ.రూ,3,679 కోట్లు మాత్రమే కేటాయించారని, రుణమాఫీకి రూ.4,100 కోట్లు, పేదల ఇళ్ళస్థలాలు సేకరణకు రూ.575 కోట్లు మాత్రమే కేటాయించడం ఏవిధంగా సమంజసమని ప్రశ్నించారు. సంక్షేమం పేరు చెబుతూనే గత బడ్జెట్ కేటాయింపుల కంటే భారీగా కోతలు పెట్టారని విమర్శించారు. డ్వాక్రా గ్రూపుల రుణమాఫీ కోసం రూ.2,400 కోట్లు అవసరం కాగా రూ.1460 మాత్రమే కేటాయించారని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గురించి కనీసం ప్రస్తావన లేకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడిచేస్తుందన్నారు.


ఆడంబర బడ్జెట్ : వైసీపీ

గత బడ్జెట్ మాదిరిగానే ఇది కూడా ఆడంబర బడ్జెట్ తప్ప ఆచరణాత్మక బడ్జెట్‌గా లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు విమర్శించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో వుందని చెబుతూనే మర్రోక్క స్థూల ఉత్పత్తి బ్రహ్మాండంగా వుందని చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత కేంద్ర




ప్రభుత్వానిదైతే దానికోసం రూ.9వేల కోట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో 90వేల కోట్లు అప్పు వుంటే, ఇప్పుడది రూ.2లక్షల కోట్లకు చేరిందని, ఇప్పుడు వడ్డీయే 15 వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈపరిస్థితుల్లో ఇంత ఆడంబరం అవసరమా ? అని ప్రశ్నించారు. రెవిన్యూలోటులోనూ, కేటాయింపుల్లోనూ స్పష్టత లేదని, లెక్కలన్నీ తప్పుడు తడకలుగానే వున్నాయని ఆయన విమర్శించారు.

ప్రజల అకాంక్షలు ప్రతిబింబించేలా లేదు : బీజేపీ



రాష్ట్ర బడ్జెట్ ప్రజల అకాంక్షలు ప్రతిబింబేంచేలా లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ విమర్శించారు బయట నుంచి చూసేవారికి ఈ బడ్జెట్ ధనిక రాష్ట్రంగా కనిపిస్తుందన్నారు. ఈ బడ్జెట్‌లో కీలక రంగాలకు మొక్కుబడి కేటాయింపులు జరిపినట్లు విమర్శించారు. కులాల వారీగా కేటాయింపులు జరిపిన ఎన్నికల బడ్జెట్‌గా అభిప్రాయపడ్డారు. అత్యంత ప్రాధాన్యం కలిగిన నీటిపారుదల రంగానికి కేవలం రూ 16,978 కోట్లు మాత్రమే కేటాయించారని, వీటిలో పోలవరానికి రూ 9,000 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు గత నాలుగేళ్లలో కేవలం రూ 8000 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఒక్క ఏడాదిలో రూ 9000 కోట్లు ఎలా ఖర్చుచేస్తుందని ప్రశ్నించారు. సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయ రంగానికి రూ 12,355 కోట్లు కేటాయించి రైతుల ఆదాయం ఏ రకంగా రెట్టింపు చేస్తారో వివరించాలన్నారు.

అంకెలగారడీని తలపిస్తోంది- కాంగ్రెస్



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీని తలపిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలను కొండ శివాజీ విమర్శించారు. గత ఏడాది బడ్జెట్ కేటాయిం పుల్లో పూర్తిగా నిధులు ఖర్చు చేయలేని ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్‌ను మరింత పెంచుతూ రూ.2 లక్షల కోట్లకు చేరువగా వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రాభి .వృద్ధికి కీలక రంగాలైన వ్యవసాయం, నీటిపారుదల రంగాలకు మొక్కుబడిగా కేటాయింపులు జరిపారని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.9వేల కోట్లు పోతే మిగతా ప్రాజెక్టుల మాటేమిటి? ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా గ్రామాల్లో సైతం రక్షిత మంచినీటిని అందిస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం ఆ దిశగా చేస్తున్నదేమీ లేదు. గ్రామాలలో కలుషిత నీటిని తాగి అనేకమంది కిడ్నీ సంబంధిత, ఇతర జీర్ణకోశ వ్యాధులతో సతమతమవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విషయం బడ్జెట్‌లో తేటతెల్లమైందన్నారు.

పేదలకు ఆదరణ లేని బడ్జెట్ - వ్యవసాయకార్మికసంఘం

రాష్ట్ర బడ్జెట్ ఆడంబరంగా వుందే తప్ప పేదవర్గాలను ఏమాత్రం ఆదరించేదిగా లేదని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అవుల శేఖర్, జల్లి విల్సన్‌లు విమర్శించారు. పక్కా గృహాల నిర్మాణానికి, నివేశనా స్థలాల సేకరణకు, ఎన్టీఆర్ పెన్షన్ స్కీం, ఎన్టీఆర్ జలసిరి, చేతివృత్తిదారులు, కరవు నివారణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఈబడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులను ఇతర రంగాలు వినియోగించడానికి రాష్ట్ర ప్రభుత్వం యత్నించడం దారుణమన్నారు. ఇది కార్మికులు, ఉపాధి వేతనదారులకి మొండిచేయి చూపే ప్రయత్నమేనని వారు విమర్శించారు.

కార్మికులను విస్మరించిన బడ్జెట్-ఎఐటీయూసీ ఓబులేసు



రాష్ట్ర బడ్జెట్ కార్మికులు, కష్టజీవులను పూర్తిగా విస్మరించేలా వుందని ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. కార్మిక ఉపాధి కల్పనకు కేవలం రూ.900 కోట్లు, చేనేత, మత్స్యకారులు తదితర రంగాలకు నామ మాత్రపు విదిలింపులు చేసి, ఎన్నికల బడ్జెట్ అనిపించు కుంది. ఓట్ల కోసం, సీట్ల కోసం ఆరాటపడుతున్నట్లుగా కనిపించింది. అందుకోసమే చంద్రన్న పెళ్ళికానుకలు, ఇతర వర్గాలకు దగ్గరకు చేర్చుకోవడానికి వివిధ కార్పో రేషన్‌లకు నిధులు కేటాయింపులు చేశారని పేర్కొన్నారు.


దాదాపు 58శాతం జనాభా వున్నటువంటి బీసీ కార్పో రేషన్‌కు మాత్రం 600 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. వ్యవసాయ, కార్మిక, ఉపాధి కల్పన పట్ల పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించారని విమర్శించారు. కేవలం 10 నెలల కాలంలోనే 21శాతం పెరుగుదల ఎలా సాధ్యమైందో, ఇంత రెవిన్యూ ఎలా వస్తుందనేది స్పష్టత ఇవ్వకపోవడం చూస్తుంటే సమస్యకు మసిపూసి మారేడుకాయ చేసేనట్లు వుందని ఎద్దేవా చేశారు.

ఏపీ టెట్ ప్రాథమిక 'కీ'పై

16వేల అభ్యంతరాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు చెందిన ప్రాథమిక కీపై 16వేల వరకూ అభ్యంతరాలు వచ్చాయి. ఈ నెల 9వ తేదీ వరకూ ప్రాథమిక కీపై అభ్యంతరాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం స్వీకరించనుంది. పేపర్-1 ప్రశ్న లు, వాటి జవాబులపై 9,867, పేపర్-2కు 4,162, పేపర్-3కు 1,858 అభ్యంతరాలు వచ్చాయి. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి 2 వరకూ టెట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఆన్ లైన్లో నిర్వహించిన విషయం విదితమే. ఈ పరీక్షల ప్రశ్నాపత్రాల షెట్లు, జవాబులను విద్యా శాఖ కమిషనర్ కార్యాలయంలో అందు బాటులో వుంచారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించగా అత్యధికంగా పేపర్-1పై వచ్చాయి. టెట్ తుది కీ విడుదలకు ఏపీ టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి చర్యలు చేపట్టారు. ఈ నెల 16వ తేదీన టెట్ ఫలితాలను విడుదల చేస్తారు.

హోదాకోసం వైసీపీ కట్టుబడి ఉంది : జగన్




విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : ప్రత్యేక హోదా కోసం వైసీపీ ఇప్పటికీ కట్టుబడి ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఏ రాజకీయ పార్టీ ఇస్తుందో ముందుగానే చెప్పి సంతకం పెడితే ఆ పార్టీకి వైసీపీ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చరిత్ర హీనుడిగా మిగిలిపోకుండా ఉండాలంటే ఈనెల 21న తాము ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చి తీరాలని పిలుపునిచ్చారు. ఆయన కోరితే ముందుగానే అవిశ్వాస తీర్మానం పెట్టడానికి తాము సిద్ధమని, ఒకవేళ చంద్రబాబే అవి శ్వాసం పెట్టేందుకు ముందుకు వచ్చినా మద్దతు ఇచ్చి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు. 21న ఆవిశ్వాసం పెట్టాలని నిర్ణయించుకుంది చంద్రబాబుకు గడువిచ్చేందుకేనని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదాపై గురువారం సాయంత్రం అరుణ్ జైట్లీ ఇచ్చిన ప్రకటన, దానిపై చంద్రబాబు ప్రకటన నేపథ్యంలో ప్రస్తుతం పర్చూరు నియోజకర్గం సంతరావూరులో ప్రజా సంకల్పయాత్రలో ఉన్న జగన్ గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జరిగిన పరిణామాలన్నింటిని పరిశీలిస్తే అరుణ్‌జైట్లీ ప్రకటన కొత్తేమీ కాదన్నారు. సెప్టెంబరు 2016, 8వ తేదీన ఇదే మాటలు మాట్లాడారన్నారు. అప్పుడు అర్ధరాత్రి జైట్లీ ఇవే మాటలు చెబితే చంద్రబాబు స్వాగతించారని, ఇప్పుడు చంద్రబాబు యూ టర్న్ తీసుకొని తన మంత్రులను కేంద్ర క్యాబినేట్ మంత్రి వర్గం నుండి రాజీనామాలు చేయించినట్లు చెబుతున్నారని అన్నారు. నాలుగు సంవత్సరాల నుండి ప్రత్యేక హోదాపై స్పందించని ముఖ్యమంత్రి నేడు ప్రత్యేక హోదాకోసం తమ మంత్రులను రాజీనామాలు చేయించి కొత్త నాటకానికి తెరతీశారని అన్నారు. ఇంకా చంద్రబాబు ఎన్‌డీఏ కన్వీనర్‌గా కొనసాగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తమ పోరాటంలోకి కలిసి రావాలని సూచించారు. విలేకర్ల సమావేశంలో వైసీపీ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శకునిలా జగన్ తీరు : సోమిరెడ్డి ఫైర్

విశాలాంధ్ర అమరావతి : వైసీపీ అధినేత జగన్, ప్రతిపక్ష పాత్ర పోషించకుండా శకునిలా వ్యవహరిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశాన్ని పాలించే కూటములకు నేతృత్వం వహించే సత్తా ఉన్న సీఎం చంద్రబాబును పోరాటం స్పెల్లింగ్ కూడా తెలియని జగన్ తనతో కలిసి రావాలని పిలవడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ జై కొట్టి జగన్ హోదా ఇస్తేనే మద్దతిస్తామని అపుడు ఎందుకు చెప్పలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒకే ఒక్క క్షణంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్న తమ ఇద్దరు మంత్రులు రాజీనామాలు చేశారన్నారు. 14వ ఆర్థిక సంఘాన్ని బూచిగా చూపెడుతూ, ఏపీకి ప్రత్యేక హెూదా ఇవ్వడం సాధ్యం కాదని బీజేపీ పెద్దలు చెపడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశాన్ని పరిపాలిస్తోంది 14వ ఆర్థిక సంఘమా,ప్రధాని మోడీయా అని మంత్రి సోమిరెడ్డి ప్రశ్నించారు. 2018-19 బడ్జెట్ లోనూ ఏపీకి మొండిచేయి చూపడంతో పోరాటబాట పట్టామన్నారు. కేంద్రానికి తాము మిత్రపక్షమైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని మంత్రి సోమిరెడ్డి తెలిపారు.

పోలీసులకు సమ్మర్ టోపీలు



విశాలాంధ్ర - అమరావతి : ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగు తున్న నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ జిల్లాలనుంచి రాజధానికి వచ్చి విధులు నిర్వహిస్తున్న పోలీ సులకు గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ అప్పల నాయుడు వేసవి ఎండల నుంచి తట్టుకునేందుకు సమ్మర్ టోపీలను, కూలింగ్ గ్లాసులను అందించారు. 500 మందికి బుధవారం వీటినీ పంపిణీ చేశారు. మిగిలిన సిబ్బందికి రెండు మూడు రోజుల్లో ఇవ్వనున్నారు. 17 రోజులపాటు జరిగే అసెంబ్లీ సమావేశాలకు బందోబస్తు కోసం సుమారు 1200 మంది పోలీసులు వచ్చారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి వెలగపూడి సచివాలయం వరకు, అంతేకాకుండా మంగళగిరి ,తాడికొండ, అమరావతిలతోపాటు, వివిధ చెక్‌పోస్టుల వద్ద అనునిత్యం మండుటెండలో డ్యూటీలు నిర్వహిస్తున్నారు. దానికి తోడు వేసవి కావడంతో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పోలీసులు రోగాల బారిన పడుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ దృష్టి పెట్టుకుని ఎస్పీ వారికి సమ్మర్ టోపీలను అందజేశారు.

కోహ్లిని... ధోనీనే వద్దన్నాడు..?



బీసీసీఐ మాజీ సెలెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్

ముంబై : ఇప్పుడంటే మహేంద్ర సింగ్ ధోనీ-విరాట్ కోహ్లి మంచి స్నేహితులు. ధోనీ నుంచే కెప్టెన్సీ అందుకున్న కోహ్లి అతని సలహాలు, సూచనలు తీసుకుంటూనే జట్టును నడిపిస్తున్నాడు. కానీ, ఒకప్పుడు విరాట్ కోహ్లిని జట్టులోకి తీసుకుందాం అంటే ధోనీ ససేమిరా అన్నాడట. 'కోహ్లిని తీసుకుందాం' అన్నందుకు వెంగ్‌సర్కార్‌ని బీసీసీఐ కోశాధికారిగా ఉన్న శ్రీనివాసన్ సెలక్టర్ పదవి నుంచి ముందుగానే తప్పించాడట. ఈ విషయాలన్నింటినీ బీసీసీఐ మాజీ సెలక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్ స్వయంగా తెలిపారు. ముంబైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న వెంగ్‌సర్కార్... '2008లో టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లాల్సి ఉంది. అండర్-23లో ఆడే ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించుకుంది. అదే ఏడాది కోహ్లి నాయకత్వంలోని అండర్-19 భారత జట్టు ప్రపంచకప్ గెలిచింది. ఆ తర్వాత ఇండియా-ఎ తరపున బ్రిస్బేన్‌లో జరిగిన ఓ మ్యాచ్‌లో కోహ్లి 123 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ చూసిన నేను అతనికి లంక పర్యటనకు వెళ్లే భారత జట్టులో స్థానం కల్పించాలనుకున్నా. నా నిర్ణయాన్ని సహ సెలక్టర్ల ముందు ఉంచా. వారంతా అంగీకరించారు. అప్పుడు కోచ్‌గా ఉన్న గ్యారీ కిర్‌స్టన్, కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మాత్రం ఒప్పుకోలేదు. నేను కోహ్లి ఆట తీరు చూశాను. అందుకే జట్టులో స్థానం ఇవ్వాలనుకుంటున్నట్లు చెప్పాను. కానీ, వారు ససేమిరా అన్నారు. వారు ఎందుకు ఒప్పుకోవడం లేదో నాకు తెలుసు. కోహ్లికి జట్టులో చోటు ఇస్తే చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు బద్రీనాథ్‌పై వేటు పడుతుందేమోనని వారి భయం' అని వివరించాడు దిలీప్. 'అంతేకాదు అప్పుడు బీసీసీఐ కోశాధికారిగా పని చేస్తున్న శ్రీనివాసన్‌కు నా నిర్ణయం నచ్చలేదు. ఎందుకంటే చెన్నై అతని రాష్ట్ర జట్టే కదా! ఆ తర్వాత బద్రీనాథ్‌పై ఎందుకు వేటు వేయాలనుకుంటున్నావ్ అని శ్రీ వచ్చి నన్ను అడిగాడు. ఆస్ట్రేలియా పర్యటనలో విరాట్ ప్రదర్శన చూశాను. అందుకే తీసుకోవాలని అనుకుంటున్నాను అని చెప్పా. అంతకు ముందు జరిగిన ఓ టోర్నీలో తమిళనాడు తరపున బరిలోకి దిగిన బద్రీనాథ్ 800 పరుగులు చేశాడు. మరి అతనికి ఎందుకు స్థానం ఇవ్వకూడదు అని నాతో వాదించాడు. తర్వాత ఛాన్స్ ఇస్తానన్నా. 'ఇంకా ఎప్పుడు ఛాన్స్ ఇస్తావు? ఇప్పటికే అతడి వయస్సు 29' అన్నాడు. ఎప్పుడిస్తానో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేను. కానీ తప్పకుండా బద్రీనాథ్‌కు అవకాశం మాత్రం ఇస్తా అని బదులిచ్చాం. ఏమైందో ఏమో తెలియదు. ఆ మరుసటి రోజే శ్రీకాంత్‌ను తీసుకొచ్చి సెలక్టర్‌గా నియమించి నా కాల పరిమితి ముగిసిందని చెప్పారు' అని నాటి సంఘటనను గుర్తు చేసుకున్నాడు దిలీప్ వెంగ్‌సర్కార్.



షమీ.. ఆత్మహత్మకు యత్నంచాడు : జహాన్

న్యూఢిల్లీ : టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ గతంలో ఒకసారి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడని తెలిపింది ఆమె భార్య హసీన్ జహాన్. అతడు మోసగడాని, పలువురు మహిళలతో సంబంధాలున్నాయని, తనపై గృహ హింసకు పాల్పడుతున్నాడని తెలిపిన ఆమె బుధవారం సాయంత్రం కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో షమీ బీసీసీఐ కాంట్రాక్టును కోల్పోవాల్సి వచ్చింది. తాజాగా ఆమె మాట్లాడుతూ..'మేమిద్దరం 2012లో తొలిసారి కలుసుకున్నాం. అంతకుముందు షమీ తన సమీప బంధువుల్లో ఒక అమ్మాయిని ఐదు సంవత్సరాల పాటు ప్రేమించాడు. పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నాడు. కానీ, ఆ అమ్మాయి కుటుంబసభ్యులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఆత్మహత్యకు యత్నించాడు' అని తెలిపింది హసీన్. 'షమీ కోసం నేను అన్ని చేశా. నా మోడలింగ్ కెరీర్, ఉద్యోగం వదులుకున్నా. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచి నన్ను వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆస్తులు, బీమాకు సంబంధించిన పత్రాలను తీసుకున్నాడు. రెండేళ్ల నుంచి విడాకులు ఇవ్వాలని కోరుతూనే ఉన్నాడు. కానీ, నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ విడాకులు ఇవ్వను. షమిపై నేను చేస్తున్న ఆరోపణలన్నింటికీ నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. త్వరలోనే అతన్ని కోర్టుకు ఈడుస్తా' అని హసీన్ స్పష్టం చేసింది.

ఆర్‌ఆర్ మ్యాచులన్నీ జైపూర్‌లోనే..!

న్యూఢిల్లీ : రెండేళ్ల నిషేధాన్ని ఎదుర్కొని ఈ ఏడాది తిరిగి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన జట్లలో ఒకటి రాజస్థాన్ రాయల్స్. నిన్నమొన్నటి వరకు సొంత గడ్డపై ఆడే మ్యాచులను రాజస్థాన్ రాయల్స్ ఎక్కడ ఆడుతుందా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. తాజాగా ఆ ఫ్రాంఛైజీ జైపూర్‌లోని సవాయ్‌మన్‌సింగ్ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించేలా ఒప్పందం కుదుర్చుకుంది. మార్చి 5 నాటికి రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్(ఆర్‌సీఏ) మైదానాన్ని సిద్ధం చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్నపనులు పూర్తి చేయాలని బీసీసీఐ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అసోసియేషన్ అధ్యక్షుడు సీపీ జోషి, చైర్మన్ రంజిత్ ఆ పనిలో నిమగ్నమయ్యారు. తాజాగా పనులన్నింటినీ క్లియర్ చేయడంతో రాజస్థాన్ క్రీడల మంత్రి ఆధ్వర్యంలో ఆర్‌సీఏ ఒప్పందం చేసుకుంది. ఈ ఏడాది రాజస్థాన్ సొంతగడ్డపై ఏడు మ్యాచ్‌లను ఆడనుంది. ఈ సందర్భంగా ఆర్‌సీఏ నిర్వాహకులు మాట్లాడుతూ..'ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చేందుకు మరోసారి సవాయ్ మన్‌సింగ్ మైదానం పూర్తి స్థాయిలో సిద్ధమైంది. ఇక ఎలాంటి పెండింగ్ పనులు లేవు. జైపూర్ ప్రజలకు ఇదో కానుక. ఇక నుంచి రాష్ట్రంలో క్రికెట్‌ను అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో పని చేస్తాం'అని తెలిపారు.



ధావన్ మెరిసెన్



- అర్ధసెంచరీ చేసిన శిఖర్
- 6వికెట్ల తేడాతో భారత్ గెలుపు
- మూడు వికెట్లు తీసిన జయదేవ్ ఉనాద్కట్
- రాణించిన విజయశంకర్
- ముక్కోణపు సిరీస్‌లో భారత్‌కు తొలివిజయం

కొలంబో : నిదాహాస్ హీరో ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ప్రేమదాస స్టేడియంలో భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య రెండో టీ20 గురువారం జరిగింది. నిర్ణీత 20 ఓవర్లలో బంగ్లాదేశ్ 8 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసింది. జయదేవ్ ఉనాద్కట్‌కు 3 వికెట్లు దక్కగా, విజయ్‌శంకర్‌కు 2, చాహల్‌కు ఒకటి, శార్దూల్ ఠాకూర్‌కు ఒక వికెట్ దక్కింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్ నాలుగు వికెట్లు కోల్పోయి ఆరు వికెట్లతో విజయాన్ని సునాయాసంగా అందుకుంది. దీంతో భారత్‌కు ఊరట విజయం లభించింది. అంతకుముందు టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ చేయాలని బంగ్లాదేశ్‌ను కోరింది. మొదటి 5 ఓవర్ల పవర్ ప్లేలో బంగ్లాదేశ్ బాగానే రాణించింది. అయితే భారత్ ఫీల్డింగ్‌లో లోపాలు బంగ్లాదేశ్‌కు వరమయ్యాయి. ఎనిమిది ఓవర్లలోపే బంగ్లా బ్యాట్స్‌మెన్ ఇచ్చిన మూడు క్యాచ్‌లను ఫీల్డర్లు చేజార్చారు. అయినా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు విసరడంతో వారు పరుగులు రాబట్టడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తొలి ఐదు ఓవర్లకే ఓపెనర్లు పెవిలియన్ బాట పట్టగా, నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్‌ను 18(14బంతుల్లో, 2×4, 1×6) విజయ్ శంకర్ ఔట్ చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ మహ్మదుల్లా 1(8) కూడా విజయ్ శంకర్ చేతికే చిక్కి తక్కువ పరుగులకే ఔట్ అయ్యాడు. బంగ్లా బ్యాట్స్‌మెన్‌లో లింటన్ దాస్ 34, షబ్బీర్ రెహ్మాన్ 30 తప్ప ఎవరూ పెద్దగా రాణించలేదు. ఒకదశలో లింటన్ దాస్, ముష్ఫికర్ కలిసి స్కోరు బోర్డును పరుగులెత్తిస్తున్న క్రమంలో ముష్ఫికర్‌ను విజయ్ శంకర్ చక్కటి బంతితో పెవిలియన్‌కు పంపాడు. అయితే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఫీల్డింగ్‌పై కూడా చర్చ జరిగింది. అవలీలగా వచ్చిన క్యాచ్‌లను కూడా వదిలేసిన కారణంగా బంగ్లాదేశ్ ఆ మాత్రం స్కోరు చేసింది. అయితే ఫీల్డింగ్‌లో లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంది. ప్రత్యర్థి జట్టు బలహీనంగా ఉన్న కారణంగా పెద్ద స్కోరు చేయలేకపోయింది. కానీ అదే బలమైన ప్రత్యర్థి ఉన్నప్పుడు మాత్రం భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అనంతరం 140 పరుగుల విజయ లక్ష్యంతో భారత్ బరిలోకి దిగింది. ఓపెనర్లుగా శిఖర్‌ధావన్, కెప్టెన్ రోహిత్ శర్మ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టారు. ధావన్, శర్మ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే భారీ షాట్‌కు ప్రయత్నించిన రోహిత్ శర్మ (17 పరుగులు, 13బంతులు 3×4) వికెట్ల ముందు ముస్తాఫిజుర్‌కు దొరికిపోయాడు. అనంతరం వచ్చిన రిషబ్ పంత్ 7 పరుగులు చేసి రుబెల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ధావన్‌కు జత కలసిన రైనా స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఇద్దరూ కలిసి స్టేడియం నలువైపులా చూడచక్కని షాట్లు కొట్టారు. ఈ క్రమంలోనే రుబెల్ వేసిన ఓ బంతిని తక్కువగా అంచనా వేసిన రైనా(28పరుగులు, 27బంతులు, 1×4, 1×6) మెహిందీకి చిక్కాడు. అడపా, దడపా సింగల్స్, డబుల్స్ తీస్తున్న ధావన్ (55 పరుగులు, 43 బంతులు, 5×4, 2×6) టస్కిన్ అహ్మద్ బౌలింగ్‌లో లింటన్‌దాస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. బంగ్లాదేశ్ బౌలింగ్‌లో రుబెల్‌కు 2 వికెట్లు, టస్కిన్ అహ్మద్‌కు ఒకటి, ముస్తాఫిజుర్ రెహ్మాన్‌కు ఒక వికెట్ దక్కింది. శనివారం మూడో మ్యాచ్ శ్రీలంక-బంగ్లాదేశ్‌ల మధ్య జరగనున్నది. మార్చి 12న శ్రీలంకతో భారత్ నాలుగో మ్యాచ్ ఆడనున్నది.



సమానమే కాదు.. కాస్త ఎక్కువే..!

మహిళలకు క్రికెటర్ కోహ్లి శుభాకాంక్షలు

ముంబై : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి శుభాకాంక్షలు తెలిపాడు. ఓ వీడియో సందేశాన్ని అభిమానులతో ట్విటర్ ద్వారా పంచుకున్నాడు. 'లైంగిక వేధింపులు, వివక్ష, గృహ హింస, బెదిరింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎన్నో అఘాయిత్యాలు ఎదుర్కొంటున్నప్పటికీ మహిళలు తమ జీవితాలలో ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు చెప్పండి పురుషులు, మహిళలు సమానమేనా? కాదు, వారు మన కంటే ఎక్కువే. ప్రపంచంలోని నారీమణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు'అని కోహ్లి అన్నాడు. అంతేకాదండోయ్ 'మీ జీవితంలో మీకు తారసపడిన అద్భుతమైన మహిళ ఎవరో ట్యాగ్ చేయండి' అని కోరిన కోహ్లి తన జీవితంలో చూసిన అద్భుతమైన మహిళ అనుష్క శర్మ అని ట్యాగ్ చేశాడు.

డీకాక్ మ్యాచ్ ఫీజులో కోత



డర్బన్: దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్, బ్యాట్స్‌మెన్ డికాక్‌కు కూడా ఐసీసీ జరిమాన విధించింది. డర్బన్‌లో ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన తొలి టెస్టులో మైదానం వెలుపల డేవిడ్ వార్నర్-డికాక్ మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఐసీసీ విచారణ చేపట్టింది. రిఫరీ చేపట్టిన విచారణలో వార్నర్ నోరు పారేసుకున్నట్లు తప్పును అంగీకరించడంతో అతని మ్యాచ్ ఫీజులో 75 శాతం కోత విధించారు. అలాగే మూడు డీమెరిట్ పాయింట్లను తన ఖాతాలో వేశారు. తాజాగా ఇదే వివాదంపై రిఫరీ డికాక్‌ను ప్రశ్నించి అతడి మ్యాచ్ ఫీజులో 25శాతం కోత విధించి ఒక డీమెరిట్ పాయింట్‌ను ఖాతాలో వేసింది. తొలి టెస్టు నాలుగో రోజు ఆటలో టీ విరామ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తున్న సమయంలో వార్నర్.. డికాక్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. సహచరులు వద్దని వారిస్తున్నా డికాక్‌పైకి దూసుకెళ్లడం అక్కడి కెమెరాల్లో నమోదైన సంగతి తెలిసిందే.

మహిళాభివృద్ధితోనే సమాజ పురోభివృద్ధి

మహిళా నాయకురాలు అక్కినేని వనజ ఉద్ఘాటన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధిని సాధించకుండా మానవ సమాజం అభివృద్ధి చెందదని, ఆ దిశగా యావత్ సమాజం మహిళాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు అక్కినేని వనజ ఉద్ఘాటించారు. గురువారం ఉదయం ఏపీ వర్కింగ్ ఉమెన్స్‌ఫోరం,జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్.లక్ష్మీదేవి అధ్యక్షతన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో జరిగిన మహిళా దినోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ సామాజికవేత్త, అడ్వకేట్ ఖమర్‌బేగం మాట్లాడుతూ, మహిళల వ్యక్తిత్వ వికాసానికి కుటుంబం నుండే హద్దులు పెడుతున్నారని, దాని ఫలితంగా వారి వ్యక్తిత్వ వికాసానికి ఆటంకం కలుగుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, మనుధర్మ శాస్త్రం పేరుతో మహిళల స్వేచ్ఛని హరించివేశారని, మతం పేరుతో వారి హక్కులను కాలరాశారని ఆయన విమర్శించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు టి.భవాని, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యవతి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె.లలిత,జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ డైరెక్టర్ శ్రీమతి జె.స్వాతి, నగర మహిళా సమాఖ్య కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, డా॥వెన్నెల, వర్కింగ్ ఉమెన్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కళ్ళేపల్లి శైలజ,ఎన్ఎఫ్‌టీయూ నాయకురాలు ఓర్సు భారతి,తదితరులు సభలో ప్రసంగించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు,ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాద్,కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య,కృష్ణాజిల్లా అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బుద్ది రమేష్,వెంకటరత్నం తదితరులు సభలో పాల్గొన్నారు.

రమణమ్మ,దుర్గలకు సన్మానం: మహిళా ఉద్యమంలో 5 దశాబ్ధాలుగా నిరంతర సేవలు అందించిన రావులపల్లి రమణమ్మ(ప్రకాశంజిల్లా), శ్రామిక మహిళా ఉద్యమంలో గ్రామీణ మహిళా ఉద్యమాలకు విశేష తోడ్పాటు అందించిన సీహెచ్ దుర్గా కోటేశ్వరరావులను ఈ సభలో ఘనంగా సత్కరించారు.

చివరి అస్త్రంగానే రాజీనామాలు

- బీజేపీ జాతీయ నేతలు ఆలోచించాలి
- లేదంటే కాంగ్రెస్‌కు పట్టిన గతే...
- శాసనసభలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీల అమలు కోసం మూడున్నరేళ్లు వేచి చూసామని, అయినప్పటికీ కేంద్రం మొండిచెయ్యి చూపడంతో చివరి అస్త్రంగా ఇద్దరు మంత్రులతో రాజీనామాలు చేయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కేవలం రాజకీయ కారణాలవల్లే రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాష్ట్రానికి 5 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామంటే కాదు.. 10 ఏళ్లు కావాలని ఆనాటి సభలో ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ డిమాండు చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏపీకి 10 ఏళ్లు హోదా ఇస్తామని మ్యానిఫెస్టోలో బీజేపీ పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రానికి న్యాయం చేయాలని తాను ఢిల్లీకి 29 సార్లు వెళ్లాలని, ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ వైఖరులను చూస్తే జాతీయపార్టీలపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. కేంద్రమంత్రి అరుణ్‌జైటీ బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు తనను ఎంతగానో బాధించాయన్నారు. 'మావి గొంతెమ్మ కోర్కెలు కాదు.. రాజ్యసభలో ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ గట్టిగా చెప్పింది.. నాకు ఎవ్వరిపైనా కోపం లేదు..' అని చంద్రబాబు బీజేపీ నేతల తీరును వివరించారు. బీజేపీ జాతీయ నేతలు ఈ విషయమై ఒకసారి ఆలోచించాలని, ప్రజల మనోభావాలను గమనించాలని కోరారు. 'నేను ఒకటే అడిగాను, ప్రత్యేక హోదా.. ప్రత్యేక హోదాలో ఏవైతే ఉన్నాయో అవన్నీ ఇవ్వాలని అడిగితే కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన 1050 కోట్లకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూసీ) పంపిస్తే.. పంపలేదని కేంద్రం చెబుతోందన్నారు. ప్రత్యేక హోదా కోసం సిద్ధాంతాలను పక్కనపెట్టి గట్టిగా కోరాలన్నారు. లేదంటే కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేందుకు మీరు కూడా సహకరించాలని రాజీనామా చేసిన మంత్రులు కామినేని శ్రీనివాస్, పి మాణిక్యాలరావుతోపాటు బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే ఎ సత్యనారాయణలను ఆయన కోరారు. వీరిద్దరూ చాలా బాగా పనిచేసారని కితాబిచ్చారు. వారివారి శాఖల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసించారు. హోదా అంశమై రాష్ట్ర ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని చంద్రబాబు మరోసారి విజ్ఞప్తి చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.